ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org
సోమవారం 25.05.2026 | సంపుటి : 12 సంచిక : 305 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## భారత రాజకీయాలను కుదిపేస్తున్న

# 'కాక్రోచ్' విప్లవం




## ప్రధాన పొలిటికల్ పార్టీలను మించి ఫాలోవర్స్

### విస్ఫోటనంలా పేలిన అసంతృప్తి జ్వాలలు
### దేశవ్యాప్తంగా ఎగిసిపడుతున్న సరికొత్త విప్లవం
### ఉలిక్కిపడుతున్న సాంప్రదాయక రాజకీయ పార్టీలు



## తెలంగాణలోని పలు నియోజకవర్గాల్లోనూ కొనసాగుతున్న ట్రెండ్

దేశ రాజకీయ యవనికపై మునుపెన్నడూ లేని ఒక సరికొత్త డిజిటల్ విప్లవం వెల్లువలా దూసుకొస్తోంది. కేవలం కొద్దిరోజుల వ్యవధిలోనే కోట్ల మంది యువతను తనవైపు తిప్పుకుని, అధికార-ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న సరికొత్త సంచలనం "కాక్రోచ్ జనతా పార్టీ" (సీజేపీ). భారతీయ రాజకీయ చరిత్రలో కేవలం సోషల్ మీడియా వేదికగా పురుడుపోసుకొని, ఇంతటి తీవ్రమైన ప్రజా ఉద్యమంగా మారిన సందర్భం మరొకటి లేదు. వ్యవస్థాగత లోపాలపై, నిరుద్యోగంపై యువత గుండెల్లో రగులుతున్న లావా ఇప్పుడు 'బొద్దింక' రూపంలో విస్ఫోటనమవుతోంది.



**హైదరాబాద్, మే 24 (జనంసాక్షి)**

గత వారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నిరుద్యోగ యువతను ఉద్దేశించి చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు (యువతను 'బొద్దింకలు', 'సమాజ పరాన్నజీవులు' అని సంబోధించారనే ఆరోపణలు) యువత స్వభిమానాన్ని దెబ్బతీశాయి. ఆ అవమానం నుంచే ఈ "కాక్రోచ్ జనతా పార్టీ" పుట్టుకొచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ సోషల్ మీడియా వ్యూహకర్త అభిజీత్ దీప్కే మే 16న ప్రారంభించిన ఈ వ్యంగ్య రాజకీయ ఉద్యమం.. చూస్తూ చూస్తూనే ఒక దేశవ్యాప్త ప్రభంజనంగా మారింది. "మమ్మల్ని తొక్కేయాలని చూశారు.. కానీ మేము మరింత బలంగా తిరిగొచ్చాం" అనే పవర్‌ఫుల్ నినాదంతో ఈ పార్టీ ఇన్ స్టాగ్రామ్‌లో కేవలం 4-5 రోజుల్లోనే అధికార బీజేపీ (8.8 మిలియన్లు) ఫాలోవర్ల సంఖ్యను దాటేసి, 20 మిలియన్ల (2 కోట్లు) పైగా ఫాలోవర్లతో సరికొత్త రికార్డు సృష్టించింది.

**ప్రెజర్ కుక్కర్ యువత.. ఐదు సూత్రాల ఎజెండా**

దేశవ్యాప్తంగా నిరుద్యోగ రేటు 8 శాతానికి పైగా నమోదవుతున్న వేళ, పేపర్ లీకేజీలు (ఇటీవలి నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వంటివి), ఉపాధి అవకాశాల లేమితో ఉడికిపోతున్న యువతకు ఈ వేదిక మిగతా 2లో..

### అభిజిత్ తల్లిదండ్రుల ఆందోళన

'వాడు క్షేమంగా ఇంటికి రావాలని మేము కోరుకుంటున్నాం. రాజకీయాల్లో కొనసాగాలా వద్దా అనేది వాడి నిర్ణయం. అయితే వాడు రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం మాకు ఇష్టం లేదు. మా మాట వింటాడో లేదో నాకు తెలియదు. ఈ విషయంలో నేను వాడికి మద్దతివ్వను. వాడి గురించి నాకు ఆందోళనగా ఉంది' అని అభిజిత్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. తను భారత్‌కు వస్తే అరెస్ట్ చేస్తారని అభిజిత్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్టు ఆందోళన వ్యక్తం చేశారు.

# జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ బీమా'


**రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున వర్తింపు**

**రక్షణమహిళా సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు**

**సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో ప్రజా సంక్షేమమే లక్ష్యం**

**పేదరికంపై కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఖమ్మంబ్యూరో(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇ చ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, నిరుపేదల ముంగిటకే సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి స్పష్టంగా ప్రకటించారు. రాష్ట్ర ఆవిర్భావ దినో త్సవ కానుకగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మక 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కులమతాలకు అతీతంగా, పేద ధనిక భేదం లేకుండా రాష్ట్రంలోని కోటీ 15 లక్షల కుటుంబాలకు ఈ భీమా రక్షణ కవచంలా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు కనీసం లక్ష రూపాయల సాయం కోసం చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని భట్టి విమర్శించారు.



అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే, ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోయిన ప్రతి ఇంటికీ రూ. 5 లక్షల భీమా వర్తింపజేయాలని ప్రాజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనికి సంబంధించి అధికారులు త్వరలోనే ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మిగతా 2లో..

# కాంగ్రెస్ కరెంటు కుట్రలను ప్రజలు వ్యతిరేకించాలి

- ఉచిత విద్యుత్తు రద్దు కోసమే కాంగ్రెస్ మోటార్లకు మీటర్లను పెడుతుంది
- ప్రీపెయిడ్ మీటర్లతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయబోతున్నది : కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రీపెయిడ్ మీటర్లు తీసుకువచ్చేందుకు వ్యవసాయ మోటార్లకి మీటర్లు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పైన కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ఉచిత విద్యుత్తు ఎత్తగొట్టేందుకుప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని పూర్తిగా ఆదాని వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. మోటార్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతన్నలకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ఎత్తగొట్టే కుట్ర చేస్తున్నదన్నారు. దీంతోపాటు ప్రతి ఒక్కరి మిగతా 2లో..

# తరుగుపేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

### ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

- ఇప్పటి వరకు 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశాం
- రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయి
- రాష్ట్రంలో గన్నీ బ్యాగులకు కొరత లేదు.. విపక్షాలు అసత్య ప్రచారాలు చేయొద్దు
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



**హైదరాబాద్(జనంసాక్షి):** రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఇతర మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 8 వేల 749 కోట్ల రూపాయల కనీసం మద్దతు ధరను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 2లో..

### ఆర్మీ జవాన్లే లక్ష్యంగా ...

## జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు అనుబంధ రైలుపై

# ఆత్మాహుతి దాడి

**24 మంది మృతి 80మందికి పైగా గాయాలు**

**తామే దాడి చేశామని ప్రకటించుకున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు అనుబంధంగా ఉన్న షటిల్ ప్యాసింజర్ రైలుపై ఆత్మాహుతిదాడి చోటుచేసుకుంది. క్వెట్టా ప్రాంతంలోని చమన్ ఫాటక్ రైల్వేస్టేషన్ సమీపంలో నేటి ఉదయం 8.00 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. 80మందికి పైగా గాయపడ్డారు. ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న రైలు స్టేషన్ సమీపంలోని సిగ్నల్ దాటుతుండగా.. పేలుడు పదార్థాలతో ఉన్న వాహనం రైలు బోగీని ఢీకొట్టినట్లు మిగతా 2లో..



# 60 రోజుల పాటు హర్మూజ్ ఓపెన్




### జలసంధిని తెరవనున్న ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**

ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం ముగింపు చర్చలు వేగవంతమయ్యాయి. ఏ క్షణంలో అయినా ఈ విషయంపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇరుదేశాలు 60 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరుపుతున్నట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఇందులో హర్మూజ్‌ను 60 రోజులపాటు తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమాలను నిలిపివేయడం వంటి అంశాలు ఉన్నట్లు పేర్కొంది. ఒప్పందంలో భాగంగా జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించడానికి ఇరాన్ అంగీకరించినట్లు తెలిపింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తన దిగ్బంధనాన్ని ఎత్తివేస్తుందని.. దీంతో ఇరాన్ సైతం స్వేచ్ఛగా ప్రపంచ దేశాలకు చమురును మిగతా 2లో..

## 140 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలే అమెరికాకు ముఖ్యం



**ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలిసి నడుస్తాం: రూబియో**

**మరికొన్ని గంటల్లో ఇరాన్‌కు సంబంధించి శుభవార్త వింటారని వెల్లడి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఆ దేశ బృందం భారత్‌కు రాబోతోందని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తెలిపారు. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి రూబియోతో చర్చల అనంతరం.. దిల్లీలో సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. అమెరికాతో ఒప్పందంలోని కొన్ని అంశాలపై భారత్ అభ్యంతరం చెబుతోందన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. గల్ఫ్ సంక్షోభం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించినట్లు రూబియో వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్- అమెరికా కలిసి నడుస్తాయన్నారు. "భారత్, మిగతా 2లో..

# ఆల్చిప్పల కోసం వెళ్లి అనంతలోకాలకు..

**నదిలో దిగి.. ఒకే కుటుంబంలోని 11 మంది గల్లంతు**

**8 మంది మృతదేహాలు వెలికితీత**

**కర్ణాటకలోని భత్కళ తాలూకా సిరాలి గ్రామంలో ఘటన**



**బెంగళూరు(జనంసాక్షి):** కర్ణాటకలోని తత్తెహక్కలు నదిలో వేటకు దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. జాలర్ల సాయంతో 8మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 7మంది మహిళలు, మిగతా 2లో..

## శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం

2లో..

సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్ వద్దకు దూసుకొచ్చిన బలగాలపై కాల్పులకు దిగిన దుండగుడు.. భద్రతా సిబ్బంది ఎదురుకాల్పుల్లో నిందితుడి మృతి

ఆర్మీ జవాన్లే లక్ష్యంగా ...

## జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు అనుబంధ రైలుపై ఆత్మాహుతి దాడి..

అధికారులు వెల్లడించారు. దీంతో పేలుడు సంభవించిందన్నారు. మృతుల్లో ఎక్కువమంది సైనికులే ఉన్నారన్నారు. పేలుడు దాటికి రైలు పాక్షకంగా దెబ్బతిందని.. 10కి పైగా వాహనాలు దగ్ధమయ్యాయని తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు చోటుచేసుకోవడంతో రైళ్ల రాకపోకల్లో అంతరాయం కలిగినట్లు అధికారులు వెల్లడించారు. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్లే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను స్టేషన్‌లో నిలిపివేసినట్లు తెలిపారు. పేలుడు తీవ్రతకు జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీకి మంటలు అంటుకొన్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. పేలుడు జరిగిన ప్రాంతానికి సమీపంలో ప్రజలు గుమిగూడవద్దని పాక్ హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**మేమే దాడి చేశాం: బలోచ్ లిబరేషన్ ఆర్మీ**

రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు ఘటన తమ పనేనని బలోచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి పాక్ దళాల సిబ్బందిని తీసుకువెళ్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బలోచ్ ఆర్మీ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. బలోచ్ ఆర్మీలోని మహిళా షైనాజ్ బలోచ్ ఓ వీడియోలో మాట్లాడుతూ.. పాక్ నేతలు తమ ప్రజలను అణచివేస్తున్నారని అన్నారు. తమ సంస్కృతి, గుర్తింపు, హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు గురైన ప్రతి బలోచ్ బిడ్డ తన మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు.

**జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఎప్పటి నుంచో ఉగ్రవాదులు, రెబల్స్ టార్గెట్లో..**

జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్నేళ్లుగా ముప్పు పొంచిఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) గ్రూప్ ఈ రైలును పలుమార్లు లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైల్లో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్‌కు తరలిస్తుంటారు. దీంతో మిలిటెంట్ గ్రూప్‌లకు ఇది హాట్ టార్గెట్‌గా మారింది. 2018, 2023లో పలుమార్లు దీనిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. తాజాగా కూడా సైనిక కుటుంబాలు ప్రయాణిస్తుండగానే దాడి చోటు చేసుకొంది. 2018లో పంజాబ్ వెళుతున్న రైలుకు అత్యంత సమీపంలో రెండు బాంబులు పేలాయి. బలోచ్ రెబల్స్ రిమోట్ కంట్రోల్ సాయంతో ఈ దాడికి పాల్పడ్డారు. నాడు ప్రమాదం నుంచి ఇది బయటపడింది. 2023 జనవరి 19న రైల్లో బాంబుపేలి 13 మంది గాయపడ్డారు. క్వెట్టాకు 150 కిలోమీటర్ల దూరంలోని బొలాన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. నెల రోజుల తర్వాత అదే రైలు క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతుండగా బాంబుపేలుడు జరిగింది. దీనిలో ఒకరు మరణించారు. ఇక 2024లో క్వెట్టా రైల్వేస్టేషన్‌లో పేలుడు జరిగి 26మంది ప్రాణాలు కోల్పోయారు. 2025లో కూడా పాక్‌లోని బోలన్ జిల్లాలో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి వందల మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి. ఇదీ చదవండి: చైనా బొగ్గుగనిలో పేలుడు 90 మంది కార్మికుల మృతి

## రాష్ట్రప్రభుత్వమే మక్కలు కొనుగోలు చేస్తుంది

**కేంద్ర స్పందించకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం: మంత్రి తుమ్మల**



హైదరాబాద్(జనంసాక్షి):మొక్క జొన్న కొనుగోళ్లపై కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన రూ.4వేల కోట్లకు అదనంగా మరో రూ.1800 కోట్లు.. సీఎం కేటాయించారని చెప్పారు. ఈ ఏడాది రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న భారీ దిగుబడుల వచ్చిన నేపథ్యంలో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రూ.1100 కోట్లతో మొక్క జొన్న కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. పొద్దుతిరుగుడు పంట 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాల వారీగా మొజొన్న కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల స్పష్టం చేశారు.

## భారత రాజకీయాలను కుదిపేస్తున్న 'కాక్రోచ్' విప్లవం

ప్రధాన పొలిటికల్‌పార్టీలను మించి ఫాలోవర్స్ విస్ఫోటనంలా పేలిన అసంతృప్తి జ్వాలలు దేశవ్యాప్తంగా ఎగిసిపడుతున్న సరికొత్త విప్లవం ఉలిక్కిపడుతున్న సాంప్రదాయక రాజకీయ పార్టీలు తెలంగాణలోని పలు నియోజవర్గాల్లోనూ కొనసాగుతున్న ట్రెండ్

ఒక బలమైన గొంతుకగా మారింది. ఈ పార్టీ కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, ఒక పటిష్టమైన ఎజెండాతో ముందుకు సాగుతోంది.

**రాజ్యాంగ పరిరక్షణ :** అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సెక్యులర్, సోషలిస్ట్ విలువల రక్షణ.

**పారదర్శకత :** తాము పూర్తిగా ఆర్టీఐ పరిధిలోకి వస్తామని, ఎటువంటి "రహస్య ఫండ్స్" (పీఎం కేర్స్ తరహాలో) సేకరించబోమని ప్రకటన.

**యువజన హక్కులు :** కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా, స్వతంత్ర మీడియాకు మద్దతుగా నిలవడం.

**వ్యంగ్య అర్హతలు :** 'నిరుద్యోగిగా ఉండటం', 'రోజుకు కనీసం 11 గంటలు ఆన్‌లైన్‌లో గడపడం', 'వ్యవస్థను ప్రశ్నించే నైపుణ్యం ఉండటం' వంటి వ్యంగ్య నిబంధనలతో లక్షలాది మంది ఈ పార్టీలో డిజిటల్ మెంబర్‌షిప్ తీసుకుంటున్నారు.

**ఆదరణ ఓర్వలేక అణిచివేత పర్వం**

కాక్రోచ్ జనతా పార్టీకి వస్తున్న అపూర్వ ఆదరణ చూసి అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు సోషల్ మీడియా అకౌంట్లపై నిర్బంధాలు మొదలయ్యాయి. ఇటీవల భారతదేశంలో ఈ పార్టీ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాను నిలిపివేయగా, మే 23 (శనివారం) ఉదయం ఏకంగా పార్టీ వెబ్‌సైట్‌ను కూడా ప్రభుత్వం బ్లాక్ చేసింది. దీనికి తోడు ఈ మూవ్‌మెంట్ వెనుక విదేశీ శక్తులు (పాకిస్తాన్, బంగ్లాదేశ్ బోట్లు) ఉన్నాయంటూ ఐటీ శాఖ వర్గాల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ప్రాణ బెదిరింపులు కూడా వస్తున్నట్టు సమాచారం. అయితే వారంరోజుల్లోనే ఈ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య 2 కోట్లు దాటింది. ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా చెప్పుకుంటున్న బీజేపీకి ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్ల సంఖ్య ఇందులో సగంకంటే తక్కువ. ఈ పార్టీకి 2 కోట్లమంది ఫాలోవర్లు ఉండగా, బీజేపీకి సుమారు 93 లక్షలమంది, కాంగ్రెస్ పార్టీకి సుమారు 1 కోటీ 30 లక్షలమంది ఫాలోవర్లు ఉన్నారు.

**దూకుడుగా స్పందిస్తున్న మద్దతుదారులు**

ప్రభుత్వ అణిచివేత చర్యలపై కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులు మరింత దూకుడుగా స్పందిస్తున్నారు. "వెబ్‌సైట్‌లను, అకౌంట్లను బ్లాక్ చేయగలరు కానీ.. యువత గుండెల్లో రగులుతున్న ఆలోచనలను బ్లాక్ చేయలేరు" అంటూ 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' పేరిట కొత్త అకౌంట్లతో దూసుకొస్తున్నారు. బొద్దింకలు ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా బతకగలవనే సూత్రాన్ని గుర్తుచేస్తూ, ఈ డిజిటల్ విప్లవం అంత సులువుగా చల్లారదని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వంటి ప్రముఖ నాయకులు కూడా యువతలోని ఈ అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించి తీరాలని వ్యాఖ్యానించడం విశేషం. వ్యంగ్యంగా మొదలైన ఒక ఆన్‌లైన్ మీమ్ పేజీ.. నేడు దేశంలో యువత ఆవేదనకు, వ్యవస్థపై తిరుగుబాటుకు ఒక బలమైన రాజకీయ రూపంగా రూపాంతరం చెందింది. ఈ ఎగిసిపడుతున్న విప్లవం రాబోయే రోజుల్లో సంప్రదాయ ఎన్నికల రాజకీయాలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందో చూడాలి.

## 60రోజుల పాటు హర్మూజ్ ఓపెన్

విక్రయించుకోగలదని పేర్కొంది. ఈ ముసాయిదా ఒప్పందంలో అమెరికా దాని మిత్ర దేశాలు ఇరాన్‌పై దాడి చేయకూడదని.. దానికి ప్రతిగా ఇరాన్ కూడా అమెరికాపై గానీ, దాని మిత్రదేశాలపై గానీ ఎలాంటి ముందస్తు దాడులు చేయకూడదనే ప్రతిపాదన ఉన్నట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. ఖతార్ బ్యాంకుల్లో స్తంభింపజేసిన 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.55 వేల కోట్లు) టెహ్రాన్ ఆస్తులను విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం అంగీకరించినట్లు తెలిపింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ కూడా అంశం కూడా ఈ ఒప్పందంలో ఉన్నట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. మరోవైపు ఇరుదేశాల మధ్య తుది ఒప్పందం కుదిరితేనే ఇరాన్‌ను మోహరించి ఉన్న తమ దళాలు వెనక్కు వెళ్తాయని అమెరికా అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## ఆల్చిప్పల కోసం వెళ్లి అనంతలోకాలకు..

ఒకరు పురుషుడు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో నదిలో ఆల్చిప్పలు విరివిగా దొరుకుతాయి. దీంతో భత్కళ తాలూకా సిరాలి గ్రామానికి చెందిన ఓ కుటుంబం (14మంది) ఉదయం 10గంటల సమయంలో ఆల్చిప్పల కోసం నదిలోకి దిగారు. అదే సమయంలో నది ప్రవాహం పెరగడంతో వారిలో ముగ్గురు కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా మిగిలిన వారు కూడా ప్రవాహంలో కొట్టుకపోయారు. వెంటనే స్థానిక జాలర్లు నదిలోకి దిగి ముగ్గురిని రక్షించారు. అప్పటికే మిగిలిన వారు గల్లంతయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## తరుగుపేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల చివరికల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము,జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా టాబ్ లో నమోదు చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు వార్తలను ఖండించాలని, ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించాలని, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన విషయాలను ప్రచారం చేయాలని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపు విషయంలో నెలల తరబడి వేచి ఉండవలసి వచ్చేదని, ఇప్పుడు వెంటనే చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్‌- గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.

## 'మరికొన్ని గంటల్లో గుడ్ న్యూస్'

**రూబియో కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. మరికొన్ని గంటల్లో ఇరాన్‌కు సంబంధించి శుభవార్త వింటారని చెప్పారు. భారత పర్యటనలో ఉన్న ఆయన.. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి సమస్యను పరిష్కరించే ప్రతిపాదనలపై గత 48 గంటల్లో కొంత పురోగతి వచ్చిందన్నారు. త్వరలో ఇరాన్‌తో ఒప్పందం కుదిరేందుకు అవకాశముందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన కొన్ని గంటల్లోనే రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు.

## జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ బీమా'

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**వ్యాపార వేత్తలుగా మహిళలు :**

మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగా మే 27వ మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు కేటాయించే పథకాన్ని ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. లక్ష కోట్లకు వడ్డీలేని రుణాలు : మహిళా సంఘాలకు ఏటా రూ. 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైతే దీనిని రూ. లక్ష కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని తెలిపారు. త్వరలోనే మహిళా వ్యాపారవేత్తల కోసం ప్రత్యేకంగా 550 ఆర్టీసీ బస్సులను కేటాయించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.గ్రామాల్లో 'సన్నబియ్యం' పండుగ: మార్కెట్లో కిలో రూ. 50-55 పలుకుతున్న మేలు రకం సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఉచితంగా అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని సగర్వంగా ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున నేరుగా పేదల ఇళ్లకే సన్న బియ్యాన్ని పంపిస్తామని చెప్పారు.గృహజ్యోతితో 53 లక్షల కుటుంబాలకు లబ్ధి :రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అంది స్తుండటం వల్ల రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు కరెంటు బిల్లుల భారం తప్పిందని అన్నారు. అనేక గ్రామాల్లో 95 శాతం ప్రజలు 'జీరో' బిల్లులు పొందుతున్నారని ఆయన వివరించారు.సొంతింటి కల సాకారం: గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని భట్టి ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించుకోవడానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. నిన్నటి క్యాబినెట్ సమావేశంలో మరో 2 లక్షల ఇళ్లను అదనంగా మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్య లక్ష్యమని అని చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక కార్యకర్తలే దగ్గరుండి గృహప్రవేశాలు చేయించాలని సూచించారు .అల్పాహారంతో విద్యార్థులకు భరోసా:ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా ఉచిత 'బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని ప్రవేశపెట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి గింజను కొంటాం: రైతుల పండించిన ప్రతి మొక్కజొన్న గింజను, ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని రైతులకు ఉప ముఖ్యమంత్రి ధైర్యం చెప్పారు. దేశంలో ఎక్కడా మొక్కజొన్న కొనుగోళ్లు జరగకపోయినా, తెలంగాణలో పండిన ప్రతి మొక్కజొన్న గింజను, ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులను ఆదుకుంటోందని అన్నారు. రైతుల అవసరాల కోసం క్యాబినెట్‌లో చర్చించి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కుట్రలను తిప్పికొట్టండి!ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, అటువంటి కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ పాంప్లెట్లు పంపిణీ చేస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు గర్వంగా, తలెత్తుకుని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వాస్తవాలు వివరించాలని భట్టి విక్రమార్క కోరారు. "మేము ప్రజలకు మాట ఇచ్చాం, ఈరోజు చేసి చూపిస్తున్నాం" అని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల ముందుకు ధైర్యంగా వెళ్లి చెప్పేలా తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. "ఇది మన ప్రభుత్వం, ఇది మనం చేసుకున్న అభివృద్ధి" అని సగర్వంగా చెప్పుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించిందని భట్టి విక్రమార్క చెప్పారు.




## కాంగ్రెస్ కరెంటు కుట్రలను ప్రజలు వ్యతిరేకించాలి

ఇంట్లో ప్రస్తుతం ఉన్న మీటర్లు తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు నిన్న క్యాబినెట్లో మీటర్లన్నింటినీ తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నది క్యాబినెట్. మొత్తం గ్రామాల్లో, పట్టణాల్లో వ్యవసాయాలకు ప్రీపెయిడ్ మీటర్లు వస్తాయన్నారు.మోటార్లకు మీటర్లు రాకముందే?ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు తేక ముందే కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు తీసివేయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ విద్యుత్ రంగంలో చేస్తున్న కరెంటు కుట్రల పైన తిరగబడాలని కోరారు. ఎన్నికల ముందే ప్రజలకు భారత రాష్ట్ర సమితి కాంగ్రెస్ వస్తే ఉచిత విద్యుత్తు పోతుందని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. మోటర్ల దగ్గర మీటర్లు వస్తాయని?. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో ప్రవేట్ సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పజెప్తారని కెసిఆర్ హెచ్చరించారని కేటీఆర్ గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్న ప్రీపెయిడ్ మీటర్లను కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తీసుకురావడం దారుణం అన్నారు. ఈ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంత ఒత్తిడి చేసినా, 30 వేల కోట్ల రూపాయల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపినా కేసీఆర్ ఎదిరించారు, మీటర్లు పెట్టలేదు. కానీ, రానున్న మూడు నెలల్లోనే మొత్తం మీటర్లు పెడతామని చెప్పి నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని కేటీఆర్ అన్నారు. రానున్న మూడు నెలల్లోనే ఉన్న మీటర్లు పీకేసి, ప్రీపెయిడ్ మొబైల్స్ మాదిరి ప్రీపెయిడ్ కరెంట్ మీటర్లను తీసుకురాబోతున్నదని కేటీఆర్ అన్నారు. అయితే కాంగ్రెస్ ఉచిత కరెంట్ ను ఎత్తగొట్టడం కోసమే ప్రీపెయిడ్ మీటర్లను తీసుకువస్తుందని కేటీఆర్ ఆరోపించారు. కేవలం ఉచిత కరెంట్ ను రద్దు చేయాలన్న ఏకైక ఉద్దేశంతోనే అదాని, అంబానీలకు విద్యుత్ సంస్థలను అప్పగించాలన్న లక్ష్యంతోనే క్యాబినెట్ నిన్న ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు.కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు బలమైన గుణపాఠం కాంగ్రెస్ పార్టీకి చెప్తారని కేటీఆర్ అన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి, అడుగడుగునా అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్ కి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఐదు సంవత్సరాల కాలంలో సగం పూర్తయినా ఇప్పటిదాకా ప్రజలకు గాని, రాష్ట్రానికి గాని కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేక చేతులెత్తేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, పరిపాలనా వైఫల్యాలు, అవినీతి పైన ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, ఖచ్చితంగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు.

సభ్యత్వ నమోదు అనంతరం శిక్షణ కార్యక్రమాలు

త్వరలోనే సభ్యత్వ నమోదుకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించుకుంటాము. ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 1000 మంది వరకే పార్టీ కార్యకర్తలకు ఈ శిక్షణ ఇస్తాము. దీనితో పాటు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల పన్న, అన్యాయాల పైన, ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి మోసం చేస్తున్న తీరు పైన కూడా అవగాహన కల్పిస్తాము అన్నారు.ఈసారి సభ్యత్వం పూర్తిగా డిజిటల్ రూపంలో ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ముందుగా సభ్యత్వ నమోదు, తర్వాత శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని కేటీఆర్ తెలిపారు. ఈరోజు అంబర్పేట నియోజకవర్గం లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. హైదరాబాద్ నగర పరిధిలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజా సమస్యల పైన, కాంగ్రెస్ ప్రభుత్వం పైన పోరాటం చేసిన వారికే కార్పొరేటర్ టికెట్లు ఇస్తామని కేటీఆర్ తెలిపారు. కేవలం గెలుపే లక్ష్యంగా సర్వేల ఆధారంగా పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులకు అవకాశం ఇస్తుంది అన్నారు.ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల కాలంలో చేసిన అన్యాయాలు, అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రెండున్నర సంవత్సరాలుగా ఒక్కటంటే ఒక్క ఇల్లు కట్టని రేవంత్ రెడ్డి, అడ్డగోలుగా 'హైడ్రా' పేరుతో వేల ఇండ్లు కూలగొట్టారు అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో లక్ష ఇండ్ల నిర్మాణం చేస్తే, కాంగ్రెస్ మాత్రం వేల ఇండ్లు కూలగొట్టింది అన్నారు.

## శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్ష భవనం శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్ వద్దకు దూసుకొచ్చిన ఓ దుండగుడు బలగాలపై కాల్పులకు దిగాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వైట్‌హౌస్ కాంప్లెను లాక్‌డౌన్ చేశారు. సీక్రెట్ సర్వీస్ అధికారులు ఎదురు కాల్పులు జరపగా నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపారు. దాదాపు 15 నుంచి 30 రౌండ్లు కాల్పులు జరిగాయని పేర్కొన్నారు. కాల్పుల సమయంలో నిందితుడికి సమీపంలో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. నిందితుడిపై కాల్పుల తర్వాత ఆ ప్రాంతాన్ని భద్రతాబలగాలు పూర్తిగా తనిఖీ చేశాయి. అంతా సద్దుమణగడంతో 45 నిమిషాల తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేశారు.శ్వేతసౌధం సమీపంలో వరుస కాల్పుల శబ్దాలు విన్నట్లు జర్నలిస్టులు తెలిపారు. జర్నలిస్టులు శ్వేతసౌధం నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్న సీక్రెట్ సర్వీసెస్ అధికారులు వారిని ప్రెస్ బ్రీఫింగ్ రూమ్‌లోకి వెళ్లాలని ఆదేశించారు. కాల్పుల సమయంలో అధ్యక్షుడు ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు వైట్‌హౌస్ వద్ద భారీగా మోహరించాయి. శ్వేతసౌధం సమీపంలో 17వ స్ట్రీట్, పెన్సిల్వేనియా ఎవెన్యూ సమీపంలో ఘటన జరిగింది. కాల్పుల ఘటనను ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సీక్రెట్ సర్వీసెస్ అధికారులకు ఈ ఘటనలో ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు.


**ఏళ్లతరబడి వైట్‌హౌస్ చుట్టూ చక్కర్లు..రెండుసార్లు అరెస్ట్**

అమెరికా అధ్యక్ష భవనం శ్వేత సౌధం సమీపంలో కాల్పులకు తెగబడిన దుండగుడు సీక్రెట్ సర్వీస్ అధికారులు జరిపిన ఎదురు దాడిలో మృతిచెందాడు. నిందితుడిని నసీర్ బెస్ట్‌గా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. కొన్నేళ్లుగా అతడు వైట్ హౌస్ సమీపంలోని భద్రతా చెక్‌పాయింట్ల వద్ద పలుమార్లు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు వెల్లడించారు. ఏడాది క్రితం రెండు సార్లు వైట్‌హౌస్ సమీపంలోని నిషేధిత ప్రాంతాల్లోకి ప్రవేశించడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దీంతో ఆ ప్రాంగణానికి దూరంగా ఉండాలని కోర్టు అతడికి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నిందితుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ కాష్ పటేల్ మాట్లాడుతూ.. దాడి వెనుక ఏదైనా రాజకీయ కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. వైట్‌హౌస్ సమీపంలో దుండగులు తరచూ దాడులకు పాల్పడుతుండడంతో పోలీసులు, ఇతర బలగాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. శనివారం అర్ధరాత్రి అమెరికా అధ్యక్ష భవనం శ్వేత సౌధం సమీపంలోని సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్ వద్దకు దూసుకొచ్చిన నసీర్ బలగాలపై కాల్పులకు దిగాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురు కాల్పులు జరపగా నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపారు.

## 140 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలే అమెరికాకు ముఖ్యం

అమెరికా రెండూ ఉగ్రవాద బాధిత దేశాలే. ఈ రెండూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు. వ్యూహాత్మక భాగస్వాములు. భారత్‌లో పర్యటించడం గర్వంగా ఉంది" అని అమెరికా విదేశాంగ మంత్రి అన్నారు.

**ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారు..**



అమెరికా వలసదారులకు మిత్రదేశమని మార్కో రూబియో బలంగా చెప్పారు. అగ్రరాజ్యంలో భారతీయులపై వివక్ష చూపటాన్ని మూర్ఖుల చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారని.. వారు దేశానికి ఉన్న విస్తృతమైన విధానాలకు ప్రాతినిధ్య వహించరని పేర్కొన్నారు. ఈ విషయంలో భారతీయుల ఆందోళనలను సీరియస్‌గా తీసుకొంటామని పేర్కొన్నారు. "వీటికి ఎలా స్పందించాలో అర్థం కావడంలేదు. కానీ, వీటిని తీవ్రంగా పరిగణిస్తాము" అని పేర్కొన్నారు. అమెరికా సమాజాన్ని , ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో భారతీయుల పాత్రను ఆయన కొనియాడారు. భారతీయులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు 20 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చిన విషయాన్ని తాను అంగీకరిస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ అంకె ఇంకా పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

## ప్రయాణికుల భద్రతకు హైటెక్ రక్షణ కవచం

- టీజీఆర్టీసీ బస్సుల్లో నిఘా నేత్రాలు!
- ప్రయాణికుల రక్షణకు ఎండీ నాగిరెడ్డి వినూత్న శ్రీకారం
- 'బస్సులో భరోసా' పేరిట ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం




హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రయాణికుల రక్షణ కోసం మరో విప్లవాత్మక నిర్ణయంతో ముందుకొచ్చింది... ప్రమాదాలు, చోరీలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) నాగిరెడ్డి సరికొత్త వ్యూహాన్ని అమలులోకి తెచ్చారు. ప్రయాణికులు ఎలాంటి భయాందోళనలు లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేలా చూసేందుకు బస్సుల్లో అత్యాధునిక సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటుకు ఆయన శ్రీకారం చుట్టారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ "బస్సులో భరోసా" పేరిట రూపొందించిన ఈ సరికొత్త హైటెక్ భద్రతా ప్రాజెక్టును తొలి దశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ సరికొత్త భద్రతా వ్యవస్థ కింద ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో ఈ అత్యాధునిక నిఘా నేత్రాలను అమర్చారు. డ్రైవర్ క్యాబిన్ సమీపం, మహిళల కోసం కేటాయించిన ప్రత్యేక సీట్లు, ఫుట్‌బోర్డుతో పాటు బస్సు లోపల చివరి సీటు వరకు ప్రతి అంగుళం స్పష్టంగా కవర్ అయ్యేలా ఈ కెమెరాలను ప్రత్యేక సాంకేతికతతో అమర్చడం విశేషం. బస్సు ఎక్కే ప్రతి వ్యక్తి ముఖ కదలికల నుంచి ప్రయాణంలో జరిగే ప్రతి చిన్న యాక్టివిటీ వరకు అన్నీ ఇందులో రికార్డు అవుతాయి. ఈ విజువల్స్ అటు డ్రైవర్, కండక్టర్లకు అందుబాటులో ఉండటమే కాకుండా ఆర్టీసీ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా కనెక్ట్ చేశారు. దీనివల్ల బస్సుల్లో దొంగతనాలు చేసే ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందే గుర్తించి అప్రమత్తం కావడానికి, ఒకవేళ ఏదైనా అవాంఛనీయ సంఘటన లేదా ప్రమాదం జరిగితే తక్షణమే ఖచ్చితమైన ఆధారాలను సేకరించడానికి ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడనుంది.

మహిళా ప్రయాణికులపై వేధింపులు, దొంగతనాలు మరియు అనుచిత ప్రవర్తన వంటి ఘటనలకు చెక్ పెట్టేలా టీజీఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో సుదూర ప్రాంతాలకు ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధులు ఈ నిఘా కన్ను ఏర్పాటు పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బస్సులో సీసీ కెమెరా ఉందనే భయం నేరగాళ్లలో గుబులు పుట్టిస్తుందని, ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందని ప్రజలు భావిస్తున్నారు. అంతేకాకుండా, ఈ కెమెరాల ఏర్పాటు వల్ల డ్రైవింగ్ ప్రమాణాలు కూడా మెరుగవుతాయని, సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని అధికారులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు సాధించే ఫలితాలను బట్టి, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల బస్సులకు ఈ సీసీ కెమెరాల రక్షణ కవచాన్ని విస్తరించడానికి టీజీఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రజల భద్రత కోసం సాంకేతికతను జోడించి సంస్థను ప్రగతి పథంలో నడిపిస్తున్న ఎండీ నాగిరెడ్డి ఆలోచనా సరళిపై ప్రయాణికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## థర్డ్ డిస్కమ్‌కు అనుమతి ఇవ్వద్దు

- థర్డ్ డిస్కమ్ రైతుల పాలిట మరణశాసనం
- అప్పులతో పుట్టిన డిస్కమ్ సేవలు ఏలా సాధ్యం
- ఈఆర్‌సీ అనుమతి లేకుండానే ఎలా ప్రకటిస్తారు : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఆరు లక్షల డీటీఆర్‌ల నిర్వహణ వెయ్యి మందితో సాధ్యమా - టీ అధ్యక్షుడు శివాజీ
- తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం




హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో ఏ రాష్ట్రంలో చేయని దుస్సాహ సాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కమ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రైతులను కష్టాల్లోకి నెట్టుతుందని, థర్డ్ డిస్కమ్ రైతుల పాలిట మరణశాసనం అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. అప్పులతో పుట్టిన డిస్కమ్ సేవలు ఏలా సాధ్యం అని వారు ప్రశ్నించారు. తెలంగాణ ఎలక్ట్రికల్ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో "రైతు డిస్కమ్ (మూడో డిస్కమ్) – ప్రకటిత లక్ష్యాలు – ఆచరణ సవాళ్లు" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి తుల్జారాంసింగ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతు కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కమ్ భవిష్యత్‌లో రైతుల పాలిట మరణశాసనంగా మారే ప్రమాదం ఉందని, రైతు డిస్కమ్ ఏర్పాటు విషయం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రైతాంగానికి అవగాహన లేదని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ఈఆర్‌సీ నుంచి అనుమతులు లేక ముందే ముఖ్యమంత్రి జూన్ 2న రైతు డిస్కమ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం శోచనీయమన్నారు. ఇంత పెద్ద నిర్ణయం తీసుకునే ముందు ఎవరి అభిప్రాయాలు తీసుకున్నారని, కనీసం అసెంబ్లీలో కూడా చర్చించకుండా ఏక పక్ష నిర్ణయం తీసుకోవడమేమిటని ధ్వజమెత్తారు. ఆగమేఘాల మీద జూన్ 2వ తేదీననే రైతు డిస్కమ్ ప్రారంభించాల్సినంత అవసరమేమి వచ్చిందని, సాధ్యసాధ్యాలు పరిశీలించి చేయాల్సిందన్నారు. అసలు జూన్ 2వ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమని, దానితో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. తమ పాలనలో 60 వేల కోట్లతో 400 కేవీ సబ్‌స్టేషన్లు 30, 220 కేవీ సబ్‌స్టేషన్లు 52, 132 కేవీ సబ్‌స్టేషన్లు 175కు పెంచామని, 16 వేల కిలోమీటర్లు ఉన్న లైన్‌ను 28 వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. రెండున్నర సంవత్సరాలలో ఒక్క సబ్‌స్టేషన్ నిర్మాణం జరగలేదన్నారు. రైతు డిస్కమ్‌కు థర్మల్ పవర్‌ను కేటాయించడం దుర్మార్గమ న్నారు. ఈ నెల 29న ఈఆర్‌సీ బహిరంగ విచారణకు తాము వస్తామని, బలమైన వాదనలు వినిపించి రైతుల పాలిట శాపంగా మారనున్న కొత్త డిస్కమ్‌ను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఏపీఎస్‌ఈబీలో పనిచేసిన ఇంజనీర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతు మూడవ డిస్కమ్ ఏర్పాటు అవసరం లేదని, రెండు డిస్కమ్‌లతో గత పన్నెండు సంవత్సరాలుగా వినియోగదారులకు మంచి సేవలు అందుతున్నాయని అన్నారు. 3వ డిస్కమ్‌తో అప్పులు పెంచడమే తప్ప ఏలాంటి ప్రయోజనం లేదన్నారు. టీఈఈఏ మాజీ ప్రధాన కార్యదర్శి రామేశ్వరయ్య శెట్టి మాట్లాడుతు మూడవ డిస్కమ్‌తో ప్రభుత్వంతో పాటు ఏ వర్గానికి ఉపయోగం లేదన్నారు. రైతుసంఘం నాయకుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు డిస్కమ్ అంటే వ్యాపారమని, అంతా ప్రభుత్వమే చూస్తున్నప్పుడు రైతు డిపార్ట్‌మెంట్ అని పేరు పెట్టి ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. రైతు డిస్కమ్‌తో రైతులకు సేవలు అందుతాయనేది భ్రమ అన్నారు. సీపీఐ(ఎం) సహకార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతు కొత్త డిస్కమ్ ఏర్పాటు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. ప్రభుత్వానికి రైతులపై నిజమైన ప్రేమ ఉంటే తక్కువ ఖర్చుతో వచ్చే విద్యుత్ కేటాయించేదన్నారు. కానీ అధిక ధరతో వచ్చే థర్మల్ విద్యుత్‌ను కేటాయించడం వెనుక సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉందన్నారు. ఒక్కపైస వంతు ఉపయోగపడని రైతు డిస్కమ్‌కు రూ. 1300 కోట్ల ఖర్చుతో మీటర్ల బిగింపు వృధానే అన్నారు. ఇది కార్పోరేట్ శక్తులకు ఉపయోగ పడుతుందన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోటేశ్వర్‌రావు మాట్లాడుతు ఇది రైతు డిస్కమ్ కాదని, డబ్బులు లేని డిస్కమన్నారు. ఇది రూ. 35 వేల కోట్ల అప్పుతో పుడుతుందన్నారు. ఆదాయం లేని డిస్కమ్‌కు స్మార్ట్ మీటర్లు ఎందుకన్నారు. ప్రభుత్వం రైతు డిస్కమ్ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1104 ట్రేడ్ యూనియన్ మాజీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతు రైతు డిస్కమ్ ఏర్పాటు ఏక పక్ష నిర్ణయమని, 30 శాతం స్టేక్ హోల్డర్స్ అయిన ఉద్యోగులతో కూడా చర్చించకుండానే డిస్కమ్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఎనర్జీ సెక్రటరీ, రైతు డిస్కమ్ సీఎండీల ఒంటెద్దు పోకడలతో ఏక పక్షంగా వెలుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కానీ, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు కానీ ఒక కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయాలంటే ప్రజలతో పాటు ఉద్యోగులు, విద్యుత్ నిపుణులతో , రైతు సంఘ నాయకులతో చర్చించాల్సిన అవసరం ఉందని టీఈఈఏ అధ్యక్షులు శివాజీ అన్నారు. కానీ ఇక్కడ ఎవరితో చర్చించకుండానే తాము చేయదలుచుకుంది చేసుకుంటున్నామనే దోరణితో వెళ్లడం బాధకరమన్నారు. రైతు డిస్కమ్ వాటా 42 శాతం ప్రకారం ప్రతి ఏటా రూ. 32 వేల కోట్ల విద్యుత్ కావాలని, ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న క్రాస్ సబ్సిడి కేవలం రూ. 16 వేల కోట్లు అన్నారు. మరి ఇంకా 16 వేల కోట్లు ఏలా సర్దుబాటు చేస్తారని ప్రశ్నించారు. ఉమ్మడిగా ప్రస్తుతం క్రాస్ సబ్సిడీ వచ్చే 8 నుంచి పది వేల కోట్ల నిధులను రైతులకు డైవర్షన్ జరిగేదన్నారు. డబ్బులు కట్టక పోతే ఉత్పత్తి సంస్థలు విద్యుత్ సరఫరా చేయకపోతే రైతుల పరిస్థితి ఎమిటని ప్రశ్నించారు.

## ప్రజాసేవకు చిరస్మరణీయం

**మాజీ మంత్రి నర్సారెడ్డి విగ్రహావిష్కరణ**



నిర్మల్ బ్యూరో, మే24 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారులు వి.హనుమంతరావు ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మల్ ప్రాంత అభివృద్ధికి పొద్దుటూరి నర్సారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యలను తనవిగా భావించి పరిష్కరించేందుకు కృషి చేసిన ఆయన, మూడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా సేవలందిస్తూ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరుపొందిన ఆయన నిరాడంబర జీవితం నేటి నాయకులకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. నర్సారెడ్డి కుమారులు పి. సుదర్శన్ రెడ్డి, పి. సంజీవరెడ్డి, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరి రావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ జాహీ, చంద్రశేఖర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంత్ అలీ, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, నిర్మల్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, మురుసు సత్యనారాయణ, ఐరా నారాయణరెడ్డి, దశరథ్ రాజేశ్వర్, ఆదిలాబాద్ మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్‌తో పాటు వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు

- 30న క్రమశిక్షణ కమిటీ ముందుకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి
- పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాలి: ఎంపీ మల్లు రవి




హైదరాబాద్ (జనంసాక్షి) : పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గంలోని నేతలతోపాటు కేడర్‌కు ఎంపీ, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిణామాలపై స్థానిక నేతలతో ఆదివారం హైదరాబాద్‌లో మల్లు రవి సమావేశమయ్యారు. అనంతరం గాంధీ భవన్‌లో ఎంపీ మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. క్రమశిక్షణ కమిటీ ఎదుట పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఝాన్సీ రెడ్డి హాజరయ్యారన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విదేశాల్లో ఉండడం వల్ల ఆమె రాలేదన్నారు.

ఎమ్మెల్యే యశస్విని విదేశాల నుంచి వచ్చిన తర్వాత మరోసారి రావాలని ఝాన్సీరెడ్డికి సూచించామని చెప్పారు. దీంతో మే 30వ తేదీన కమిటీ ముందు వారు హాజరవుతారని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ స్థానిక నేతలు హరిప్రసాద్, కృష్ణ కిషోర్‌పై ఝాన్సీరెడ్డి, యశ్వస్విని రెడ్డిలు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. అలాగే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి కూడా పార్టీ క్యాడర్‌ను పట్టించుకోక పోవడంతోపాటు వారిని వేధిస్తున్నారంటూ తమకు ఫిర్యాదులు అందాయన్నారు. మరోవైపు ఎమ్మెల్యే, ఝాన్సీ రెడ్డిలు క్యాడర్‌ను పట్టించుకోకుండా వేధిస్తున్నారంటూ కౌంటర్ ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు.

ఈ నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గంలోని ఇరు వర్గాలను పిలిచి కమిటీ మాట్లాడుతుందని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. ఇప్పటికే కిషోర్, హరిప్రసాద్‌కి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అందుకు వారు రికార్డు ఎవిడెన్స్‌తో సమాధానం ఇచ్చారని తెలిపారు. ఝాన్సీరెడ్డి కూడా తన వద్దనున్న సమాచారాన్ని తమకు అందజేశారన్నారు. ఈ అంశంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు జిల్లాకు చెందిన నేతలందరితో కూర్చుని మాట్లాడతామని చెప్పారు. తద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

## మలేషియాలో ఆవిర్భావ వేడుకల పర్యవేక్షణ



మలేషియా, జూన్ 6 (జనంసాక్షి) : మలేషియాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జూన్ 6న కౌలాలంపూర్‌లోని ప్రముఖ మాట్రేడ్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మలేషియాతో పాటు వివిధ దేశాల నుంచి తెలంగాణ వాసులు, సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. కేటీఆర్ పాల్గొననున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను నిర్వాహకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు. ఈ వేడుకల ఏర్పాట్లను బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాలా పర్యవేక్షించారు. వేదిక వద్ద మౌలిక సదుపాయాలు, అతిథుల స్వాగత ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యాలు, భద్రతా చర్యలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆహార వసతులు తదితర అంశాలను సమీక్షించారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన మరియు గుర్తుండిపోయే అనుభవం కల్పించేందుకు బృంద సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీఆర్‌ఎస్ మలేషియా మరియు మీూ ముఖ్య సభ్యులు టీ. మారుతి కుర్మ, తిరుపతి, సందీప్ గౌడ్, నరేందర్ రెడ్డి, అనిల్, జ్యోతి, మోనా, పూర్ణ చంద్రరావు, దీపిక తదితరులు సహా పలువురు బృంద సభ్యులు పాల్గొన్నారు. తుది ఏర్పాట్లపై మహేష్ బిగాలా మార్గనిర్దేశం చేస్తూ, ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## సంగిశెట్టికి మాతృ వియోగం



హైదరాబాద్ (జనంసాక్షి) : బహుజన తాత్వికుడు, ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు సంగిశెట్టి శ్రీనివాస్ మాతృమూర్తి సంగిశెట్టి వజ్రమ్మ (84) శనివారం రాత్రి 10 గంటలకు మృతి చెందారు. హైదరాబాదు పాత నగరంలోని చుడి బజార్లో నివాసముంటున్న ఆమె గుండెపోటుతో మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు నలుగురు కుమారులు ఉన్నారు. ఆదివారం సంగిశెట్టి వజ్రమ్మ పార్థివ దేహానికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిల్లల మర్రి రాములు, రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, టైమ్స్ ఆఫ్ ఇండియా మాజీ ఎడిటర్ సుశీల్ రావు,తెలంగాణ పబ్లికేషన్స్ అధినేత కోయ చంద్రమోహన్, కవులు, రచయితలు బొజ్జ అనిల్ కుమార్ ముదిరాజ్, వనపట్ల సుబ్బయ్య, డాక్టర్ హెచ్.రమేష్, కవి కాశన్న, పలువురు పద్మశాలి సంఘం నేతలు, బీసీ నాయకులు నివాళులర్పించారు. పురాణా పూల్ స్మశాన వాటికలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. అభ్యుదయ రచయితల సంఘం రథసారథి ఏటుకూరి ప్రసాద్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, విశాలాంధ్ర బుక్ ట్రస్ట్ నిర్వాహకులు నారాయణరెడ్డి లు నివాళులు అర్పించారు. కొంపెల్లి జనార్దన్ రావు జీవితం– సాహిత్యం పై ఇంకా విడుదల గాని ఏటుకూరి ప్రసాద్ రాసిన గ్రంథాన్ని ఆయన పార్థివ దేహం వద్ద ఉంచి నివాళి అర్పించారు.

## అర్హత లేని వారికి ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టులు

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతుల అగచాట్లు, అరిగోస
- అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి
- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలన
- రైతులను ఓదార్చిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి రూరల్, మే 24 (జనంసాక్షి) : నెలల తరబడి రైతులు పడిగాపులు కాస్తున్న చిత్తశుద్ధిలేని ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులు అష్టకష్టాలు పడి పండించిన ధాన్యం నీటి పాలవుతుంటే కన్నీటి పర్యంతం అవుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల నిప్పులు చెరిగారు. అర్హతలేని ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలకు కాంట్రాక్టులు ఇవ్వడం వల్ల రైతులకు ఈ దుస్థితి దాపురించిందని వారన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలపై కేసులు పెట్టడం చేతనైతది కానీ శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేండ్లు అయిన నేటికి హంతకులను పట్టుకోకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం అని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలతో కుప్పలు, కుప్పలుగా ధాన్యం తడిసిపోయింది. రైతులు తమ ఆగ్రహ జ్వాలలు తో నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వల్ల, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ధాన్యం తడిసిపోయిందని అన్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు తమ అనుచరులకు ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు ఇచ్చారు అని దుయ్యబట్టారు. జిల్లాలో 57మిల్లుల్లో పంచనామా చేసి కేవలం 34 మిల్లుల యాజమాన్యాలపై చర్యలు తీసుకున్నారు. మిగతా మిల్లులు అధికార పార్టీకి చెందిన వారిపై చర్యలు తీసుకోలేదు. పక్షపాత ధోరణితో తమ అనుగుణంగా ఉన్న మిల్లర్ల కు కేసులు ఉన్నా ధాన్యం కేటాయించారు. మిల్లర్ల సంఘం అధ్యక్షులుపై కేసులు ఉన్నా ధాన్యం కేటాయించారు. సోలీపూర్ కు సంబంధించిన మిల్లర్ వల్ల ప్రభుత్వానికి ఆదాయం గండి అయిన ధాన్యం కేటాయించారు. కోటి నలభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మార్కెట్ కు వస్తుంది. 45లక్షల మొక్కజొన్న మార్కెట్ కు వచ్చింది. రైతులను గాలికి వదిలేసిన చరిత్ర రేవంత్ రెడ్డిది అని అన్నారు. అక్రమార్కులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 90శాతం పాడి ఆరు పెద్ద మిల్లులకు పోతుంది విచారణ జరిపించాలని తెలియజేశారు. రైతులతో తరుగు, తాళ్లు తీసివేయడం ముమ్మాటికి ప్రశ్నిస్తాం అని తెలిపారు. మిల్లర్లతో ప్రైవేటు సంభాషణలు చేయడంలో మంత్రి, ఎమ్మెల్యేల ఔచిత్యం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుకలను పోలీసులను అడ్డం పెట్టుకొని ఆపలేరు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేండ్లు అయింది నేటికి హంతకులను పట్టుకోలేదు. ఇది ముఖ్యమంత్రి వైఫల్యమే కారణమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్రీధర్ రెడ్డి హంతకులను పట్టుకోవాలి. రైతుల అగచాట్లు, హరిగోసను గమనించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్రికా సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మార్కెట్ మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, పలుస రమేష్ గౌడ్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాణిక్యం, వనం రాములు, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, సయ్యద్ జెమిల్, బాగ్యరాజ్ తదితరులు ఉన్నారు.

### మార్కెట్ యార్డులో రైతులను పరామర్శించిన మాజీ మంత్రి

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులను పరామర్శించి ఓదార్చారు. రైతుల ఆవేదనను విన్న నిరంజన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యవల్ల నోటికాడికి వచ్చిన ధాన్యం నీటి పాలు అయ్యిందని తడిసిన ప్రతిగింజా కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సంఘీభావం తెలిపి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిరంజన్ రెడ్డి వెంట బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## అంత్య పుష్కరాలు జూన్ 1న ముగింపు

కాళేశ్వరం, మే 25 (జనంసాక్షి) : పవిత్ర సంగమ క్షేత్రం కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలు జూన్ 1 వరకు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ మోహన్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.కొందరు వ్యక్తులు సోషల్ మీడియా లో భక్తులు లేకపోవడంతో అంత్య పుష్కరాలు మే 26 న ముగింపు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని, ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు.జూన్ 1 న అంత్య పుష్కరాల ముగింపు ఉంటుందని ఇట్టి అసత్య ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని చైర్మన్ తెలిపారు.

**CHANGE OF NAME**

I, AFSER UNNISA BEGUM, W/o. Shaik Omer, R/o.H.No.5-7-8/1, Nalsabgadda, Sangareddy town & dist, TG. I State that in my son Shaik Mahaboob passport No. M1321441. my name was wrongly is occurred as AFSAR NUSA, but my correct name Shall henceforth be known as AFSER UNNISA BEGUM.

# సామాన్యుడి జేబుపై పెట్రో దాడి

**పెట్రోలియం ధరలు మరోసారి పెరిగాయి. లీటరు పెట్రోలుపై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసల చొప్పున ఎనిమిది రోజుల వ్యవధిలో మూడు విడతల్లో మొత్తంగా రూ.5 వరకు భారం పడింది. హైదరాబాద్‌లో పెట్రోలు లీటరు రూ.112.74కి, డీజిల్ రూ.100.88కి చేరింది. ఢిల్లీలో పెట్రోలు రూ.99.51కి పరుగులు తీసింది. సీఎన్‌జీ కూడా కిలోకు రూ.4 పెరిగింది. ఇది కేవలం సంఖ్యల మార్పు కాదు, కోట్లాది కుటుంబాల వంటిల్లు, రైతు పొలం, చిన్న వ్యాపారి లెక్క తలకిందులవడం.**

సంపాదకీయం

ప్రభుత్వ చమురు సంస్థలు ధరలు పెంచినప్పుడు అంతర్జాతీయ క్రూడ్ ధరలు, రూపాయి విలువ పతనం, విదేశీ మారక నష్టాలను సాకుగా చూపిస్తాయి. ఈ వాదనలో కొంత వాస్తవం ఉన్నప్పటికీ, సత్యం సగమే చెప్పడం అర్ధసత్యమవుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రోలు ధరలు అదే వేగంగా తగ్గవు కానీ పెరిగినప్పుడు మాత్రం వెంటనే వినియోగదారుడిపై మోపుతారు. ఈ 'అసమాన సమీకరణం' దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది.

రూపాయి విలువ డాలరుతో పోలిస్తే నానాటికీ నీరసిస్తోంది. దిగుమతి బిల్లు పెరుగుతోంది. ఇందులో ప్రభుత్వం నియంత్రించలేని అంశాలున్నాయని నిజమే. కానీ అదే సమయంలో పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్న సుంకాల భారం చూస్తే వినియోగదారుడు చెల్లించే ప్రతి రూపాయిలో సగం పైగా పన్నులే అని స్పష్టమవుతుంది. ముడి చమురు ధర తగ్గినప్పుడు పన్నులు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించే బదులు, ఆ లాభాన్ని ప్రభుత్వ ఖజానా మింగేసింది.

డీజిల్ ధర పెరగడం అంటే కేవలం వాహనదారులకు భారమే కాదు, రైతు ట్రాక్టరు నుండి కూరగాయల లారీ వరకు, మత్స్యకారుల పడవ నుండి నిర్మాణ యంత్రాల వరకు ప్రతిదీ ప్రభావితమవుతుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది, కూలీ సరిపోదు, చిన్న వ్యాపారి లాభమార్జిన్ కరిగిపోతుంది. సీఎన్‌జీ ధర పెరగడం వల్ల ఆటో, క్యాబ్ నడిపే నిరుపేద కార్మికుడి ఆదాయం తగ్గిపోతుంది. నయారా, షెల్, జియో–బీపీ వంటి ప్రైవేట్ కంపెనీలు కూడా ధరలు పెంచడం పోటీ లేమిని, కార్టెల్ ధోరణిని సూచిస్తోంది.

పెట్రోల్ బంకు వద్ద మీటరు తిరిగేకొద్దీ సామాన్యుడి కడుపు కొట్టు మిట్టాడు తోంది. ఇంధన ధర నిర్ణయంలో పారదర్శకత, పన్నుల హేతుబద్ధీకరణ, పునరుత్పాదక ఇంధన వేగవంతమైన వ్యాప్తి ఈ మూడూ జరగకుండా 'అంతర్జాతీయ కారణాలు' అనే సాకు చెప్పడం ఎన్నాళ్ళు సాగుతుందో అర్థం చేసుకోవాలి. మంటలు తగ్గించాల్సిన ప్రభుత్వం మరింత రాజేస్తే సామాన్యుడు ఆరిపోవడమే మిగులుతుంది.

# శతక స్ఫూర్తి

ప్రపంచీకరణ ఆర్థిక,రాజకీయ, సామాజిక రంగాలను ప్రభావితం చేసినట్లుగానే సాంస్కృతిక రంగాన్ని కూడా ప్రభావితం చేసింది. ఇటీవల కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాల పేరుతో సాంస్కృతిక రంగంలో అంతర్భాగమైన ప్రాంతీయ భాషల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలను విశ్లేషిస్తే మన మాతృభాష అయిన తెలుగులో 40 శాతం మంది విద్యార్థులు తెలుగులో అనుతీర్ణులయ్యారు. ఈ ఫలితాలు నేటి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఇది ఒక రకంగా భాషా సంస్కృతుల విషయంలో తల్లిదండ్రులు, సమాజం మరోవైపు ప్రభుత్వం కనబరుస్తున్న ఉదాసీన వైఖరి కారణం అని చెప్పక తప్పదు. ఒక జాతిపై జరిగే రాజకీయ ఆర్థిక దాడిని ఎదుర్కొనవచ్చు గాని సాంస్కృతిక దాడిని ఎదుర్కోవటం కష్టసాధ్యం.

ఈ నేపథ్యంలో "పురుషులందు పుణ్య పురుషులు వేరయా" అన్నట్లు ఉద్యోగాన్ని ఉబుసుపోకకు కాకుండా నిబద్ధతతో నిమగ్నతతో నిర్వహిస్తున్న మిత్రులు,పండితులు, పాఠ్యపుస్తక రచయితలు, ప్రవచనకర్తలు శ్రీ పల్లెర్ల రామామోహన రావు తను పనిచేస్తున్న పాఠశాలనే ప్రయోగశాలగా చేసుకుని విద్యార్థుల రచన వ్యాసంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. శ్రీ పల్లెర్ల రామ్మోహనరావు మహబూబ్ నగర్ జిల్లా "వేముల"జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా విధులు నిర్వహిస్తూనే విద్యార్థులచే పలు రచనలు చేయించారు. అందులో విద్యార్థి రామాయణం, మాసర, పల్లె బాస, ఆత్మకథలు, మొగ్గ, జయ వసంతం మొదలైనవి సంకలనాలుగా రూపొందించి వెలుగులోకి తెచ్చారు. రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నట్లు వెలుగుచున్న దీపమే మరో దీపాన్ని వెలిగిస్తుందన్నట్లు పల్లెర్ల రామ్మోహనరావు దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన రచనల్లోని ఆణిముత్యాలు లాంటి పద్యాలను ఎన్నుకొని వాటిని వ్యాఖ్యానిస్తూ "దాశరథి పద్యవీణ"ను వెలువరించారు. బహుశా ఆయన బోధన, రచనల ప్రేరణతో అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ద్యావరి మాధురి ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు తెలుగు పాఠ్య పుస్తకాలలో ఉన్న శతక పద్యాలకు చక్కని వ్యాఖ్యానం రచించి

**"శతక స్ఫూర్తి"పేరుతో**

అపూర్వమైన రచనను వెలువరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో నాకు తెలిసినంత మటుకు ఇలాంటి ప్రయోగం ఎక్కడా జరగలేదు. అందుకు విద్యార్థిని మాధురి, తగిన మార్గదర్శనం చేసిన పల్లెర్ల, ప్రోత్సహించిన తల్లిదండ్రులు అందరూ అభినందనీయులు.

తెలుగులో ప్రసిద్ధమైన శతకాలకు చల్లా సాంబిరెడ్డి గారు తమ సంస్థ తరఫున వ్యాఖ్యానాలు వెలువరించారు. కానీ పాఠ్యపుస్తకాలలోని శతక పద్యాలకు వ్యాఖ్యానం రాయడం ఇదే తొలి ప్రయోగం. అందువల్ల ఇది ఒక రకంగా "మాధురీ దర్శనం" అని చెప్పవచ్చు. పద్యానికి భావం చెప్పి అనంతరం ఆ పద్యం వల్ల కలిగిన ఆలోచనలను అందలి విశేషాలను వాటి ప్రత్యేకతను సరళ సుబోధకమైన శైలిలో తన తోటి విద్యార్థులకు అర్థమయ్యేలా ద్రాక్షాపాకంగా వివరించింది. ఆరవ తరగతి లోనే పక్కి వెంకట రామ నరసింహ కవి రచించిన కుమారీ శతకంలోని " చెప్పకు చేసిన మేలు" అనే పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ నాయకులు అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా ప్రజల సొమ్మును ప్రజలకే పంచుతూ సంక్షేమ పథకాల పేరుతో అమలు చేస్తున్నారని కాగా నాయకులు త్యాగధనులై ఉండాలని అంటుంది. రామదాసు రచించిన "వనకరి చిక్కె మైనస" అనే పద్యంలో శబ్ద స్పర్శ రూప రసగంధాదులకు చిక్కి ఏనుగు, చేప, పాము ,జింక, తుమ్మెదలు ప్రాణాలను కోల్పోతున్నాయని అలాగే ఇంద్రియాలకు లోనైన మనిషి కూడా పతనమవుతాడని హెచ్చరిస్తూ గోపన ప్రయోగించిన ఇరు మూటిని(2ం3=5) అయిదని చక్కగా వివరించింది. శేషప్ప రాసిన నరసింహ శతకంలోని తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వడు అనుపద్యంలో ధనానికి మూడు దశలని అవి భోగం, త్యాగం, నాశనం అని చెబుతూ మొదటి రెండింటిని పాటించకపోతే మూడవది తప్పదని హెచ్చరిస్తుంది. కలియుగంలో దానధర్మాలు ప్రధానమని పరోక్షంగా ప్రబోధిస్తుంది. ఉత్పల వారి"ధనికుని కంటే పేద కడు ధన్యుడు" అనే పంకిని వివరిస్తూ శ్రమైక జీవనం ద్వారా లభించిన దానితో పేద తృప్తిగా జీవిస్తాడని కానీ ధన దాహం కలిగిన శ్రీమంతునికి కడుపునిండా తిండి కంటి నిండా నిద్ర ఉండవని పైగా రక్త పోటు, మధుమేహం లాంటి వ్యాధుల బారిన పడతారని చెబుతుంది. పదో తరగతిలో ఉన్న ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలోని "ఊరురం,జనులెల్ల బిక్ష మిడరో" అనే పద్యంలో ప్రకృతి మనిషికి ఎన్నో ప్రసాదించిందని అది సాలవని ప్రజలు ప్రభువును ఆశ్రయించడం సరికాదని ఉచిత ఉచితాలు మరిచి ప్రజాధనాన్ని సంక్షేమ పథకాలకు వెచ్చించడం తద్వారా ఖజానా ఖాళీ కావడం వల్ల ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని హెచ్చరిస్తూ "ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడటం మానాలని" , కష్టించే తత్వాన్ని అలవర్చుకోవాలని ప్రతి ఒక్కరూ స్వావలంబన సాధించాలని ప్రబోధిస్తుంది.




ఇలా ఆయా పద్యాలను వ్యాఖ్యానించే సందర్భంలో ఆమె ఉటంకించిన మానవుడు మాధవుడవుతాడు, మూర్ఖులతో వాదన కన్నా మౌనం మేలు, ఫలించిన వృక్షానికే రాతి దెబ్బలు, దయ మనిషికి చిరునామా, మన గురువులే మనకు మార్గదర్శకులు, బురదల పాతిన గుంజలు మొదలైన వాక్యాలు సామెతలు సందర్భోచితంగా ఉండి వ్యాఖ్యానాన్ని మరింత చిక్కపరిచాయి.

భూగర్భంలో ఖనిజాలు దాగున్నట్లుగా విద్యార్థులలో అంతర్గతంగా నిబిడీకృతమైన సృజనాత్మక శక్తులను వెలికి తీసి వాటికి సాన పడితే అవి బంగారు భవిష్యత్తుకు సోపానాలు అవుతాయి."మహాభాష్యం వా పాఠయేత్, మహారాజ్యం వా పాలయేత్" అన్నట్లుగా మందార మకరంద మాధుర్యాన్ని పంచుతున్నట్లుగా సాగిన మాధురి వ్యాఖ్యానం మరెందరికో స్ఫూర్తిని అందిస్తుందని ఆశిస్తూ ఆమెను అభినందిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

## ఎండల దేశంగా మారుతున్న భారత్

ఒకప్పుడు రాజస్థాన్ ఎడారి ప్రాంతాలకు పరిమితమైన తీవ్రమైన వేడి తరంగాలు ఇప్పుడు దేశం మొత్తాన్ని వేగంగా కమ్ముకుంటున్నాయి. ఢిల్లీ, హైదరాబాద్, నాగ్‌పూర్, పట్నా తదితర నగరాలు వేసవిలో నిప్పుల కుండలుగా మారుతున్నాయి. 2024–2026 మధ్య కాలంలో భారత వాతావరణ విభాగం నమోదు చేసిన రికార్డు ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. ప్రపంచ వాతావరణ సంస్థ (ఔమీ) కూడా దక్షిణాసియా వేడెక్కుతున్న వేగం ప్రపంచ సగటును మించిపోతోందని హెచ్చరిస్తోంది.

వాతావరణ మార్పు నిస్సందేహంగా ప్రపంచవ్యాప్త సమస్య. కానీ భారత్‌లో అసాధారణ ఉష్ణోగ్రతల పెరుగుదల కేవలం సహజ కారణాల వల్ల మాత్రమే కాదు. రాజకీయ నిర్ణయాలు, కార్పొరేట్ ఆధారిత అభివృద్ధి మోడల్ మరియు పర్యావరణాన్ని వెనక్కి తోసిన పాలనా విధానాలు దీనికి ముఖ్య కారణాలు.

2014 తర్వాత పర్యావరణ చట్టాలను "సరళీకరణ" పేరుతో బలహీనపరచడం వేగం పెరిగింది. పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ, స్థానిక సమాజాల అభ్యంతరాలు నామ మాత్రంగా మారాయి. అటవీ సంరక్షణ చట్టంలో సవరణల ద్వారా లక్షల హెక్టార్ల సహజ అడవులు గనులు, రోడ్లు, పారిశ్రామిక ప్రాజెక్టులకు బలి అయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని హస్డియో అరండ్ అడవులు, ముంబై మడ అడవులు, గ్రేట్ నికోబార్‌లోని వర్షారణ్యాలు – ఇవన్నీ ఈ విధ్వంసానికి బలమైన ఉదాహరణలు. అడవుల నరికివేత వల్ల వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు అడుగునకు పోవడం, కార్బన్ శోషణ తగ్గడం వంటి పర్యవసానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నగరాల్లో వేగంగా పెరుగుతున్న కాంక్రీట్ జంగిల్‌లు హీట్ ఐలాండ్ ఎఫెక్ట్‌ను తీవ్రతరం చేస్తున్నాయి. పేదలు, నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, వృద్ధులు – అత్యంత వర్గాలు వేడి సంబంధిత మరణాలకు ఎక్కువగా గురవుతున్నారు. లాన్సెట్ నివేదికలు భారత్‌లో వేడి వల్ల సంవత్సరానికి వేలాది మరణాలు జరుగుతున్నట్లు చెబుతున్నాయి. ప్రభుత్వాలు అడవుల విస్తీర్ణం పెరిగిందని అధికారిక గణాంకాలు చూపిస్తున్నప్పటికీ, పర్యావరణ నిపుణులు వేరే చెబుతున్నారు. సహజ అడవుల స్థానంలో యూకలిప్టస్, రబ్బరు, తాటి వంటి వాణిజ్య తోటలను "అడవులు" గా చూపించడం ద్వారా గణాంకాలు అందంగా కనిపిస్తున్నాయి. కానీ జీవ వైవిధ్యం, పర్యావరణ సమతౌల్యం నశించిపోతున్నాయి. మీడియా కూడా ఈ సంక్షోభాన్ని గంభీరంగా చర్చించడం లేదు. కార్పొరేట్ ప్రభావంతో నడుస్తున్న ముఖ్య మీడియా రాజకీయ ధూళిపటం, మత–జాతి వివాదాలతో ప్రజల దృష్టిని మళ్లిస్తోంది. నీటి కొరత, వేడి, వరదలు, రైతు సంక్షోభం వంటి అసలు సమస్యలు వెనక్కి నెట్టబడుతున్నాయి. ప్రపంచం పునరుత్పాదక ఇంధనాలు, హరిత నగరాలు, స్థిరమైన అభివృద్ధి వైపు ముందుకు వెళ్తుంటే, భారత్ ఇంకా బొగ్గు ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కొనసాగిస్తోంది. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు. కానీ మన తప్పులను ఖచ్చితంగా ప్రతిబింబిస్తుంది. అడవులను నరుక్కుంటూ, నదులను కలుషితం చేస్తూ, నగరాలను కాంక్రీట్ అడవులుగా మార్చేస్తూ "అభివృద్ధి" సాధ్యమనుకోవడం పెద్ద భ్రమ. భారత్ భవిష్యత్తు కేవలం వృద్ధి సంఖ్యలపై కాదు – పర్యావరణ సమతుల్యం, స్థిరమైన అభివృద్ధి మరియు రాబోయే తరాల జీవనం పై ఆధారపడి ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## నువ్వు ఇంకా నిరాశలో కూర్చుంటే
# చరిత్ర నిన్ను మర్చిపోతుంది.. లే, నిలబడు!

ఈ నేల మనది. ఈ ఆకాశం మనది. ఈ సూరీడు మనది. అయినా ఎందుకు ఎందుకు ఈ నేలపై స్వేచ్ఛగా నడిచే హక్కు మనకు లేదని అనిపిస్తోంది? ఎందుకు ఆ నీలాకాశంలో ఎగిరే హక్కు, ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం కొందరికి మాత్రమే పరిమితమైనట్టు కనిపిస్తోంది? ఎందుకు ఒకే సూరీడు కింద, ఒకే గాలిని పీలుస్తూ పుట్టినా, కులం పేరుతో, వర్గం పేరుతో ఇంకా చీకటి గదుల్లో మగ్గిపోతున్నారు లక్షలాది యువజీవులు? ఈ ప్రశ్నలు నేడు సమాజాన్ని నిలదీస్తున్నాయి. ఈ మంటలు గుండెల్లో రగులుతూనే ఉన్నాయి, ఆరిపోవడం లేదు. ఈ నిట్టూర్పులు, ఆక్రందనలు మిన్నుముట్టి ప్రతి ఒక్కరినీ అడుగుతున్నాయి. సమాధానం చెప్పండి అని.నిరాశలో కూర్చున్న నిన్ను చరిత్ర ఎప్పటికీ గుర్తించదు. లేచి నిలబడినప్పుడే నువ్వు చరిత్రవు!ఈ దేశంలో యువత అంటే కేవలం వయసు కాదు అది ఒక అగ్నిపర్వతం. ఒక సరికొత్త ఆశ. అన్యాయాన్ని ఎదిరించే ఒక అస్త్రం. కానీ నేడు ఆ యువత ఏం చేస్తోంది? ఎటు వైపు వెళ్తోంది? పదో తరగతి అయిన వెంటనే బతుకు దెరువు కోసం, ఉద్యోగం కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి. ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఇలా ఒక్కొక్క మెట్టు ఎక్కినకొద్దీ జీవితంపై ఆశలు పెరగాల్సింది పోయి, ఒక్కొక్క నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం, తమ కలల సాకారం కోసం రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టి, పరీక్షలు రాసిన వారిలో ఎంతమందికి న్యాయం జరిగింది?పేపర్లు లీకయ్యాయి, నోటిఫికేషన్లు వాయిదా పడ్డాయి, అవినీతి కోరల్లో అవకాశాలు అరువిచ్చారు. కొన్నారు, అమ్ముకున్నారు. ఈ దారుణమైన వ్యవస్థలో ఒక అభ్యర్థి యొక్క ప్రతిభ, అర్హత కంటే అతని పుట్టుక, వెనుక ఉన్న డబ్బు, రికమండేషన్లు ఎక్కువగా మాట్లాడుతున్నాయి. ఇది ఘోరమైన అన్యాయం కాదా? చదువుకున్న కోట్లాది మంది గుండెల్లో రేగుతున్న అగ్నిగుండం కాదా ఇది?చరిత్రను ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, ఎందరో వీరులు తమ ఆశయాల సాధన కోసం కత్తుల వంతెన దాటారు. దారిపొడవునా రక్తం చిందింది, గాయాలయ్యాయి, అయినా వారు ఎక్కడా ఆగలేదు. ఎందుకు? ఎందుకంటే ఆ వంతెన దాటిన ఆవలిగట్టున స్వాతంత్ర్యం ఉంది, సమానత్వం ఉంది, ఆత్మగౌరవం ఉంది. నేటి యువతరానికి ముందున్న కత్తుల వంతెన వేరే రకమైనది. ఇవి ఇనుప కత్తులు కావు. అంతకంటే పదునైన నిరుద్యోగపు కత్తులు, కుల వివక్ష కత్తులు, సంఘం హేళన చేస్తూ విసిరే తిరస్కారపు కత్తులు, మానసిక నిస్పృహ అనే కత్తులు. ఇవి కనిపించకుండానే మనసును తీవ్రంగా గాయపరుస్తాయి. కానీ గుర్తుపెట్టుకోండి, ఇవి మిమ్మల్ని మానసికంగా గాయపరుస్తాయి కానీ చంపలేవు ఒకవేళ మీరు చావడానికి సిద్ధంగా లేకపోతే, మీరు చంపనివ్వకపోతే! ఒక్కసారి ఆలోచించండి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆ కాలంలో ఏ రకమైన కత్తుల వంతెన దాటారు? తాను చదవాలనుకున్న గ్రంథాలయంలో అడుగు పెట్టే హక్కు లేదు, తరగతి గదిలో అందరితో కలిసి కూర్చునే అవకాశం లేదు, దాహం వేస్తే నీళ్లు తాగే హక్కు లేదు. అయినా అతను ఆగలేదు, ఎవరికీ వంగలేదు, ఎక్కడా విరగలేదు. ఆ వివక్షనే పెట్టుబడిగా మార్చుకుని, అక్షరాల బలంతో ప్రపంచమే మెచ్చేలా ఒక అద్భుతమైన రాజ్యాంగాన్నే నిర్మించాడు.భగత్ సింగ్ చిన్న వయసులోనే ఉరికంబం ముందు నిలబడి కూడా చిరునవ్వు చిందించాడు ఎందుకు? ఎందుకంటే అతనికి పోరాటంలో ఓటమి అర్థం తెలుసు, కానీ భయపడి వెనుదిరగ డం తెలీదు. దేశం కోసం, రేపటి తరం కోసం ప్రాణాలర్పించ డం కంటే మించిన సార్థకత లేదనుకున్నాడు. మరి అంతటి మహానుభావుల వారసులం అని చెప్పుకునే మనం, చిన్న చిన్న ఇబ్బందులకే మోకరిల్లుదామా?మన దేశంలో దాదాపు 65 కోట్ల మంది 35 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారే. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ యువశక్తి ఉన్న దేశం మనది. ఇది మనకు లభించిన గొప్ప అవకాశమా? లేక సవాలా? నిజానికి ఇవి రెండూనా! ఇంతటి అపారమైన మానవ శక్తి ఉన్న తరం గనుక సరైన దిశలో, సరైన లక్ష్యం వైపు సంఘటితమైతే, సమాజంలో ఉన్న ఏ అన్యాయమైన గోడ అయినా కూలిపోవాల్సిందే.మన సమాజంలో ఒక విచిత్రమైన, వికృతమైన నిర్మాణం ఉంది. పైకి చెప్పే నీతులు వేరు, లోపల ఆచరించే పద్ధతులు వేరు. రాజ్యాంగం అందరికీ సమానత్వం, సమాన అవకాశాలు గురించి మాట్లాడుతోంది, కానీ క్షేత్రస్థాయిలో సమాజం ఇంకా కులం పేరుతో, మతం పేరుతో మనుషులను, వారి అర్హతలను విభజిస్తూనే ఉంది.




ఒకే విశ్వవిద్యాలయంలో, ఒకే ప్రొఫెసర్ల కింద చదివిన ఇద్దరు విద్యార్థులకు సమాజంలో ఉద్యోగం దొరికే అవకాశాలు వేరువేరుగా ఎందుకు ఉంటున్నాయి? ఒకే మార్కులు, ఒకే రకమైన అర్హత సాధించినా కేవలం ఒకరి పుట్టుక వేరైనందున, ఒకరి సామాజిక నేపథ్యం వేరైనందున ఫలితాలు తారుమారవుతున్నాయి. ఇది ముమ్మాటికీ వ్యవస్థీకృత అన్యాయం. ఇది రాజ్యాంగ ఆశయాలకు చేస్తున్న ద్రోహం.కులం అనేది పుట్టుకతో వచ్చే అవమానం కావాల్సింది కాదు. అది కొందరు స్వార్థపరులు తమ పట్టు కోసం సృష్టించుకున్న ఒక కృత్రిమ గోడ. గత తరాల పెద్దలు నిర్మించిన ఆ కులాల గోడలను బద్దలు కొట్టాల్సిన బాధ్యత పూర్తిగా నేటి యువతరంపైనే ఉంది. ఒక్క మనిషి ఒంటరిగా వెళ్లి ఆ గోడను తాకితే అది కదలకపోవచ్చు. కానీ కోట్లాది మంది యువతరం చేతులు కలిసి, ఐక్యంగా కదిలినప్పుడు ఆ కులాల గోడ మాత్రమే కాదు, సమాజంలో పేరుకుపోయిన ఇంకా ఎన్నో బలమైన, అన్యాయమైన నిర్మాణాలు కుప్పకూలిపోతాయి. ఇది కేవలం ఊకదంపుడు ఉపన్యాసం కాదు, చరిత్ర అనేకసార్లు రుజువు చేసిన పరమ సత్యం కులం పేరిట నిన్ను విభజించేవాడికి నువ్వు కేవలం శత్రువువి మాత్రమే కాదు నువ్వు అతని అహంకార స్వప్నాన్ని ముక్కలు చేసే సజీవ జవాబువు!

ఈ దేశ ఆర్థిక, సామాజిక ప్రగతి పూర్తిగా యువత భుజాలపైనే నిలబడింది. కానీ దురదృష్టవశాత్తూ ఆ భుజాలు నేడు సరైన ఉద్యోగం దొరకక, భవిష్యత్తుపై భయంతో వంగిపోతున్నాయి. నిరుద్యోగం అనేది కేవలం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు అది ఒక మనిషి యొక్క ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నెమ్మదిగా, లోలోపల నుజ్జు నుజ్జు చేస్తుంది.

ఉదయం లేస్తే ఏమి చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియని శూన్య స్థితి, రాత్రి పడుకున్నా రేపటి గురించిన ఆందోళనతో నిద్ర పట్టని నరకప్రాయమైన భావన ఇది నేటి నిరుద్యోగ యువత అనుభవిస్తున్న మానసిక క్షోభ. ఈ నరకానికి, ఈ దుస్థితికి బాధ్యులు ఎవరు? ఖచ్చితంగా ఈ అలసత్వపు వ్యవస్థే!కానీ నిరాశ పడకండి, ఆ కుళ్ళిన వ్యవస్థను మార్చే అద్భుతమైన శక్తి కూడా మీ చేతుల్లోనే ఉంది. ఐదేళ్లకు ఒక్కసారి ఓటు వేసి, ఆ తర్వాత మీ బాధ్యత తీరిపోయిందన్నట్టు నిద్రపోకండి. పాలకులను ప్రశ్నించండి. మీ హక్కుల కోసం, మీ ఉపాధి కోసం గళమెత్తండి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ఏ సర్కారు నడుస్తున్నా ఉద్యోగావకాశాల కోసం, పారదర్శకమైన నియామకాల కోసం లెక్కడిగే ఒక అజేయమైన సైన్యంగా మారండి.ఈ సైన్యానికి ఎటువంటి తుపాకులు, కత్తులు అక్కరలేదు. మీ అక్షరాలే అస్త్రాలు. మీ ప్రశ్నలే శస్త్రాలు. మీ ఐక్యతయే రక్షణ కవచం. చదువుకున్న మేధావి వర్గం గనుక ప్రశ్నించడం మొదలుపెడితే, ఎంతటి అహంకార ప్రభుత్వాలైనా మోకరిల్లక తప్పదు.ఈ సమాజంలో నిజమైన మార్పు రావాలంటే గొంతులు వినిపించాలి, నిశ్శబ్దాన్ని ఛేదించాలి. అన్యాయాన్ని నిశ్శబ్దంగా భరించడం, సహించడం ద్వారా ఏనాడూ ఏ సమస్యా తొలగిపోలేదు, పైగా అది అన్యాయం చేసేవాడికి మరింత బలాన్ని ఇస్తుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఊరికే రాలేదు, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఒక్కొక్కరూ ఇళ్ళ నుండి బయటకు వచ్చి, లేచి నిలబడినందుకు వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైంది ఎందువల్ల? విద్యార్థులు, యువత సంఘటితంగా ఒక్కటిగా కదిలి, ప్రాణాలకు తెగించి పోరాడినందుకు వచ్చింది.ఈ సుదీర్ఘ చరిత్ర మనకు ఒక్కటే పాఠం నేర్పుతోంది సమాజంలో మార్పు కావాలంటే కదలండి, అందరినీ కలపండి, హక్కులను గెలవండి.యువతరమా మీకు కావల్సింది ఎవరి సానుభూతో, దయాభిక్షో కాదు, మీకు కావలసింది సమానత్వం. మీకు కావల్సింది ఏదో ఒక చిన్న జీతం కాదు, మీ ప్రతిభకు తగ్గ న్యాయమైన అవకాశం. ఆ అవకాశం ఎప్పుడో వస్తుందని, ఎవరో ఇస్తారని చేతులు ముడుచుకుని ఎదురు చూస్తూ కూర్చోవద్దు దానిని మీ హక్కుగా డిమాండ్ చేయండి.ఏదో ఒక రాజకీయ నాయకుడు వచ్చి మీ జీవితాలను అద్భుతంగా మార్చేస్తాడు అనే భ్రమల నుండి మొదట బయటకు రండి. మీ జీవితాన్ని, మీ భవిష్యత్తును మీరే స్వయంగా నిర్మించుకోవాలి. అలా నిర్మించుకునే క్రమంలో మీకు అడ్డుపడే కుల, మత, సామాజిక గోడలను కూల్చుకోవడం మీ ప్రాథమిక హక్కు, అలాగే రేపటి తరం కోసం మీపై ఉన్న కనీస బాధ్యత కూడా. రండి, కులాల చీకటి గదుల్లో, సంకుచిత భావాల మధ్య బందీలుగా మిగిలిపోవడం కాదు సమానత్వపు వెలుతురులో, సరికొత్త చైతన్యంతో నవ భారతాన్ని నిర్మించుదాం. అందరం ఒక్కటిగా నిలబడుదాం. హక్కుల కోసం ఒక్కటిగా పోరాడుదాం. విజయ తీరాల వైపు ఒక్కటిగా గెలుద్దాం!ఈ కీలకమైన క్షణంలో మీరు ఏమి చేస్తారు? నిరాశలో కూలబడి, వ్యవస్థను తిట్టుకుంటూ ఉండిపోతారా? లేదా దేనికైనా సిద్ధపడి తలెత్తి నిలబడతారా? మీరు తీసుకునే ఆ నిర్ణయమే మీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాదు, ఈ దేశపు రేపటి భవిష్యత్తును కూడా నిర్ణయిస్తుంది.జీవిత ప్రయాణంలో మీకెప్పుడైనా ఒంటరిగా అనిపిస్తున్నప్పుడు, వెనకడుగు వేయాలనిపించినప్పుడు ఒక్కటి మాత్రం బలంగా గుర్తుపెట్టుకోండి సమాజంలో మీలాగే నిరాశపడుతున్న, వివక్షకు గురవుతున్న కోట్లాది మంది యువకులు ఉన్నారు. వాళ్ళందరి గుండెల్లో చైతన్యం రగిలించే తొలి మంట మీరు అవ్వండి. ఆ చిన్న మంటే రేపు వేలు, లక్షలు, కోట్లాది మందికి వ్యాపించి ఒక మహా విప్లవంగా మారుతుంది.ఊరు మనది. వాడ మనది. ఈ మట్టి మనది. ఈ ఆకాశం మనది. ఈ నేలపై ఉన్న ప్రతి ఒక్క అవకాశం మన జన్మహక్కు. వీటిని మనం గౌరవంగా పొందాలంటే రాజీలేని పోరాటం తప్పదు. కానీ ఆ పోరాటం ఎప్పటికీ ఒంటరిది కాదు. అది మనందరి ఉమ్మడి ప్రయాణం. దారిలో కులాలు అడ్డుపడవచ్చు, కానీ అవి మన ఐక్యత ముందు కొట్టుకుపోతాయి. పేదరికం అడ్డుపడవచ్చు, మన నిరంతర శ్రమతో అది వదలిపోతుంది. వ్యవస్థ అడ్డుపడవచ్చు, మన ప్రశ్నించే తత్వంతో అది కచ్చితంగా మారి తీరుతుంది.ఎందుకు అంటే ఆశయం వైపు అడుగులు వేసే యువత ఎప్పటికీ ఆగదు. అన్యాయాన్ని ఎదిరించే యువత ఎప్పటికీ ఓడదు. ఈ దేశపు రేపటి నిజమైన విజయగాథను లిఖించేది నేటి యువతరం మాత్రమే!

డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

## నినాద కవిత!

పేదలు అక్షరాస్యులు
కాకుండా దేశంమారదు!
విద్య, విజ్ఞానం సరే
అసలు అక్షరాస్యతేలేదు!
వేదాలు పుట్టిన దేశం
సూద్రులుచదవకూడదు!
సూద్రుడు తపస్సు చేస్తే
ధర్మం చెడిపోయిందట!
శంబూకుడి తలతీసాడు
'బోయ'రామాయణంరాసాడు!
పెళ్లికాకుండాకుంతీగర్భం
ఐదుగురుభర్తల ద్రౌపది!
ఇంద్రుడి వ్యభిచారం
శిక్షమాత్రం అహల్యకి!
భూమిలో దొరికిన సీత
పాయసానికి పిల్లలు!
తలతోకలేనికథలు
ఇప్పుడుకూడా అవే !
వేలసంవత్సరాలుగా
అశాస్త్రీయ భారతదేశం!
మనువాద నాయకులకు
ఆ కథలే ఆదర్శం!
సూద్రులంటే చులకన
నోటికొచ్చిన వ్యాఖ్యలు!
ఎప్పుడూ మనదేశంలో
డైవర్షన్ పాలిటిక్సే!
ఉద్యమకారులారా!
సంస్కృతి మారాలి!
ఆర్థికరాజకీయఉద్యమం
విజయంసాధించాలంటే–
మన దేశంలో ముందు
సాంస్కృతిక ఉద్యమం నడపాలి!
కులప్రేమికులరా! మీకుల పోళ్ళను
అక్షరాస్యుల్ని చెయ్యండి!
నిరక్షరుల్ని పాలకులు
ఎంతైనా మాయ చేస్తారు
జరుగుతున్నపెద్దమాయ
మనుస్మృతి రాజ్యాంగం!
మతం ఏదైనా సరే
పేదల్ని జోకొడుతుంది!
ప్రశ్నించకుండా వారిని
చైతన్యహీనుల్నిచేస్తుంది
ఏ మతం చెప్పినా అన్నీ
అభూత కల్పనలే!
కుల మతాలు ప్రజల్ని చీల్చటానికే!
దేశం బాగుపడాలంటే
అక్షరాస్యత ప్రాథమికం!
యువకుల్లారా!రా రండి!
అక్షరసమాజంనిర్మించండి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాదు

# తాండూర్ రైల్వే స్టేషన్‌లో గర్భిణీ మహిళ ప్రసవం

- అర్ధరాత్రి నుంచి మహిళ పురిటి నొప్పులతో అవస్థలు
- ప్రసవ సమయం కాదని పంపివేసిన వైద్య సిబ్బంది
- పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి
- తీరు మారని వైద్య సిబ్బంది



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 24 (జనం సాక్షి) :** గర్భిణీ స్త్రీలకు తల మాణిక్యంగా ఉన్న ప్రభుత్వ మాత శిశువు ఆసుపత్రిలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారిన పెదింటి మహిళ గర్భిణీ స్త్రీల కష్టాలు తీరడం లేదు. విధి నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆయాస పడుతూ ఆసుపత్రికి రావాలని చూస్తే ఎన్నిసార్లు ఫోన్ చేసిన ప్రభుత్వ అంబులెన్స్ రాకపోవడంతో ఓ పేదింటి మహిళ రైల్వే స్టేషన్ లోనే ప్రసవించింది. ఈ మానవీయ దయనీయమైన ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ లో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం తాండూర్ జినుగుర్తి గ్రామానికి చెందిన ఓ పెదేంటి మహిళ సకాలంలో ప్రభుత్వ అంబులెన్స్ రాకపోవడంతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాండూర్ రైల్వే స్టేషన్లో ప్రసవించింది. ఇది గమనించిన ఆటోవాలా మానవత్వంతో తాండూర్ మాత శిశువు ఆసుపత్రిలో చేర్పించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. మాతా శిశువు ఆసుపత్రిలో పురుడు పోసుకోవడానికి శనివారం నాడు ఆసుపత్రిలో చేరింది. ఆమెను పరీక్షించిన డాక్టర్లు ఫిట్స్ ఉన్నట్లు గుర్తించి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక స్తోమత లేని ఆ మహిళ రైల్లో తిరిగి తాండూరుకు చేరుకుంది. తాండూర్ ఆసుపత్రిలోనే పురుడు పోయాలని డాక్టర్లు వైద్య సిబ్బందిని కోరింది. కానీ ఇంకా నెలలు నిండ లేదని ఇప్పుడే ప్రసవం జరగదని వైద్య సిబ్బంది ఆస్పత్రి నుంచి పంపివేశారు. ఆ మహిళ తాండూర్ రైల్వే స్టేషన్ లో తలదొచుకోగా అక్కడే పురిటి నొప్పులు వచ్చి ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఇది గమనించిన ఆటోవాలా ఆమెను తాండూరు ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలియగానే తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రాజ్ ఆసుపత్రికి వెళ్లి సంఘటనపై ఆరా తీశారు . బాధిత బాలెంతకు మహిళకు కొంత ఆర్థిక సహాయం అందించ తల్లి బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. కార్పొరేటర్ ఆసుపత్రులను తలదన్నే విధంగా మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ప్రయత్నాలు చేస్తుంది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరుతో పేదల సంక్షేమ పథకాలపై విస్తృత కార్యక్రమాలు చేపడుతూ 99 రోజుల కార్యచరణ చేపట్టింది. కానీ అది ఎంతవరకు అమలు అవుతుందో ఇప్పుడే చెప్పలేము కానీ తాండూరు మాతా శిశు ఆసుపత్రిలో మాత్రం గర్భిణీ స్త్రీలకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రసవం కోసం వచ్చే గర్భిణీ స్త్రీలకు పట్ట పగలే వైద్య సిబ్బంది డాక్టర్లు చుక్కలు చూపిస్తున్నారు. పురిటి నొప్పుల వేదన ఒకవైపు అయితే డాక్టర్లు సిబ్బంది నిర్లక్ష్యం వారి తీరు యాతనంగా మారింది. వారికి సరియైన వైద్యం అందించక ఏదో ఒక సాకుతో ఇంటికి పంపించడం లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడం వంటి చర్యలు చేపట్టడంతో ఆర్థిక స్తోమత లేని పేదింటి గర్భిణి స్త్రీలు రోడ్డుపైనే ప్రసవించవలసిన పరిస్థితి నెలకొంది. తాండూర్ మాత శిశు ఆసుపత్రిలో శర మామూలు అయింది. నెలలో ఒకటి రెండు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సంఘటనలపై మెడికల్ కౌన్సిల్ దర్యాప్తు జరిపిన బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా డాక్టర్లు నర్సులు మిగతా వైద్య సిబ్బంది మధ్య సమన్వయ లోపం ఉంది. దీని కారణంగా ఆస్పత్రిలో ప్రసవం కోసం వెళ్లిన గర్భిణీ స్త్రీలకు సరియైన వైద్యం అందడం లేదు. వారి సమస్యలను పరిష్కరించుకోవడానికి కొందరు డాక్టర్లు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తే వైద్య సిబ్బంది తమ గోస ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ప్రయోజనం శూన్యం. ఇప్పటికైనా అధికారులు మాతా శిశు ఆసుపత్రి పై సమగ్ర దర్యాప్తు జరిపి పేదింటి గర్భిణీ స్త్రీలకు సరియైన వైద్యం అందే విధంగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం...

## పాలమాకుల గ్రామంలో జాతీయ రహదారిపై రైతుల ధర్నా

- కటింగ్ పేరుతో రైతులను దోపిడి చేస్తున్న మిల్లర్లు



**నంగునూరు, మే 24 (జనం సాక్షి) :** నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో రైతుల వడ్లకు ఒక క్వింటాలుకు మూడు కిలోల కటింగ్ చేస్తామని మిల్లర్లు ప్రకటించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడం, సంబంధిత అధికారులు మిల్లర్లకు మద్దతుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. రైతుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.పంట సాగు కోసం అప్పులు చేసి, అధిక పెట్టుబడులతో వడ్లు పండించిన రైతులకు సరైన ధర అందకపోగా, ఇప్పుడు కటింగ్ పేరుతో మరింత నష్టం కలిగించడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను అర్థం చేసుకోవాల్సిన ప్రభుత్వం మిల్లర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. "రైతు రాజ్యం" అంటూ మాటలు చెప్పే ప్రభుత్వం, రైతులు రోడ్డెక్కిన తర్వాత కూడా స్పందించకపోవడం సిగ్గుచేటని రైతులు మండిపడ్డారు. వెంటనే మిల్లర్లపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## గొర్రెల మందపై కుక్కలు దాడి

- 30 గొర్రెలు, పొట్టేలు మృతి

**మల్దకల్, మే 24 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామంలో ఆదివారం కురువ పెద్ద భీమన్న చెందిన గొర్రెలు పొట్టేళ్లపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. గ్రామ శివారులోని ఉన్న ఒకచోట గొర్రెలను వలవేసి వెళ్ళిపోయారు.అదును చూసి కుక్కలు జొరబడి గొర్రెలపై దాడి చేసి విచక్షణ రహితంగా కొరికి చంపి వేశాయి.దాదాపు లక్ష యాభై రూపాయలు నష్టం వాటిలిందని బాధితుడు భీమన్న విలేకరులతో వాపోయారు.కుటుంబ సభ్యులు గొర్రెలు చనిపోయిన స్థలానికి వెళ్లి చూడగా బోరుమని వెద్చుకుంటూ ఉన్నారు.ప్రభుత్వం గొర్రెలు కాపరులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ మహాసభ విజయవంతం

- మహిళా రిజర్వేషన్ అమలు, పెరిగిన ఇంధన ధరలపై పోరాటానికి సిద్ధం

**మొయినాబాద్, మే 24 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా మహాసభ ఘనంగా జరిగింది. మహిళా రిజర్వేషన్ అమలు, పెరిగిన ఇంధన ధరలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సభలో కీలక తీర్మానాలు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు మరియు టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీంభరత్, శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే జగదీశ్వర్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.అలాగే టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కేక్ కట్ చేసి మిఠాయిలు



పంచుకున్నారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభరత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న 542 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం మహిళలకు కేటాయిస్తూ మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు రాజకీయ భాగస్వామ్యం కల్పిస్తామన్న హామీని కేంద్రం నిలబెట్టుకోవాలని కోరారు.ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పేరిట ఓటర్ల తొలగింపు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, తెలంగాణలో అలాంటి చర్యలు చేపట్టాలని ప్రయత్నిస్తే మహిళా కాంగ్రెస్ తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల తరపున మహిళా కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె, ప్రజలను దారిద్ర్యంలోకి నెట్టే విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఉద్యమాలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు తనకు సహకరించిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వానికి, పార్టీ శ్రేణులకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత



**అల్వాల్, మే 24 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెల శివ పేర్కొన్నారు. భూదేవి నగర్ డివిజన్ పరిధిలోని భూదేవి నగర్ పార్కు వద్ద ఆదివారం ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని తెలిపారు. ఒక వ్యక్తికి ఒకే ప్రాంతంలో ఓటు హక్కు ఉండాలని, ఎక్కడైనా రెండు చోట్ల ఓట్లు ఉంటే వెంటనే సవరించుకుని ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి సహకరించాలని కోరారు. ఓటు హక్కు పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ-బ్లాక్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు మంద బాలకృష్ణ రెడ్డి, నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, శివశంకర్, సుదర్శన్ రెడ్డి, భాస్కర్, రాజేందర్, లక్ష్మణరావు, సదానంద్, బబిత, లక్ష్మి, జ్యోతి, సరోజ, వాణి తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు
- అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 24 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాఫ్టీలో, ప్రైవేట్ వాహనంలో తిరుగుతూ పోలీసు స్టేషన్లు, బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తూప్రాన్ టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని అదనపు ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత అనుమతి పత్రాలు, రవాణా ధృవపత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది ట్రాఫిక్ బ్యాటన్స్, రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.




## క్రీడలు ఐక్యతను పెంచుతాయి




**నారాయణపేట, మే 24 (జనం సాక్షి) :** క్రీడలు ఐక్యతను పెంచుతాయనీ నారాయణపేట మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ భరత్,డిఫీటెడ్ కౌన్సిలర్ దేగుల్ మడి మల్లేష్ అన్నారు.ఆదివారం నారాయణపేట లో అశోక్ నగర్,నక్క రామయ్య కాలనీ,భివండి కాలనీ క్రీడాకారులకు బిపిసిఎల్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఎంతో ఉపయోగమని అన్నారు.క్రీడల ద్వారా మానసిక శారీరక దృఢత్వం పెంచుతాయని అన్నారు.ప్రధానంగా క్రీడలు ఐక్యతను పెంచుతాయనీ అన్నారు.ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొని నైపుణ్యం ప్రదర్శించాలని అన్నారు.అనంతరం విజేతలకు వారు కప్ లతో పాటు 5 వేల నగదు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మహిళా వారోత్సవాల్లో సమన్వయంతో వ్యవహరించాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి ప్రతినిధి, మే 24 (జనంసాక్షి) :** ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, పోషకాహారం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలు నిర్వహణపై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, జిల్లా అధికారులు, థీమ్ నోడల్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారత, అంగన్‌వాడీ సేవల బలోపేతం, మహిళల భద్రత, బాలికల అభివృద్ధి, వృద్ధ మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల సిబ్బంది అన్ని కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, సిడిపిఓలు, థీమ్ నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు, కారు ఢీ

- నలుగురికి స్వల్ప గాయాలు

**చేవెళ్ల, మే 24 (జనంసాక్షి) :** ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చేవెళ్ల ఎస్ఐ తేజశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం మధ్యాహ్నం సమయంలో చేవెళ్ల వైపు వస్తోంది. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ స్టేజీ వద్దకు రాగానే హైదరాబాద్ వైపు వెళ్తున్న బ్రీజా (టీజీ09సీ8589) కారు ఢీకొట్టింది. ఈ సమయంలో కారులో బెలూన్స్?? ఓపెన్ కావడంతో అందులో ఉన్న ఇద్దరికి ప్రాణాపాయం తప్పింది. అయితే స్వల్పంగా గాయాలయ్యాయి. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా.. డ్రైవర్ వెనక వైపు సీటులో కూర్చున్న ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్??లో చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మిగితా ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపించారు. ఘటనలో కారు డ్రైవర్‌దే తప్పని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తేజశ్రీ వెల్లడించారు.



# అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 24 (జనం సాక్షి) :** జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాల వద్ద అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సర ఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూ య సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతా ధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు,సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపా లన -- ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్ర మాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతు న్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు,హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించా లని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపు లు వేగంగా




అందేలా ట్యాబ్ ఎంట్రీలు,డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయా లని అధికారులను ఆదేశిం చారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగు తోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుం దని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.తాలు,తరు గు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమ న్నారు.స్వతంత్ర భారతదే శంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనం తగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలం గాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్ల కు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు.వ్యవ సాయ క్షేత్రాల్లో పంటల అవశే షాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావ డమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగిం చాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్స వాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ వీడి యో కాన్ఫరెన్స్ సమావేశా నికి నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి హాజరయ్యారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాల తో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవం తం చేయాలన్నారు.కొను గోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థి తులు ఉండకూడదన్నారు. మహిళా సంక్షేమ వారోత్స వాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశిం చిన కార్యక్రమాలను సజా వుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొ న్నారు.ఈ సమావేశంలో డి ఎం సివిల్ సప్లయ్ సైదులు, డి డబ్ల్యూ రాజేందర్ గౌడ్, డీ ఏ వో జాన్ సుధాకర్, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చీలపల్లి వరుస చోరీల కేసులను ఛేదించిన పోలీసులు

- కోటి ముప్పై ఐదు లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల రికవరీ
- విలువైన బంగారాన్ని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి
- విశేషంగా కృషి చేసిన పోలీసు బృందాలకు రివార్డులు
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 24 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో వరుసగా జరిగిన చోరీల కేసులను మెదక్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. దొంగిలించబడిన భారీ మొత్తంలో బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తూ...

ఈ నెల 14వ తేదీ రాత్రి గ్రామంలోని తాళం వేసిన ఐదు ఇండ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. సుమారు 109 తులాలు 9 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, రూ.19 వేల నగదు అపహరించారు. మరో ఇంట్లో మూడు తులాల బంగారం దొంగిలించారు. ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి రామాయంపేట సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 929.7 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లా నాయక్‌పై ఇప్పటికే పలు జిల్లాల్లో అనేక చోరీ కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. శంకరంపేట–ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసులతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన మరో 12 కేసులను కూడా నిందితుడు ఒప్పుకున్నాడు. మొత్తం 17 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. నిందితులను వేగంగా పట్టుకున్నందుకు బాధితులు రాములు, మాణిక్ రెడ్డి జిల్లా ఎస్పీతో పాటు కేసు దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బాధితుడు రాములు మాట్లాడుతూ తమ బంగారం మళ్లీ దొరుకుతుందని ఆశించలేదని, దొంగతనం జరిగినప్పటి నుంచి పోలీసులు అండగా నిలిచి ధైర్యం చెప్పారని తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి కేసును ఛేదించిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో విశేషంగా కృషి చేసిన ఐదు ప్రత్యేక బృందాల సిబ్బందికి రివార్డులు, నగదు పురస్కారాలు అందజేశారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన బంగారాన్ని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని అవగాహన కల్పించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు రేణుక రెడ్డి, జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్ రెడ్డి, పోచయ్య, సీసీఎస్ బృందం, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి



**ఉర్కొండ, మే 24 (జనం సాక్షి) :** మండలంలోని గ్రామాల ప్రజలు కుల, మత, వర్గాలు లేకుండా పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఊర్కొండ ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. ఆదివారం రోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని హిందూ, ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం ఎస్సై కృష్ణదేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని మతాల, వర్గాల ప్రజలు పరస్పర సహకారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో మతకలహాలు రెచ్చగొట్టే పుకార్లు, అసత్య ప్రచారాలను షేర్ చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. బక్రీద్ సందర్భంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పండుగను పరస్పర గౌరవ భావంతో, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు లేదా సమస్యలు తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పోలీసులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని హిందూ, ముస్లిం మత పెద్దలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు

- అర్ధరాత్రి చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ
- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, మే 24 (జనం సాక్షి) :** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా మీదుగా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల నిర్వహణను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుల్కల్, ఎంఎన్ఆర్, కవలంపేట్, ఇంద్రకరణ్, కొండాపూర్, మునిపల్లి చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ.... ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. విధుల్లో పూర్తి అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీలు నిర్వహించే సమయంలో రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించి, లైట్ బ్యాటన్‌లను వినియోగించాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా తప్పుడు వార్తలను ప్రచారం చేసినా, సోషల్ మీడియాలో అసత్య సందేశాలను ఫార్వర్డ్ చేసినా అలాంటి సంఘ విద్రోహ శక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

## నెలాఖరులోగా వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి ప్రతినిధి, మే 24 (జనం సాక్షి) :** జిల్లాలో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ,జిల్లాలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, సివిల్ సప్లై డీఎం జయశ్రీ, మెప్మా అధికారి రామాచారి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి




**సంగారెడ్డి టౌన్, మే 24 (జనం సాక్షి) :** సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో వారం రోజులుగా కొనసాగిన "జమాయమ్మ జగ్గారెడ్డి క్రికెట్ టోర్నమెంట్--సీజన్ 2" ఘనంగా ఆదివారం ముగిసింది. స్థానిక యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మల జగ్గారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎన్‌జీసీసీ టీ జే ఆర్ సంగారెడ్డి జట్టు విజేతగా నిలిచి రూ.1 లక్ష నగదు బహుమతిని కైవసం చేసుకోగా, రన్నరప్‌గా నిలిచిన నిరంజన్--11 పటాన్‌చెరు జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ విభాగాల్లో ప్రత్యేక నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. కౌన్సిలర్ ఫైజ్ బావజీర్ పర్యవేక్షణలో, నిర్వాహకులు సర్ఫరాజ్, అజర్, ఫహీం, యబా, ఇమ్రాన్ సమన్వయంతో పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

### క్రీడలు యువతకు క్రమశిక్షణ నేర్పిస్తాయి

ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఆటల్లో గెలుపు--ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రమశిక్షణ, సమయపాలన వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయని ఆమె అన్నారు.

### ఇండోర్ స్టేడియానికి రూ.10 కోట్లు

సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జగ్గారెడ్డి సహకారంతో రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు నిర్మల జగ్గారెడ్డి వెల్లడించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ హాఫీజ్ షేక్ షఫీ, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, నిర్వాహకులు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు తెలుసుకోవడమే లక్ష్యం

- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్



**జడ్చర్ల, మే 24 (జనంసాక్షి) :** ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముఖ్య లక్ష్యమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగలి శ్రీకాంత్ అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు బాలాజీ నగర్‌లో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ బస్తీ బాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడమే మా లక్ష్యం – పరిష్కారమే మా బాధ్యత అనే నినాదంతో సాగిన కార్యక్రమంలో కొంగలి శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకులు నడిమింటి శ్రీనివాసులు, మాజీ కిసాన్ మోర్చా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణలతో కలిసి బాలాజీ నగర్‌లోని ప్రతి ఇంటిని సందర్శించారు. స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక వసతుల కొరతను అడిగి తెలుసుకున్నారు. లోపించిన మౌలిక సదుపాయాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు, పెన్షన్ల సమస్యలను వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టౌన్ బీజేపీ ఎస్సీ మోర్చా ప్రెసిడెంట్ జగదీష్, దళిత సంఘం నాయకులు కృష్ణ, ఆంజనేయులు, 26వ వార్డు యువ నాయకులు విష్ణు, అరుణ్, పవన్, శ్రీనివాసులు, లక్ష్మణ్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# మే 25 నుంచి 30 వరకు మహిళా సంక్షేమ వారోత్సవాలు

- అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి, మే 24 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుండి 30 వరకు జిల్లాలో "మహిళా సంక్షేమ వారోత్సవం" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణ మేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మే 25న అన్ని ఏఎల్ఎఫ్ఎస్, టిఎల్ఎఫ్ఎస్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మహిళా ఆర్థిక వారోత్సవంపై అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జిఎస్, ఏఎల్ఎఫ్ఎస్ భ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలపై చర్చించనున్నారు. మే 26 నుండి 30 వరకు మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల ప్రదర్శనలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు, రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నారు. మే 27న మహిళా వ్యాపారవేత్తలకు మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలు అందించనున్నారు.

మే 28న ఐ ఎం ఎస్ కార్యక్రమాలపై అవగాహన, ఎస్ హెచ్ జి మహిళల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



మే 29న రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, ఎస్ హెచ్ జి రుణాల మంజూరు కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 30న పిఎమ్ ఎఫ్ ఎం ఈ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ రుణాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన మహిళా సంఘాలకు ప్రయోజనాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఈ వారోత్సవ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి

**గద్వాల నడిగడ్డ, మే 24 (జనం సాక్షి) :** జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనంతగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావడమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. అకాల వర్షాలతో



ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, డిఎస్పి మొగిలయ్య, పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డీఏవో వీరప్ప,డిఆర్డిఓ ముషాహిదా బేగం, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ సంఘం ప్రతినిధులు రామలింగేశ్వర్ కామ్లే, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**తూప్రాన్, మే 24 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి తెలిపారు. తూప్రాన్ శివార్గోగల పెద్దమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కిష్టాపూర్ లో బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు ఆ తర్వాత ఇమాంపూర్ గ్రామంలో సర్పంచ్ బక్క స్వరూప నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో మంజూరైన ఆరు లక్షల సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి నాచారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పల్లెర్ల రవీందర్ తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ కీర్తన రెడ్డి వైస్ చైర్మన్ కృష్ణ డైరెక్టర్ శ్రీనివాస్, వెంకటేష్, జింక మల్లేష్ నాగరాజ్ గౌడ్, పెంట గౌడ్ ఇమంపూర్ గ్రామ ఉప సర్పంచ్, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ కార్యాలయం దగ్ధం





- షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిన కార్యాలయం
- గత నెల క్రితం ముఖ్యమంత్రి అధికారులతో నిర్వహించిన సమావేశ కార్యాలయం
- మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన ప్రధాన ఫైలు కార్యాలయంలో ఉన్నట్లు సమాచారం
- అందుబాటులో లేని ఫైర్ ఇంజన్
- మేడిగడ్డ కార్యాలయము దగ్ధం పై అనుమానాలు

మహదేవపూర్: మే 24(జనంసాక్షి) :జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ ప్రాజెక్టు కార్యాలయము విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై పూర్తిగా ఖాళీ బూడిది కావడం జరిగింది. మహదేవపూర్ మండలంలోని అంబటిపల్లి మేడిగడ్డ వద్ద నిర్మించిన ఎల్ఎన్ టి కార్యాలయం ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో గురై భారీ మంటలు చెలరేగి కార్యాలయం పూర్తిగా కాలి బూడిదైంది. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మేడిగడ్డ కార్యాలయం షార్ట్ షర్టు వల్ల మంటలు చెరులేగిన ప్రమాదములో ఏలాంటి ప్రాణహాన్ని జరగలేదు. సుమారు ఒక గంట పాటు బీభత్సమైన మంటలు చెలిరేగుతున్న క్రమంలో అగ్నిమాపక శాఖకు సంబంధించిన ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడంతో పూర్తిగా కార్యాలయము దగ్ధం కావడం జరిగింది. గత నెల ముఖ్యమంత్రి మేడిగడ్డ సందర్శన తో పాటు రైతు భరోసా ప్రారంభానికి ముందు మేడిగడ్డ మరమతులకు సంబంధించి ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం తో పాటు పత్రికా సమావేశం ఏర్పాటు చేసిన ఎల్ఎన్టి కార్యాలయం ఇదే. మేడిగడ్డకు సంబంధించిన ప్రధాన కార్యాలయము షార్ట్ సర్క్యూట్ కు గురికావడం ఈ కార్యాలయంలోని అన్ని బ్యారేజీలకు సంబంధించిన ప్రధానమైనటువంటి ఫైళ్లు ఈ కార్యాలయంలోనే ఉన్నట్లు తెలుస్తుంది. ఇక ప్రస్తుతం మేడిగడ్డ ఎల్ అండ్ టి ప్రధాన కార్యాలయం షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదానికి గురైందా. లేదా మరేమన్న కారణాలతో సంఘటన చోటు చేసుకుందా. ప్రధాన కార్యాలయము చూస్తుండగానే కాళీ బూడిది కావడంపై అనేక అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

# అమాయకత్వమే ఆసరాగా..



| Token No | Applicant Name | Guardian | Beneficiary Name | Address | Recommended By | Status |
|---|---|---|---|---|---|---|
| 84272/TCMRF/2024 | SARAIAH S | S/O NARSAIAH | SARAIAH S | H NO 1-16, JANGAVANIGUDEM VILLAGE, KOTHAGUDA MANDAL, MAHABUBABAD, JANGAVANIGUDA (V), KOTHAGUDEM (M), MAHABUBABAD (D) | DANASARI ANASUYA SEETHAKKA MINISTER FOR PR&RD, RWS, WOMEN & CHILD WELFARE | Cheque printed - 111243/CMRF/2024 Cheque - 855243 Cheque Date - 04-11-2 |

- రెండేళ్లు దాటినా అందని సీఎంఆర్ఎఫ్ చెక్కు...ఏమైంది!
- రూ. 2.5 లక్షల ఆస్పత్రి ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న జంగవనిగూడెం వాసి
- మంత్రి సీతక్క సిఫార్సుతో వచ్చిన చెక్కు...
- ములుగు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం... బాధితుడి ఆవేదన

కొత్తగూడ మే 24 (జనంసాక్షి) : పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి,నిధులు క్షేత్రస్థాయిలో అర్హులకు అందకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, మధ్యవర్తుల కాలయాపన కారణంగా ఓ నిరుపేద కుటుంబం గత రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అల్లాడిపోతోంది.మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండల పరిధిలోని జంగవనిగూడెం గ్రామపంచాయతీకి చెందిన సనప సారయ్య అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆయనకు అందాల్సిన చెక్ ఏమైంది అని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**మంత్రి సిఫార్సుతో మంజూరు...బాధితులకు అందని వైనం**

బాధితుడు సనప సారయ్య గతంలో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స నిమిత్తం సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల (2,50,000) వరకు ఖర్చు వచ్చింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కాగానే, అప్పుల పాలైన తమ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ సారయ్య వెంటనే సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాధితుడి పరిస్థితిని గమనించిన స్థానిక మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఈ దరఖాస్తును పరిశీలించి, త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని అధికారులకు సిఫార్సు చేశారు. గడచిన నాలుగు నెలల్లోనే మంత్రి చొరవతో చెక్కు





నెంబర్ (855243)తో సీఎంఆర్ఎఫ్ నిధుల చెక్కు కూడా సకాలంలోనే మంజూరైనట్లు తెలుస్తోంది.

**నా చెక్కు ఏమైంది...! బాధితుడి ఆవేదన : సారయ్య**

మంజూరైన ఈ చెక్కు మాత్రం సుమారు రెండు సంవత్సరాలకు పైబడి నుంచి బాధితుడికి అందకుండా ఉండడంతో దీనిపై బాధితుడు స్థానిక మంత్రి కార్యాలయానికి వెళ్లి పలుమార్లు విచారించగా... చెక్కు మంజూరైనట్లుగా కార్యాలయ సిబ్బంది తెలపడం జరిగిందని అన్నారు.వెంటనే స్థానికంగా ఉన్న కొంతమంది నాయకులను కలవగా ఇంకా మా దగ్గరకు ఆ చెక్కు రాలేదని అని అన్నారు.ఒకవైపు చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండటం, మరోవైపు చేతికి అందాల్సిన ప్రభుత్వ సాయం రెండేళ్లు దాటినా రాకపోవడంతో ఏం చేయాలో తోచని స్థితిలో సారయ్య కుటుంబం కొట్టుమిట్టాడుతోంది.?ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ఎఫ్ చెక్కు ను ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జంగవనిగూడెం గ్రామపంచాయతీకి చెందిన సారయ్యకు న్యాయం చేయాలని, ఆయనకు అందాల్సిన ఆర్థిక సాయాన్ని త్వరగా అందేలా చూడాలని మండల ప్రజలు, బాధితుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# 20 ఏండ్ల తర్వాత మళ్లీ విద్యార్థులుగా మారి..



- దిలావర్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దిలావర్‌పూర్, మే24 (జనం సాక్షి): జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల దిలావర్‌పూర్ కు చెందిన పదవ తరగతి 2006-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి నాటి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ తరలివచ్చారు. సుమారు ఇరవై సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత క్లాస్‌మేట్స్ అందరూ ఒకేచోట కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలు మళ్లీ సజీవంగా గుర్తుకు వచ్చాయి. విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, తమ పాఠశాల రోజుల నాటి తీపి అనుభవాలను పంచుకుంటూ రోజంతా ఎంతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నాడు చదువులు చెప్పిన ఉపాధ్యాయులు మళ్ళీ విద్యార్థులను అటెండెన్స్ తీసుకుంటూ పేరు పేరు పలకరించుకోవడం కొసమెరుపు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు అత్యంత ఘనంగా సన్మానించి, వారి అమూల్యమైన సేవలను కొనియాడారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, ఇలాంటి ఆత్మీయ సమావేశాలు పాత రోజులను గుర్తుచేసు కోవడంతో పాటు, మారుతున్న కాలంలోనూ స్నేహ బంధాలను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కలయికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఒకరికొకరు జ్ఞాపికలను అందజేసుకోవడం మరియు అందరూ కలిసి దిగిన గ్రూప్ ఫోటోలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# దొడ్డ వెంకటయ్య మృతి తీరని లోటు



- రామన్నగూడెం మాజీ సర్పంచ్ తండ్రికి కాకులమర్రి లక్ష్మణ్ బాబు నివాళులు

ఏటూరునాగారం, మే 24(జనంసాక్షి) : మండలంలోని రామన్నగూడెం గ్రామ మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ తండ్రి దొడ్డ వెంకటయ్య ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు రామన్నగూడెం గ్రామానికి చేరుకుని, వెంకటయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దొడ్డ కృష్ణ ,కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం జరిగిన దొడ్డ వెంకటయ్య అంతిమయాత్రలో లక్ష్మణ్ బాబు, స్వయంగా పాల్గొని, పాడె మోసి కుటుంబ సభ్యులకు కొండంత అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ బాబు తో పాటు తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణయ్య, తాడూరి రఘు, ఎగ్గడి కోటయ్య, దిడ్డి మోహన్, దడిగల సమ్మయ్య, యలవర్తి శ్రీనివాస్ స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతునికి నివాళు లర్పించారు.

## విద్యుత్ ప్రమాదాలకు నిలయంగా హోర్డింగులు





స్టేషన్ ఘన్పూర్, మే 24 ( జనం సాక్షి) : స్టేషన్ ఘనపూర్ హన్మకొండ రోడ్డు లో వేణుదాబా ముందు ప్రయివేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన హోర్డింగ్ బ్యానర్ల వల్ల విద్యుత్ లైన్లు ప్రమాధకరం గా మారింది గాలివచ్చిన ప్రతీసారి బ్యానర్లు ఊడి పోయి విద్యుత్ తీగలకు అల్లుకొని ప్రమాదాలు ఏర్పడి సిబ్బందికి తలనొప్పిగా మారింది. విద్యుత్ అధికారులు ఎన్ని సార్లు చెప్పినా వాళ్ళ తీరు మారడంలేదు. విద్యుత్ సిబ్బంది తొలగించినా మళ్ళీ అమర్చి ప్రమాధాలకు కారకులు అవుతు న్నారు. ప్రభుత్వం ఇలాంటి హోర్డింగులకు అనుమతి ఇవ్వకూడదని ప్రజలు కోరుతున్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల, మే 24( జనం సాక్షి): మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కాల్వపెల్లి మానేరు వాగు నుండి జాడల్పేట వైపు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తన సిబ్బందితో కలిసి నిన్న రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నేరేడుపల్లి,వేషాలపల్లి గ్రామాలకు చెందిన మూడు ట్రాక్టర్లు మానేరు వాగు నుండి దొంగతనంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డాయి. డ్రైవర్ల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.అక్రమ రవాణాకు పాల్పడే వారు తమ తీరు మార్చుకోవాలి, లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను జప్తు చేస్తాం అని హెచ్చరించారు.

# నేటి ప్రజావాణి యథాతథం



- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ప్రతినిధి మే 24, (జనం సాక్షి) :జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంసోమవారం యథావిధిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరై సంబంధిత అధికారులకు వివరాలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిశీలించి, సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజలు సమర్పించే వినతులను నేరుగా స్వీకరించి, శాఖల వారీగా సమీక్షించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శక, సమర్థవంతమైన పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజావాణి కార్యక్రమాన్ని ఆ దిశగా మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## వడదెబ్బతో వృద్ధురాలు మృతి



వరంగల్ ఈస్ట్, మే 24 (జనం సాక్షి) : వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ ఎస్ ఆర్ ఆర్ తోట ప్రాంతానికి చెందిన వృద్ధురాలు శ్యామల సోమక్క వడదెబ్బతో (65) ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు ఆమె కుమారుడు సంపత్ తెలిపాడు. రేకుల ఇంట్లో ఉంటున్న సోమక్క రెండు రోజులుగా ఎండ వేడిమి వల్ల తీవ్ర జ్వరంతో బాధపడుతుందని ఈ క్రమంలో ఆదివారం మృతి చెందినట్లు తెలిపాడు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉంది. పేద కుటుంబానికి చెందిన సోమక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# ఉద్యమకారులవి బాంచెన్ బతుకులు!



- తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షులుగా పుట్ట ప్రతాప్

ఎల్కతుర్తి (జనంసాక్షి) : తెగించి కోట్లడిన తెలంగాణలో ఉద్యమకారులది బాశీచెన్ బతుకులుగా మారాయి అన్నారు. మండల ఉద్యమకారుల పోరం అధ్యక్షులుగా పుట్ట ప్రతాప్ కార్యదర్శిగా అమరేందర్ నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఉద్యమకారుల సంఘం ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెగించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ సమయములో వంట వార్పు.రైల్ రోకో లాటి వి చేసి దెబ్బలు తిని ఈరోజు బాంచెన్ బతుకులుగా మారాయని అన్నారు 2000 నుండి 2014 వరకు జరుగగా, ఈ యొక్క ఉద్యమంలో దాదాపు 1200 మంది ఉద్యమకారులు తమ ప్రాణాలను త్యాగాలు చేయడం జరిగింది, ఈ త్యాగాల గుర్తే తెలంగాణ ఏర్పడ్డది, ఈ తెలంగాణ ఉద్యమంలో 1200 మంది అమరులైతే కేవలం 500 మందికి లబ్ధి చేకూర్చింది అప్పటి ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందనీ అని మిగతా ఏడు నుంచి 800 మంది ప్రాణాలు త్యాగాలు చేసిన వారి కుటుంబాలకు ధూమ్ ధామ్ వివిధ రంగాలలో పాటలు పాడు తూ, తెలంగాణ ప్రజలను ఉత్తేజపరిచి, కళాకారులు ముఖ్యపాత్ర పోషించారు, వారికి కూడా వేల సంఖ్యలో కళాకారులున్న కేవలం 550 మందికి సాంస్కృతిక కళాకారులుగా గుర్తించి ఈరోజు జీతాలు ఇస్తున్నారు ఈ ప్రభుత్వం గుర్తించి సంస్కృతిక కళాకారుల పెన్షన్లు సాంక్షన్ చేయాలని మరియు ఉద్యమంలో 800 మంది ఎలాంటి లబ్ధి పొందకుండ త్యాగం చేసినటువంటి వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వం గవర్నమెంట్ ఉద్యోగం 10 లక్షల రూపాయలు,పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్చేశారు 250 గజాలు ఇంటి స్థలము, మరియు 25వేల రూపాయల పెన్షన్ , ప్రకటించకపోవడం శోచనీయం,ఇప్పటికైనా ఉద్యమంలో పనిచేసిన వాళ్ళు వివిధ వ్యాధులతో జబ్బులతో, అనారోగ్య కారణాలతో,చాలామంది చనిపోతున్నారు, ఇప్పటికైనా అందరిని ఆదరించి నెల కు 25వేల పెన్షన మరియు 250 గజాల ఇంటి స్థలము ప్రతి ఉద్యమకారుడు బస్సు పాసు రవాణా సౌకర్యంలో భాగంగా రైలు పాస్,హెల్త్ కార్డు 10,000 రూపాయల కోట్లతో ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, అందులో ఉద్యమ సమయంలో జైలు పాలై చనిపోయిన వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం, పది లక్షల రూపాయలు పింఛన్ కల్పించాలని ఆయన ప్రభుత్వం మీద మండిపడ్డారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుట్ట ప్రతాప్, తోపాటు కార్యదర్శి అమరేందర్, ఉపాధ్యక్షులు మేకల రాజయ,కార్యదర్శి రమేష్,కోశాధికారి జూపాక శ్రీనివాస్,మరి శ్రీనివాస్, కమలా బాయ్, శ్రీలత,వజ్రమ్మ, విజ్జమ్మ, భాగ్యమ్మ,శాంతమ్మ,మేకల రాజకుమారి,పల్లె సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు..

# దుర్మార్గుల చేతిలో 20 ఏండ్ల అభివృద్ధి వెనక్కి..





- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి సన్మాన సభ

హనుమకొండ ప్రతినిధి మే 24(జనం సాక్షి) : హనుమకొండ నగరం హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గారి ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా నేతలందరూ వేం నరేందర్ రెడ్డి ని ప్రత్యేకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నేతలు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని కొనియాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి లేకుంటే జిల్లాకు సగం నిధులు కూడా వచ్చేవి కావని అన్నారు. గతంలో దుర్మార్గుల చేతిలో ఇరవై ఏళ్ల అభివృద్ధి వెనక్కు పోయిందని విమర్శించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఓరుగల్లు అభివృద్ధిపై వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. ఎయిర్‌పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రేటర్ వరంగల్ అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన సమయం కేటాయించి పనిచేస్తున్నారని అన్నారు.ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడంలో వేం నరేందర్ రెడ్డి ఉమ్మడి జిల్లాను ఏకతాటిపై నడిపి కీలక పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన సహకరిస్తున్నారని కొనియాడారు.ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వంలో నిర్ణయాలు తీసుకునే స్థాయిలో వేం నరేందర్ రెడ్డి ఉండటం ఓరుగల్లు అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తన కుమార్తె కడియం కావ్య రాజకీయ ప్రయాణానికి తొలి అడుగులు వేయించిన వ్యక్తి వేం నరేందర్ రెడ్డేనని చెప్పారు.ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ సోషల్ మీడియాలో కాక్రోచ్ పార్టీ అనే పదం పుట్టగానే బీజేపీ భయపడిందని విమర్శించారు.డీసీసీ అధ్యక్షుడు, కూడా చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ నగరాలను ఏకీకృత దృక్పథంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు వేం నరేందర్ రెడ్డి సహకారం మరింత అవసరమని అన్నారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ మంచికి ఓపిక, తప్పు జరిగితే ఆగ్రహం చూపే స్వభావం వేం నరేందర్ రెడ్డిదని అన్నారు. సీఎం వద్దకు వెళ్లే ముందే చాలామంది వేం వద్దకు వెళ్లే పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. 2004 నుంచి తనకు ఆయనతో పరిచయం ఉందని, తన రాజకీయ ఎదుగుదలలో సోదరునిలా సహకరించారని గుర్తుచేశారు. ఓరుగల్లు బిడ్డగా ఆయన ఢిల్లీ స్థాయిలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అప్పట్లో చంద్రబాబు చాలా కఠినంగా వ్యవహరించేవారని, టీడీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో మాట్లాడకుండా చూసేవారని గుర్తుచేశారు. కానీ వేం నరేందర్ రెడ్డి మాత్రం ఎప్పుడూ ఆప్యాయంగా మాట్లాడేవారని చెప్పారు. తమ ఇద్దరికీ ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయ ప్రత్యర్థి కావడంతో మరింత సాన్నిహిత్యం ఏర్పడిందని సరదాగా వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పరిపాలన విజయవంతం కావడంలో వేం నరేందర్ రెడ్డి సలహాలు కీలకమని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న కాంగ్రెస్ కార్యకర్తల పోరాట ఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా అనేక ప్రాంతాల్లో తనను అభిమానించే ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడామని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా స్వేచ్ఛాయుత పాలన అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు

## తమిళనాడు విద్యాశాఖ మంత్రిని కలిసిన వనపర్తి ఎమ్మెల్యే



**వనపర్తి రూరల్, మే 24 (జనం సాక్షి) :** ఎఐసిసి సెక్రటరీ, తమిళనాడు రాష్ట్ర మధురై జిల్లా, మేలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి విశ్వనాథన్ పెరుమాళ్ ఆదివారం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై మాట్లాడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేన రెడ్డి, ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట ఆలయం



**యాదగిరిగుట్ట మే 25 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ఆలయానికి విచ్చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు మూడు గంటలకు పైగా సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంటలకు పైగా సమయం పట్టింది. ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నిత్యా కల్యాణం, లడ్డు ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండక్రింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు వద్ద వాహనాలు బారులు తీరాయి.

## ప్రతి పేదవాని సొంతింటి కళను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, మే 24 (జనంసాక్షి) :** రాష్ట్రములో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి పేదవారి సొంతింటి కళ ను నెరవేర్చడం ప్రజా ప్రభుత్వం ధ్యేయమని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాడు దామరచర్ల మండలం నర్సాపురం గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ గృహాలను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తో కలిసి ప్రారంభించడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేద వాడి సొంతింటి కలను నిజం చేసేలాగా, ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రం లో ప్రజాప్రభుత్వం మొదటి విడతలో నియోజకవర్గా నికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, జూన్ 2 న రెండో విడుతలో రాష్ట్రం లో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్ల ను ఇవ్వనుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు చక్కదిద్దుతూనే అనేకసంక్షేమ పథకాలను అమలు పరచడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### బంగారు మైసమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

దామరచర్ల మండల పరిధిలోని బాలాజినగర్ తండాలోజరిగిన బంగారు మైసమ్మ జాతరలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిగ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది.

## యాదగిరిగుట్టలో యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆందోళనలు




**యాదగిరిగుట్ట, మే 24 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లో యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కొండపైన వర్తక సంఘం పేరుతో నడుస్తున్న దుకాణాలు రద్దు చేయాలని కోరుతూ గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపడుతోంది యాదాద్రి పరిరక్షణ కమిటీ. కొండపైన వర్తక సంఘం దుకాణాలు రద్దు చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ముందు ధర్నా చేశారు కమిటీ సభ్యులు. దీంతో రోడ్డు పై ట్రాఫిక్ జామ్ అయ్యింది. ధర్నా చేస్తున్న యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ తరలించారు పోలీసులు. కొండపైన వర్తక సంఘం పేరుతో కొనసాగుతున్న దుకాణాలు రద్దు చేసి టెండర్లు వేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు యాదాద్రి పరిరక్షణ కమిటీ. కొండపైన దుకాణాలను గత కొన్ని ఏండ్లుగా టెండర్ వేయకుండా రెన్యూవల్ చేయడంతో ఆలయ ఆదాయానికి గండి పడుతుందని ఆరోపించారు కమిటీ సభ్యులు. దుకాణాలు టెండర్ వేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

# పంట అవశేషాలు కాల్చొద్దు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం, మే 24 (జనం సాక్షి) :** పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాల్గొన్నారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా విజయవంతంగా కొనుగోలు నిర్వహించిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మంత్రివర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు.



ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, అధికారులు సమర్థవంతంగా పనిచేశారని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 1,23,560 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, అందులో 1,12,922 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉందని, మరో 16 వేల టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, కానీ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధి లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ కీలకమని, పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం కూడా వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటని డిప్యూటీ సీఎం తెలిపారు. దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో పంట అవశేషాలను కాల్చకుండా టామ్‌టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కూడా ఎవరైనా పంట అవశేషాలను కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూలి మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని మంత్రి పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి మంత్రివర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని, వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మండే ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కల్లూరు, మే 24 (జనం సాక్షి) :** సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు, వేసవి ఉష్ణోగ్రతలు చాలా తీవ్రంగా ఉన్నాయి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని లేనిచో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నవ్య కాంత్ సూచిస్తున్నారు . వడదెబ్బకు గురికాకుండాతీసుకోవాల్సిన జాగ్రత్తల పై పలు సూచనలు చేశారు.ఎండలో ప్రయాణాలు శారీరక శ్రమ కలిగించే పనులు మానుకోవాలి,అత్యవసరమైతేనే బయటకు రావాలి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్యలో బయటకు రాకుండా ఉండటం మంచిది. ఎండలో బయట తిరిగేవారు తప్పనిసరిగా తలకు హెల్మెట్, టోపీ ముఖానికి రుమాలు ధరించాలి. తెల్లటి వదులైన నూలు వస్త్రాలను ధరించడం మంచిది అని పేర్కొన్నారు.ప్రయాణాల్లో కానీ ఇంట్లో ఉన్నప్పుడు కానీ తరచుగా మంచినీరు నిమ్మరసం లేదా మజ్జిగ రసాన్ని కొద్దికొద్దిగా తాగుతూ ఉండాలి. నూనె పదార్థాలను బయట ఆహార పదార్థాలను , మాంసాహారాన్ని తినడం వీలైనంతవరకు నివారించాలి.తేలికగా జీరణమయ్యే కూరగాయలు పండ్లు పండ్ల రసాలు కొబ్బరి నీళ్లు మజ్జిగ రసం వంటివి ఎక్కువగా తీసుకోవాలి. వేసవిలో మద్యపానం ధూమపానానికి దూరంగా ఉండాలి. ఇంటిలో ఫ్యాన్లు కూలర్లు ఏసీలు వంటివి వినియోగించాలి .ఇంటిలో ఎల్లప్పుడూ తలుపులు కిటికీలు తెరిచి గాలి వీచే విధంగా ఉంచాలి. చిన్నపిల్లలు గర్భిణీలు వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ లక్షణాలు వడదెబ్బ తగిలిన వారిలో శరీర ఉష్ణోగ్రత పెరగడం చెమటలు పట్టడం తలనొప్పి వికారం వాంతులు గుండె దడ ఆయాసం మతిభ్రమించడం స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయ. వడదెబ్బ తగిలిన వారిని నీడ ఉన్న ప్రదేశానికి కానీ ఫ్యాన్ కిందకు కానీ తీసుకువచ్చి వస్త్రాలను వదులు చేసి తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలి . ఓఆర్ఎస్ ద్రావణం లేదా ఉప్పు చక్కెర కలిపిన నీటిని తాగించి వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. బస్టాండులు ప్రభుత్వ కార్యాలయాలు ఉపాధి హామీ పనులు గ్రామపంచాయతీలు ఆరోగ్య ఉప కేంద్రాలు వంటి చోట్ల ప్రజల అవసరం కొరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచడం జరిగింది అని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నవ్య కాంత్ తెలిపారు.

## ద్విచక్ర వాహనం దగ్ధం

### పది ఎకరాల్లో రాజుకున్న అగ్ని

తుంగతుర్తి, మే 24 (జనం సాక్షి) : తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామ శివారులోని స్మశాన వాటిక సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఎండిన వరి కొయ్యలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించి దాదాపు పది ఎకరాల మేర విస్తరించాయి. దీంతో రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, కార్యదర్శి వీరేందర్ వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామస్థుల సహకారంతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలను ఆర్పే ప్రయత్నాల్లో ఓ ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి మంటలు వ్యాపించకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే ధాన్యం నిల్వలో వ్యవసాయ సామాగ్రి అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం ఉండేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే అగ్ని ప్రమాదంతో పంట పొలాల్లో గడ్డి, ఎండిన అవశేషాలు కాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.సంఘటనపై స్థానిక అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## గోదాం ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్



**యాదగిరిగుట్ట, మే 25 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని రామాజీపేట గ్రామంలో ఉన్న పత్తి విత్తనాల కంపెనీని, వడ్ల గోదాం గా మార్చడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆ గోదామును ఆర్డీవో కృష్ణ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలసి సందర్శించారు. రైతులు ధాన్యం నిల్వ చేసేందుకు రైతులకు ఇబ్బందులు పడకుండా ఉండాలని భావించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులతో ప్రత్యేకంగా చర్చించి ఈ గోదాం ఏర్పాటుకు కృషి చేశారు. దీంతో రామాజీపేటతో పాటు పరిసర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకంతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలో సుమారు 85 శాతం వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ గోదాం ఏర్పాటు వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ధాన్యాన్ని సమయానికి విక్రయించే అవకాశం లభిస్తుందన్నారూ. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్‌టీఐ చట్టాన్ని పట్టించుకోని ఎంఈఓ కార్యాలయ అధికారులు

- ఎందుకు ఏర్పాటు చేయడం లేదు బోర్డులు..?
- ప్రశ్నిస్తున్న ప్రజలు..




**భూదాన్ పోచంపల్లి, మే 24 (జనం సాక్షి) :** బోర్డులు లేని ఎంఈఓ కార్యాలయం ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా ఉండాల్సిన ఆర్‌టీఐ బోర్డులు, సూచిక బోర్డులు, అధికారుల వివరాలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. భూదాన్ పోచంపల్లి మండల విద్యాశాఖ కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు సరైన సమాచారం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం ఎక్కడ, ఏ విభాగం ఎక్కడ, ఏ అధికారిని సంప్రదించాలి అనే కనీస వివరాలు కూడా లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌టీఐ చట్టం అమలులో ఉందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయని అంటున్నారు. ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు కార్యాలయ నిర్వహణలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసమా అని స్థానికులు నిలదీస్తున్నారు. వెంటనే కార్యాలయంలో ఆర్‌టీఐ వివరాలతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికైనా సమాచార బోర్డులు ఏర్పాటు చేస్తారా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జనం సాక్షి విలేఖరి వివరణ కోసం ఫోన్ చేసినప్పటికీ ఎంఈఓ స్పందించలేదు.

# కస్తూర్బా పాఠశాల జిల్లా అధికారి అధికార దుర్వినియోగం..!

- ప్రత్యేక అధికారుల అక్రమాలకు వత్తాసు..
- ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు ఆరోపణలు
- మామూళ్ల మత్తులో అధికారి..?
- విచారణ పేరుతో సిబ్బందిని టార్గెట్

**మర్రిగూడ, మే 24 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో జిల్లా అధికారి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కస్తూరిబా పాఠశాలల ప్రత్యేక అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోకుండా, ఆ ఎస్ఓలకే జిల్లా అధికారి కనుసన్నల్లో పనిచేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అక్రమాలు, అన్యాయాలపై విచారణ చేపట్టకుండా.. ఆ విషయాలు బయటకు ఎలా వెళ్తున్నాయనే దానిపైనే ఆరా తీస్తూ, సమాచారం ఇచ్చిన సిబ్బందినే టార్గెట్ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారి స్థానిక కాంగ్రెస్ నేతలతో సమావేశమై, పత్రికల్లో వచ్చిన కథనాలపైనే కేసులు పెట్టేలా ఉసిగొల్పుతున్నారని సమాచారం. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో మీటింగ్ పెట్టి మరీ, పిల్లలకు అన్యాయం జరిగినా చూసీచూడనట్లు ఉండాలని కస్తూరిబా సిబ్బందిని బెదిరించినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం కాకుండా సొంత మెనూతో నాణ్యతలేని భోజనం పెడుతున్నారని, దీనిపై కథనాలు వచ్చినా సంబంధిత ఎస్ఓలపై చర్యలు లేవు. పేద విద్యార్థుల నోరు కొట్టి లక్షలు సంపాదిస్తున్న అక్రమ అధికారులకు జిల్లా అధికారి వత్తాసు పలుకుతున్నారని, నెల నెలా మామూళ్లు అందుతున్నాయని జిల్లావ్యాప్తంగా చర్చ జరుగుతోంది. "నల్లగొండ జిల్లాలో పుట్టినా నన్ను ఎవరు ఏమి చేయలేరు? ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతా" అని జిల్లా అధికారి బెదిరిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట కస్తూరిబా ప్రత్యేక అధికారులు ఉండడంతోనే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని అంటున్నారు. తాను హెచ్ఎం గా ఉన్న స్కూల్లోనే ఫలితాలు అంతంత మాత్రంగా ఉన్న వ్యక్తికి





జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు ఇవ్వడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మర్రిగూడ కస్తూరిబాపై ఇన్ని ఆరోపణలు వచ్చినా విచారణ చేయకుండా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న జిల్లా అధికారిపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# విపణి

## కాంట్రాక్ట్ నియామకాలు.. పొరుగు సేవలకే సంస్థల మొగ్గు

**కృత్రిమ మేధ అనిశ్చితులే కారణం : టీమ్‌లీజ్ సర్వీసెస్ సీఎఫ్‌ఓ రమణి**



**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ సంబంధిత అనిశ్చితుల కారణంగా దేశీయ కంపెనీలు ఉద్యోగ నియామక ప్రణాళికలపై పునరాలోచిస్తున్నాయని.. కాంట్రాక్ట్ నియా మకాలు, పొరుగు సేవల (అవుట్‌సోర్స్) వైపు అధికంగా మళ్లుతున్నాయని స్టాఫింగ్ సంస్థ టీమ్‌లీజ్ సర్వీసెస్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్‌ఓ) రమణి దాతి వెల్లడించారు. అధిక శాతం సంస్థలు తమ భవిష్యత్తు వ్యూహాల్లో ఏఐ సంబంధిత ఉద్యోగాలే ప్రధానంగా ఉంటాయని భావిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేక సాంకేతిక నిపుణులకు, ముఖ్యంగా ఏఐ నైపుణ్యాలు కలిగిన వారికి సైబర్ సెక్యూరిటీ రంగంలో గిరాకీ పెరుగుతోందన్నారు. ఈ నిపుణుల కోసం కంపెనీలు అధికంగా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఉద్యోగులూ అవసరమవుతున్నారు

బహుళజాతి కంపెనీలు, గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల (జీసీసీ)కు నిలయమైన మనదేశంలో.. అన్ని రంగాల సంస్థలు ఏఐ ఆధారిత యాంత్రీకరణకు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం నూతన నియామకాలను నెమ్మదింపజేస్తున్నాయని రమణి పేర్కొన్నారు. ఏఐ టూల్స్ వినియోగాన్ని ఆరంభించాక, తమ సిబ్బందిని 50% తగ్గించుకున్న సంస్థలు.. కొన్ని నెలల్లోనే 'ఇంకా సిబ్బంది అవసరం' అంటున్నాయని తెలిపారు. తమ ఉద్యోగుల్లో 20-30% మందిని పొరుగుసేవలు లేదా వేరియబుల్ నమూనాల్లో ఉంచుకోవాలని క్లయింట్లకు తాము సలహా ఇస్తున్నట్లు రమణి తెలిపారు.

జీసీసీలు విస్తరిస్తున్నా

జీసీసీలు విస్తరిస్తున్నప్పటికీ, కంపెనీలు సౌకర్యవంతమైన సిబ్బంది (ఫ్లెక్సిబుల్ స్టాఫింగ్) నియామకం, ఏఐ ఆధారిత శ్రామిక శక్తి పునర్వ్యవస్థీకరణల వైపు ఎక్కువగా మళ్లుతున్నాయని రమణి వివరించారు. జాబ్ సెర్చ్ పోర్టల్ ఇండీడ్, ఐటీ పరిశ్రమ సంస్థ నాస్కామ్ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం, ఈ ఏడాదిలో ఏఐ సంబంధిత లేదా ఏఐ మద్దతు ఉన్న ఉద్యోగులు అవసరమవుతారని దాదాపు అన్ని సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఉద్యోగుల వైవిధ్యంలో పునర్వ్యవస్థీకరణను 40% సంస్థలు ఆశిస్తున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్ సేవలు, బీమా, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలలోని మూడింట రెండు వంతుల యజమానులు గత సంవత్సరంలో ఏఐ సంబంధిత ఉద్యోగుల నియామకాలను పెంచారు.


నియామకాలు సులువు కాదు

టీమ్‌లీజ్ సంస్థ 3,40,000 మందికి పైగా అసోసియేట్లు, ట్రైనీలను నిర్వహిస్తోంది. వేతనం అంచనాలు, లొకేషన్ ప్రాధాన్యతలు, అవసరమైన నైపుణ్యాల విషయంలో ఉన్న వ్యత్యాసాల కారణంగా.. కంపెనీలు అడుగుతున్న వారిలో కేవలం 30 శాతాన్నే భర్తీ చేయగలుగుతున్నట్లు రమణి చెప్పారు. ఏఐ నైపుణ్యం కలిగిన సైబర్ సెక్యూరిటీ నిపుణులకు గిరాకీ పెరుగుతోందని, అలాంటి ప్రతిభావంతుల కోసం సంస్థలు 30-40% అధిక వేతనాలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# లాభాల్లో ఎల్ఐసీనే కింగ్..

## త్రైమాసిక ఫలితాల్లో సత్తా




**ఢిల్లీ:** ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక మైలురాయిని అందుకుంది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఫైనాన్షియల్ రంగంలో అత్యధిక లాభం నమోదుచేసిన కంపెనీగా అవతరించింది. రూ.23,400 కోట్ల నికర లాభంతో మొదటి స్థానం సొంతం చేసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలతో పోల్చినప్పుడు అత్యధిక లాభం సాధించిన టాప్ కంపెనీగా ఎల్ఐసీ నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికానికి గానూ 23 శాతం వృద్ధితో రూ.23,420 కోట్ల నికర లాభాన్ని ఎల్ఐసీ నమోదు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు ఏడాది రూ.19,013 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ప్రభుత్వరంగానికి చెందిన ఎస్‌బీఐ రూ.19,684 కోట్లు, ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ రూ.19,221 కోట్ల నికర లాభంతో ఎల్ఐసీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అయితే, వార్షిక ప్రాతిపదికన ఈ రెండు సంస్థలూ ఎల్ఐసీని అధిగమించాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎల్ఐసీ రూ.57,419 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగా.. ఎస్‌బీఐ రూ.80,032 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.74,670 కోట్ల లాభంతో తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

**ఎంత ఎదురుచూసినా.. మీక్కావాల్సిన ఫోన్ ధర తగ్గదు!**

ఇక ప్రభుత్వరంగ సంస్థల విషయానికొస్తే.. ఇండియన్ ఆయిల్ కార్పొరేసన్ రూ.11,378 కోట్లు, కోల్ ఇండియా రూ.10,839 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.8,598 కోట్లు, ఎన్టీపీసీ రూ.8,747 కోట్లు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రూ.4,546 కోట్లు, ఆర్ఈసీ లిమిటెడ్ రూ.3,375 కోట్లు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూ.1680 కోట్లు చొప్పున క్యూ4లో లాభాలను నమోదు చేశాయి. మొత్తం కార్పొరేట్ సెక్టార్‌ను పరిగణనలోకి తీసుకున్నప్పుడు టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా అత్యధిక లాభం నమోదు చేసింది. క్యూ4లో రూ.51,970 కోట్ల నికర లాభాన్ని ఈ కంపెనీ ప్రకటించింది.

## రెయిన్‌బో చిల్డ్రన్స్ కేర్ లాభంలో 38% వృద్ధి

హైదరాబాద్: పిల్లలు-మహిళల వైద్యం, సంతాన సాఫల్య సేవలను అందించే రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికానికి రూ.459.90 కోట్ల ఆదాయంపై, రూ.78.22 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.370.11 కోట్లు, నికర లాభం రూ.56.55 కోట్లతో పోలిస్తే, ఆదాయం 24.2%, నికర లాభం 38.3% మేర పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం రూ.1,703.08 కోట్లకు చేరుకోగా, నికర లాభం రూ.281.54 కోట్లుగా ఉంది. రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.3.50 తుది డివిడెండును బోర్డు ప్రతిపాదించింది. డాక్టర్ రమేష్ కంచర్లను కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా మరో అయిదేళ్లపాటు బోర్డు పునర్నియమించింది.'ప్రస్తుత సామర్థ్య విస్తరణ దాదాపు పూర్తయింది. ఇక మా దృష్టంతా గ్రూప్ ఆసుపత్రుల్లో ఆక్యుపెన్సీ పెంపు, సేవల బలోపేతం, క్లినికల్ ఎక్సెలెన్స్, దీర్ఘకాలం పాటు వృద్ధిని కొనసాగించడంపై ఉంటుంద'ని ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు.

Rainbow® Children's Hospital
It takes a lot to treat the little.

## మార్కెట్ విలువకు చమురు సెగ

- రూ.1.70 లక్షల కోట్లు కోల్పోయిన ఇంధన విక్రయ సంస్థలు
- షేర్లు భారీగా పతనం కావడం వల్లే
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యం



అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి (ఫిబ్రవరి 27) నుంచి ఇప్పటివరకు భారత రిఫైనరీలు, చమురు మార్కెటింగ్ కంపెనీలు మొత్తంగా రూ.1.70 లక్షల కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. ఇదే సమయంలో కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ గణనీయంగా క్షీణించడం ఇందుకు కారణమైంది. ఫిబ్రవరి 27న బ్యారెల్ బ్రెంట్ చమురు 72.48 డాలర్ల వద్ద ఉండగా..ప్రస్తుతం 103 డాలర్ల వద్ద ఉంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఫిబ్రవరి 27న 91.07గా ఉండగా.. ప్రస్తుతం 95.60కు పెరిగింది. ముడి చమురు దిగుమతులపై భారత రిఫైనరీలు అధికంగా ఆధారపడటం వల్ల పెరిగిన ముడి చమురు ధరలతో ఈ సంస్థలకు వ్యయాల భారం అధికం కానుండటం షేర్లపై ఒత్తిడిని పెంచుతోంది. ఐఓసీకే అత్యధిక నష్టం..: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ గణాంకాల ప్రకారం.. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అత్యధికంగా రూ.67,740 కోట్ల మార్కెట్ విలువను నష్టపోయింది. భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రూ.38,983 కోట్లు, హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) రూ.10,437 కోట్లు, రిలయన్స్ రూ.53,230 కోట్లు చొప్పున మార్కెట్ విలువను కోల్పోయాయి.ఇదే సమయంలో ఐఓసీ షేరు 26%, బీపీసీఎల్ 23%, హెచ్‌పీసీఎల్ 11%, రిలయన్స్ 3% మేర నష్టపోయాయి.

## సాయి పేరెంటరల్స్ ఆదాయం రూ.198 కోట్లు

**హైదరాబాద్:** జనరిక్ ఫార్ములేషన్లు, సీడీఎంఓ సేవలు అందించే సాయి పేరెంటరల్స్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.197.93 కోట్ల ఆదాయం, రూ.13.25 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.74.23 కోట్లు, నికర లాభం రూ.1.59 కోట్లుగా ఉన్నాయి. పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.380.99 కోట్లు, నికర లాభం రూ.14.37 కోట్లుగా ఉన్నాయి. మార్చి 2026లో ఐపీఓ ద్వారా రూ.285 కోట్లను ఈ కంపెనీ సేకరించింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కొత్తగా 88 ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. మరో 67 ఔషధ ఉత్పత్తులను ఈ ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యపరంగా మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. కొత్త దీర్ఘకాలిక ఒప్పందాలు, వ్యాపార విస్తరణల ద్వారా స్థిరమైన వృద్ధి సాధిస్తామని సాయి పేరెంటరల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.అనిల్ కుమార్ తెలిపారు. గత త్రైమాసికంలో అన్ని అనుబంధ సంస్థలూ మంచి పనితీరును కనబరిచాయని వెల్లడించారు. రాబోయే సంవత్సరాల్లోనూ లాభాల మార్జిన్లను మెరుగుపరుస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 2,95,000

# ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ మస్క్

**ఈ భూమి మీద అందరి కంటే ధనవంతుడెవరంటే ఎలాన్ మస్క్ పేరు చెప్పాల్సిందే. ఇప్పుడు ఆయన కంపెనీ స్పేస్ఎక్స్ పబ్లిక్ ఇష్యూకు వెళుతోంది. ఇప్పటివరకు వాల్‌స్ట్రీట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ ఇదేనని అంచనా. ఈ ఐపీఓతో మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ అంటే లక్ష కోట్ల డాలర్ల (దాదాపు రూ.96 లక్షల కోట్లు) అధిపతిగా మారనున్నారని అంచనా.**



**వాషింగ్టన్:** ఇంతకీ అది ఎలాగంటే.. స్పేస్ఎక్స్ ఐపీఓ ముసాయిదా ప్రకారం ఎలాన్ మస్క్‌కు ఆ సంస్థలో 510 కోట్ల షేర్లున్నాయి. వీటికి తోడు ఒక్కోటీ 8.39 డాలర్ల విలువ చేసే 35 కోట్ల స్టాక్ ఆప్షన్స్ కూడా ఆయన చేతిలో ఉన్నాయి. ఒక వేళ స్పేస్ఎక్స్ తన ఐపీఓ సందర్భంగా 2 లక్షల కోట్ల(2 ట్రిలియన్) డాలర్ల మార్కెట్ విలువను పొందితే కనుక, మస్క్ నికర సంపద 1.1 లక్షల కోట్లకు చేరుతుంది. ఒక వేళ కంపెనీ 1.75 లక్షల కోట్ల డాలర్ల వద్ద నమోదైనా కూడా మస్క్‌కు టెస్లా, ఇతర కంపెనీల్లో ఉన్న వాటాలతో కలిపితే మొత్తం సంపద సులభంగా లక్ష కోట్ల డాలర్లను అధిగమిస్తుంది. ఐపీఓతో కంపెనీలోనే కొత్త బిలియనీర్లు గతేడాదే 500 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.48 లక్షల కోట్లు) సంపద ఉన్న తొలి వ్యక్తిగా మస్క్ రికార్డులకెక్కారు. ఇంకో వైపు స్పేస్ఎక్స్ కనుక 7.5 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువను చేరితే మస్క్‌కు పనితీరు ఆధారిత 100 కోట్ల రిస్ట్రిక్టెడ్ షేర్లు లభిస్తాయి. అయితే అంతకు ముందు అంగారక గ్రహంలో కనీసం 10 లక్షల మంది ప్రజలతో ఒక శాశ్వత మానవ కాలనీని కంపెనీ ఏర్పాటు చేయాలన్న షరతూ ఉంది. ఇంకో ప్యాకేజీ ఏమిటంటే, ఒక వేళ స్పేస్ ఎక్స్ 6.6 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువను సాధించి, భూమియేతర గ్రహాల్లో 100 టెరావాట్ వార్షిక సామర్థ్యంతో డేటా సెంటర్లను ఏర్పాటు చేసినా 30 కోట్ల రిస్ట్రిక్టెడ్ షేర్లను మస్క్ పొందుతారు. ఇవన్నీ కాకపోయినా.. కేవలం స్పేస్ఎక్స్ ఐపీఓతోనే మస్క్ చేరే 1.1 లక్షల కోట్ల డాలర్ల విలువ ఒక రికార్డే. ఎందుకంటే మస్క్ తర్వాత ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడి దగ్గర ఉన్న సంపదతో పోలిస్తే ఆయన సంపద మూడు రెట్లకు పైగా ఎక్కువగా ఉంటుంది. స్పేస్ఎక్స్ ఐపీఓతో కంపెనీలోనే కొత్త బిలియనీర్లు (100 కోట్ల డాలర్లకు పైగా సంపద ఉన్నవారు) పుట్టుకురానున్నారు. సంస్థ ప్రెసిడెంట్ గ్విన్ షాట్‌వెల్, సీఎఫ్ఓ బ్రెట్ జాన్సన్, బోర్డు డైరెక్టర్ ల్యూక్ నాసెక్.. వీరంతా కంపెనీ లక్షిత మార్కెట్ విలువను చేరితే బిలియనీర్లు కానున్నారు.

## ఆర్‌బీఐ డివిడెండ్‌లో రాష్ట్రాలకూ వాటా పంచండి!

**పంజాబ్ ఆర్థిక మంత్రి హర్‌పాల్ సింగ్ చీమా డిమాండ్**

చండీగడ్: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఇండియా ప్రకటించిన డివిడెండ్‌లో రాష్ట్రాలకు కూడా వాటా ఇవ్వాలని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్‌పాల్ సింగ్ చీమా డిమాండ్ చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2.87 లక్షల కోట్లను డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చీమా స్పందించారు.అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్థిక ఒత్తిళ్లను కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఎదుర్కొంటున్నాయని చీమా పేర్కొన్నారు. అందువల్ల ఈ అదనపు లాభాలను కేవలం కేంద్రమే తన దగ్గర పెట్టుకోకుండా.. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలకు కూడా పంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం తన ఆర్థిక లోటును తగ్గించుకోవడానికి ఆర్‌బీఐ నిల్వలను విపరీతంగా వాడటం వల్ల, భవిష్యత్తులో దేశ ఆర్థిక స్థిరత్వానికి రక్షణగా నిలిచే ఆర్‌బీఐ ఆర్థిక బలం, స్వయంప్రతిపత్తి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆర్‌బీఐ వద్ద తగినన్ని నిల్వలు ఉండటం దేశ ఆర్థిక భద్రతకు ఎంతో అవసరమన్నారు.

## శక్తిమంతమైన క్షిపణితో కీవ్ రష్యా దాడి

**బిలా సెర్క్వా నగరంపై బాంబుల వర్షం**

**సాధారణ పౌరులే లక్ష్యంగా పుతిన్ సేనలు భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడుతున్నాయి .. మండిపడ్డ జెలెన్‌స్కీ**

కీవ్(జనంసాక్షి): ఉక్రెయిన్ రాజధాని కీవ్ రీజియన్‌పై డ్రోన్లు, క్షిపణితో రష్యా మరోసారి విరుచుకుపడింది. బిలా సెర్క్వా నగరంపై ఆదివారం ఉదయం జరిపిన దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడోసారి మాత్రమే కావడం గమనార్హం.దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా మండిపడ్డారు. సాధారణ పౌరులే లక్ష్యంగా రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడిందని.. అందులో శక్తిమంతమైన హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణులను ప్రయోగిస్తోందని ఆరోపించారు. అయితే, దీనిపై ఇప్పటి వరకు రష్యా స్పందించలేదు. ఒరెష్నిక్ అనేది హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి. రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒకటైన ఈ మిస్సైల్.. గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్తుంది. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.యూరప్‌లోని అన్ని దేశాలు ఈ క్షిపణి పరిధిలోకి వస్తాయని , దీన్ని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని రష్యా గతంలో ప్రకటించింది. తొలిసారిగా దీనిని 2024 నవంబరులో ఉక్రెయిన్ నగరమైన డినిప్రోలోని ఓ ఫ్యాక్టరీ మీద రష్యా ప్రయోగించింది. అప్పట్లో అది అభివృద్ధి దశలోనే ఉంది. ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు సమాచారం. ఉక్రెయిన్‌లోని పశ్చిమ లీవ్ ప్రాంతంలో రష్యా రెండోసారి ఈ క్షిపణి ఉపయోగించగా.. తాజాగా కీవ్ రీజియన్‌పై మూడోసారి ప్రయోగించింది.

## శుద్ధి చేసిన యురేనియం నిల్వలు వదులుకోవడానికి ఇరాన్ ఒప్పకుంది

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన**


వాషింగ్టన్(జనంసాక్షి): త్వరలో ఇరాన్‌తో ఒప్పందం కుదిరేందుకు అవకాశముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ క్రమంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తన వద్ద ఉన్న అత్యంత శుద్ధి చేసిన యురేనియం నిల్వలను వదులుకోవడానికి అంగీకరించింది. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన అధికారులు వెల్లడించారు. దీంతో వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య త్వరలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్నారు. యుద్ధాన్ని ముగించి.. హర్మూజ్‌ను తిరిగి తెరవడమే లక్ష్యంగా ఇరు దేశాలు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారికంగా ఒప్పందం కుదిరిన తర్వాత యురేనియం నిల్వలను నిర్వీర్యం చేసే విధానాలపై చర్చలు జరపనున్నట్లు తెలిపారు.అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ప్రకారం.. ఇరాన్ వద్ద 60శాతం శుద్ధి చేసిన 440 కిలోల యురేనియం ఉన్నట్లు అంచనా. కావాలనుకుంటే దీన్ని కొద్ది వారాల్లోనే అణ్వస్త్ర తయారీకి అవసరమైన 90 శాతం స్థాయికి ఆ దేశం శుద్ధి చేసుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఆ యురేనియంతో 10కిపైగా అణు వార్‌హెడ్లను తయారు చేయవచ్చు. 60 శాతం శుద్ధి చేసిన యురేనియంను బాంబు తయారీకి వాడొచ్చు. అయితే అది తక్కువ శక్తితో విస్ఫోటం చెందుతుంది. అలాంటి పరిస్థితుల్లో ఎక్కువ పదార్థాన్ని వాడి అణ్వస్త్రాన్ని తయారు చేయాల్సి ఉంటుంది. ఈ నిల్వల్లో అధిక భాగం ఇస్ఫహాన్ అణు కేంద్రంలో భూగర్భంలో ఉంచినట్లు భావిస్తున్నారు.

**శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం**

అమెరికా-ఇరాన్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఇరాన్‌లో పర్యటిస్తున్న తమ ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్ పర్యటన ఫలప్రదంగా ముగిసిందని పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. ఇరువర్గాల మధ్య తుది ఒప్పందానికి దాదాపుగా రంగం సిద్ధమైందని పేర్కొంది. మరోవైపు ఇరాన్ ఒప్పందానికి అంగీకరించకపోతే మళ్లీ దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు.

# గ్రీన్ కార్డు నిబంధనలపై వెల్లువెత్తుతున్న నిరసనలు

## 12 లక్షల భారతీయ కుటుంబాలపై ప్రభావం!




వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న తాత్కాలిక వలసదారులు స్వదేశాలకు వెళ్లి గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై ఆందోళనతో పాటు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. చట్ట నిబంధనలను పాటిస్తూ చేసుకున్న దరఖాస్తులపై నిర్ణయాన్ని పూర్తిగా అధికారుల విచక్షణకు వదిలేయడమేంటని చట్టసభ సభ్యులతోపాటు న్యాయ నిపుణులు మండిపడుతున్నారు. ఇది నిర్లక్ష్యపూరిత, తప్పుడు నిర్ణయమని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఇది చట్టపరంగా చెల్లుబాటు అవుతుందా అనే ప్రశ్నతో పాటు... భారత్‌తో వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో దౌత్యపరమైన ఒత్తిడి పెంచటంలో భాగంగా ట్రంప్ సర్కారు తీసుకున్న ఎత్తుగడా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. తాజా నిబంధన.. అమెరికాలోని 12 లక్షల భారతీయ కుటుంబాలపై ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంపై జారీ చేసిన మెమోను వెనక్కి తీసుకునే వరకూ ప్రతి వేదిక మీదా పోరాడతామని డెమోక్రటిక్ పార్టీ చట్టసభ సభ్యులు తేల్చి చెప్పారు. ఈ చర్య ఎంతో కాలంగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ గ్రీన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారికి ఆశనిపాతమని బైడెన్ హయాంలో శ్వేత సౌధం సలహాదారుగా పని చేసిన అజయ్ భుటోరియా పేర్కొన్నారు. అమెరికాలోని ప్రతి చట్టాన్నీ గౌరవిస్తూ చట్టబద్ధ నివాసం కోసం ఎదురు చూస్తున్న వారిని ఇబ్బందుల్లోకి నెట్టడమేనని అభిప్రాయపడ్డారు. ఐ-485కు దరఖాస్తు చేసుకున్నవారు అన్ని నిబంధనలను పాటించినా వాటిని పరిశీలించకుండానే తిరస్కరించే విచక్షణాధికారం అమెరికా అధికారులకు లభిస్తుందని, ఇక నుంచీ చట్టబద్ధ అర్హతలు ఎంత మాత్రం సరిపోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదో లాజిక్ లేని నిర్ణయమని, దీనివల్ల నిపుణులు ఇతర దేశాలకు వలస వెళ్తారని క్యాటో ఇన్‌స్టిట్యూట్ వలస విభాగం డైరెక్టర్ డేవిడ్ జె.బైర్ స్పష్టం చేశారు.అమెరికాలో వేల మంది గ్రీన్ కార్డు దరఖాస్తుదారులు ఉన్నారని, వారిలో నర్సులు, టీచర్లు, ఇంజినీర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వారందరినీ దేశం నుంచి పంపించేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోందని టెక్సాస్ కాంగ్రెస్‌మన్ జోక్విన్ క్యాస్ట్రో అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం భార్యాభర్తలను, తల్లిదండ్రులను, పిల్లలను విడదీస్తుందని తెలిపారు.

కోర్టులో సవాలు చేయవచ్చు..: ప్రభుత్వం జారీ చేసిన మెమోను కోర్టులో సవాలు చేయడానికి అవకాశముంది. దీని అమలుపై ఎటువంటి మార్గదర్శకాలు లేవు.

ఎవరికెలా?: అమెరికా ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మెమో ద్వారా గ్రీన్ కార్డుల విషయంలో ఏ వీసాదారులపై ఎలాంటి ప్రభావం పడుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. కొన్ని సడలింపులు ఉన్నాయని ప్రభుత్వం చెప్పినా అది ఎవరెవరికి అనేది స్పష్టత లేదు.

హెచ్1బీ, ఎల్1 వీసాదారులకు.. : వలసేతర కేటగిరీలో ద్వంద్వ ఉద్దేశంతో చట్టబద్ధ స్టేటస్‌ను కొనసాగించినప్పటికీ అదొక్కటే గ్రీన్ కార్డు దరఖాస్తుకు సరిపోదు. ఈ ఒక్క కారణంతో విచక్షణను ఉపయోగించి అనుకూల నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదు. అంటే సుదీర్ఘకాలంగా అమెరికాలో ఉంటున్నామన్న కారణంతో 'అడ్జస్ట్‌మెంట్ ఆఫ్ స్టేటస్'కు దరఖాస్తు చేసుకోలేరు. అది ఆటోమేటిక్‌గా, పరిపాలనాపరమైన సాధారణ ప్రక్రియ ఇక ఎంత మాత్రం కాదు.

ఇక నుంచీ అడ్జస్ట్ స్టేటస్ దరఖాస్తుకు ఉన్న అర్హతలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. పన్నుల చరిత్ర, కుటుంబ పరిస్థితులు, కెరీర్ పురోగతి, ఇతర సాక్ష్యాలను వారు చూడాలి.

ఎఫ్1: ఎఫ్1 అనేది ద్వంద్వ ఉద్దేశ వీసా కాదు. ఒకవేళ విద్యార్థి అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేసి స్టెమ్ ఓపీటీలో ఉండి 'స్టేటస్'కు దరఖాస్తు చేసుకుని, అది జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉందని నిరూపించుకుంటే ఆ విద్యార్థి గ్రీన్ కార్డుకు గట్టి దరఖాస్తుదారు అవుతారు. ఈబీ2, ఈబీ3: ఈబీ2, ఈబీ3 బ్యాక్‌లాగ్‌లో ఉన్న ఉద్యోగులు.. దశాబ్దకాలంగా వెయిటింగ్‌లో ఉండి ఉంటే.. ఆ ఉద్యోగి అమెరికాలో ఉండి దరఖాస్తు చేసుకుంటే బలమైన ఆధారాలను చూపాల్సి ఉంటుంది. అమెరికాతో సానుకూల సంబంధాలున్నాయని, సుదీర్ఘ ఉద్యోగ అనుభవముందని, పిల్లలు అక్కడే పెరిగారని నిరూపించాల్సి ఉంటుంది.

# పిడుగులు పడుతున్నయ్.. జాగ్రత్త!





## అవగాహన లోపంతోనే పిడుగుపాటుకు గురవుతున్న ప్రజలు

- బాధితుల్లో ప్రధానంగా రైతులు, పశువులు
- పిడుగులపై దామిని యాప్ ముందస్తు హెచ్చరికలు

**రాజోలి, మే 24 (జనంసాక్షి) :** వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఉరుములు, మెరుపులతో పిడుగుపాటుకు గురై ప్రతి ఏటా జోగులాంబ గద్వాల జిల్లాలో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెల కాపరులు, పశువులు ఎక్కువగా ప్రమాదానికి గురవుతున్నారు. అవగాహన లేకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పిడుగుపాటుకు గురై గతేడాదిలో రైతులు, పశువులు మృతి చెందాయి. ఈ నెల 16తేదీన అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో పిడుగుపడి నాగేష్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గత ఏడాదిలో భూంపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ, సర్వేశ్, సౌభాగ్యమ్మ అనే రైతులు పత్తి చేనులో పని నిమిత్తం పొలానికి వెళ్లారు. అయితే సాయంత్రం కాగానే ఒక్కసారిగా పొలంలో పనిచేస్తున్న కూలీలపై పిగుడు పడింది. ఈ ప్రమాదంలో పార్వతమ్మ, సౌభాగ్యమ్మతో పాటు సర్వేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

**అప్రమత్తతతోనే రక్ష..**

ఆకాశంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడిన సందర్భాల్లో ఏదో ఒకచోట పిడుగు కాటుకు గురై మృత్యువాత పడుతున్నారు. మూగ జీవాలు సైతం పిడుగుకు బలైపోతున్నాయి. అధిక శాతం మంది పశువుల కాపర్లు, వ్యవసాయ భూముల్లో పనిచేసుకునే రైతులు, కూలీలు ఎక్కువగా ఉంటున్నారు. పిడుగు శబ్ధానికి కొందరు ప్రాణాలు వదులుతుండగా, ఇంకొందరు దాని తీవ్రతకు బలవుతున్నారు. పిడుగులు పడే సమాచారాన్ని విపత్తుల నివారణ శాఖ ముందుగానే పలు సందార్భాల్లో ప్రకటిస్తున్నప్పటికీ ప్రమాదాలు తప్పడం లేదు. గాలులు వీస్తున్నా, ఉరుములు ఉరిమినా పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో సమీపంలో గల పెద్ద భవనాల్లోకి వెళ్లడం మంచిది. ఉరుములు, మెరుపులు, గాలి వాన సమయం లో ద్విచక్రవాహనాలు నడపడం మానుకోవాలి. లోహపు వస్తువులను తాకకుండా ఉండాలి. బహిరంగ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ వినియోగించవద్దు. ఉరుములు, మెరుపుల సమయంలో ఇళ్లలో తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఇంట్లో విద్యుత్‌తో నడిచే అన్ని వస్తువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.

**ఎర్తింగ్ తప్పకుండా ఏర్పాటు చేయాలి..**

అధిక ఓల్టేజీ వచ్చి ఇళ్లలోని విద్యుత్తు గృహోపకరణాలు దగ్ధం అవుతుంటాయి. పిడుగులు పడే సమయంలో ఓల్టేజీ కొన్ని వందల రెట్లు పెరిగే అవకాశం ఉంది. దీన్ని నివారించేందుకు ఇంటికి తప్పని సరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. తీగలు, ఫ్యూజులు సైతం ఐఎస్ఐ మార్కు కలిగిన నాణ్యమైన ఉత్పత్తులనే వాడాలి. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో అన్ని విద్యుత్తు గృహపకరణాలను బంద్ చేసి ఉంచడం, ప్లగ్ తీగలను తీసి ఉంచడం మంచిది. భవనాలు, ఇళ్లపై సైతం పంచ లోహాలతో తయారు చేసిన పరికరాన్ని బిగించుకోవడం వల్ల కొంతమేర పిడుగు బారినుంచి తప్పించుకోవచ్చు. పెద్ద పెద్ద భవనాలు, చర్చిలు, దేవాలయాలు, మజీదులపై ఇలాంటి పరికరాన్ని బిగించడం సాధారణంగా జరుగుతుంటుంది.

**దామిని యాప్‌తో ముందస్తు సమాచారం**

వర్షాలు పడుతున్న సమయంలో పిడుగులు పడడం సహజం. అయితే ఇవి ఎక్కడ, ఎప్పుడు పడతాయో చెప్పడం అసాధ్యం. దీంతో చాలా మంది వీటి బారిన పడి ప్రాణాలు కోల్పోతుంటారు. అయితే, చాలా మందికి తెలియని విషయమేమిటంటే..పిడుగు వంటి విపత్కర పరిస్థితుల గురించి ముందుగానే సమాచారం తెలుసుకొని ప్రాణాలు కాపాడుకోవచ్చు. పిడుగులను ముందుగానే గుర్తించి హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. 'దామిని లైటింగ్ అలర్ట్' అనే పేరుతో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అరగంట ముందుగానే మీ ప్రాంతంలో పిడుగు పడుతుందా ? లేదా ? అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఇది ఉపయోగించాలంటే ముందుగా మీ స్మార్ట్ ఫోన్లోని ప్లే స్టోర్‌లో దామిని యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో తెలుగుతో భాషతో పాటు పలు భాషలు సైతం అందుబాటులో ఉన్నాయి.

# దామస్తపూర్‌లో దాహార్తి..

### తాగునీటి కోసం బిందెలతో ఎదురుచూపులు

- వారం రోజులుగా నీళ్లు లేక ప్రజల అవస్థలు
- మిషన్ భగీరథ సరఫరా నిలిచిపోయింది
- విద్యుత్ అంతరాయం వల్ల గ్రామస్తుల ఆందోళన



**మర్పల్లి, మే 24 (జనంసాక్షి):** మర్పల్లి మండలంలోని దామస్తపూర్ గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత వారం రోజులుగా త్రీఫేస్ విద్యుత్ అంతరాయం కారణంగా గ్రామా నికి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర దాహార్తి అనుభవిస్తున్నారు. మహిళలు బిందెలతో నీటి కోసం ఎదురుచూస్తుండగా, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. రోజువారీ అవసరాలకు కూడా నీరు అందక గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, అది గ్రామ అవసరాలకు సరిపోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించి, గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా కల్పించా లని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో తమ ఆందోళనలు మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

# రాయపోల్‌లో ఘనంగా తైక్వాండో కలర్ బెల్ట్ ప్రధానోత్సవం

### విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మస్థైర్యానికి ప్రతీక

ఇబ్రహీంపట్నం, మే 24(జనం సాక్షి) : విద్యార్థులలో క్రమశిక్షణతో పాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంలో తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తైక్వాండో మాస్టర్ చేకూరి లింగం అన్నారు. మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో 'లెర్న్ అండ్ గ్రో తైక్వాండో అకాడమీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రేడింగ్ కలర్ బెల్ట్ ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.మాస్టర్స్ చేకూరి లింగం, బాలు నాయక్ సంయుక్త నేతృత్వంలో జరిగిన ఈ క్రీడా వేడుకలో మొత్తం 40 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు గ్రేడింగ్ బెల్టులు, అధికారిక సర్టిఫికెట్లు, మరియు మెడల్స్‌ను ఘనంగా బహూకరించారు.ఈ సందర్భంగా మాస్టర్ చేకూరి లింగం మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో పిల్లలకు శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడలు కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, అవి విద్యార్థులను మానసికంగా దృఢంగా మారుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో రంగంలో రాణిస్తున్న బ్లాక్ బెల్టర్స్ అచ్చున సురేష్, మొగ్రి శివ, బండ శివ, కానాపురం వినయ్, కానాపురం శివ, అచ్చున రామ్ చరణ్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# ఉద్యోగుల ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డుల కోసం ఎందుకంత హడావిడి?

- టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రఘునందన్ రెడ్డి
- గత అనుభవాలు గుర్తు చేస్తూ తీవ్ర ఆందోళన
- స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా ప్రీమియం వసూలు
- ప్రభుత్వ వైఖరిపై ఉద్యోగ సంఘాలు ప్రశ్నల వర్షం



**శంకర్‌పల్లి, మే 24 (జనంసాక్షి):** గతంలో ముందస్తు అధ్యయనం, పరిణా మాలపై అంచనా లేకుండా, కేవలం రాజకీయ, అధికార యంత్రాంగాల హడావిడి నిర్ణయం వల్ల వచ్చిన జీవో 317 కొన్ని వేలమంది ఉపాధ్యా యులను సొంత జిల్లాలకు దూరం చేసి, పరాయి జిల్లాల్లో నానా అవస్థలు పడేలా చేసింది. ఆ వికృత క్రీడ సృష్టించిన గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఇప్పుడు అదే తరహాలో, ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా ప్రవేశపెడుతున్న క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల స్కీమ్ మరోసారి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

ఒక్క కాగితంతో వేల మంది తలరాతలను మార్చేసినట్లే, కేవలం అతి తక్కువ వివరాలతో కూడిన ఒక చిన్న కాగితం ఆధారంగా ఇంత పెద్ద హెల్త్ స్కీమ్‌ను ఎలా నడపబోతున్నారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. విధానపరమైన లోపాలు, గత అనుభవాలతో ఈ కొత్త హెల్త్ కార్డుల ప్రక్రియను గమనిస్తే ప్రభుత్వ వైఖరిలో, ఉద్యోగ సంఘాల ప్రవర్తనలో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ, అధ్యయనం ఎప్పుడు జరిగింది, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉచిత ఆరోగ్య కార్డు పైన అసలు ఎప్పుడు, ఏ కమిటీతో అధ్యయనం చేయించారు? దీని విధివిధానాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగం ఎవరు? నిర్వహణ అధికారి ఎవరు? ఏ క్యాడర్ స్థాయి అధికారి ఈ యంత్రాంగాన్ని పర్యవేక్షిస్తారు? అని ప్రశ్నించారు.

ప్రధాన సందేహం: ఉద్యోగి తన సొంత డబ్బును ప్రీమియంగా చెల్లిస్తున్నప్పుడు, గతంలో ఉచితంగా ఇచ్చిన సౌలభ్యాల కంటే 100 రెట్లు అత్యున్నత మైన స్కీమ్‌గా దీనిని రూపొందించారా? కార్పొరేట్ స్థాయి నిశ్చింత ఉందా? బేసిక్ వేతనంలో ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీల ఉద్యోగుల లాగా నిశ్చింతగా హాస్పిటల్‌లో అడ్మిట్ అవ్వవచ్చా? లేక ఉచిత ఆరోగ్యశ్రీ పేషెంట్ల వలెనే క్యూ లైన్లలో నిలబడి అవమానాలు పడాలా? అని ప్రశ్నించారు.

గతంలో ఈహెచ్‌ఎస్ కార్డులు పనిచేయకపోయినా కనీసం రీయింబర్స్‌మెంట్ ద్వారా ఖర్చు చేసిన డబ్బులు వెనక్కి వచ్చే మార్గం ఉండేది. కానీ కొత్త విధానంలో ఎలాంటి గైడ్‌లైన్స్ లేకపోతే అటు రీయింబర్స్‌మెంట్ ఉండదు, ఇటు క్యాష్‌లెస్ వైద్యమూ దక్కదని హెచ్చరించారు. దీనివల్ల ఉద్యోగులకు జరిగే మరొక్క పెద్ద నష్టం ఏంటంటే.. ప్రతి నెలా తమ కష్టార్జితం నుండి కట్ అయ్యే 1.5 శాతం మూలవేతనం కూడా బూడిదలో పోసిన పన్నీరై ప్రభుత్వ ఖజానా పాలు కాక తప్పదన్నారు. ఏ క్లారిటీ ఇవ్వకుండా ప్రభుత్వము, యూనియన్లు ఈ కార్యక్రమాన్ని ఇంత హడావిడిగా ఎందుకు రుద్దాలని చూస్తున్నాయో ప్రతి ఒక్క ఉద్యోగి, ఉపాధ్యాయుడూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని రఘునందన్ రెడ్డి స్పష్టం చేశారు. కార్డుల కోసం ఎగబడే ముందు.. హక్కుల కోసం, స్పష్టత కోసం ప్రశ్నించడం అత్యంతావశ్యకమని పిలుపునిచ్చారు.


# లేగదూడను చంపిన చిరుత

- భయప్రాంతులకు గురవుతున్న కొండాపూర్ రైతులు
- వెంటనే చర్యలుతీసుకోవాలంటూ.. గ్రామస్తుల ఆందోళన



**మహమ్మదాబాద్/గండీడ్, మే 24జనంసాక్షి:** మండలంలోని కొండాపూర్ గ్రామంలో చిరుతపులి సంచారం మరోసారి వెలుగులోకి రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి గ్రామానికి చెందిన రైతు బోరు మైభయ్యా పొలంలో ఉన్న లేగదూడపై చిరుత దాడి చేసి చంపిన ఘటన కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం..రైతు మైభయ్యా సాయంత్రం వరకు పొలం వద్ద ఉండి ఇంటికి వెళ్లాడు.అనంతరం రాత్రి తిరిగి పొలం వద్దకు వెళ్లి చూడగా లేగదూడ మృతిచెందిన స్థితిలో కనిపించింది.వెంటనే స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిశీలించి చిరుత దాడి వల్లే లేగదూడ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో... కొండాపూర్ గ్రామ పరిసరాల్లో భయ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా అటవీప్రాంతాలకు సమీపంలో వ్యవసాయం చేస్తున్న రైతులు,పశువుల కాపరులు రాత్రి వేళల్లో బయటకు రావడానికి భయపడుతున్నారు.గతంలో కూడా ఇదే ప్రాంతంలో మేకలపై చిరుతదాడులు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ.50,వేల విలువచేసే లేగదూడను కోల్పోయిన రైతు మైభయ్యా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.అలాగే గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను వెంటనే బంధించి దట్టమైన అడవిలో విడిచిపెట్టాలని రైతులు,గ్రామస్తులు డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,రాత్రి వేళల్లో పశువులను బయట విడిచిపెట్టవద్దని సూచించారు. చిరుత సంచారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

# అక్రమ మొరం రవాణా టిప్పర్ పట్టివేత



**బోయినపల్లి, మే 24 (జనం సాక్షి) :** బోయినపల్లి మండలం లోని వెంకట్రావుపల్లి స్టేజ్ వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు బోయిన్‌పల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో వెంకట్రావుపల్లి స్టేజ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా టి ఎస్ 30 టి 4878 నంబర్ గల టిప్పర్ ఎలాంటి అనుమతులు లేకుండా మొరం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడింది. వెంటనే టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ బొజ్జ అఖిల్‌ను అదుపులోకి తీసుకునీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.





# రైతులను నిలువునా దోచుకుంటున్న దళారులు, మిల్లర్లు

### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతుల కన్నీళ్లు

- తాలు, తరుగు, బి-గ్రేడ్ పేరిట భారీ దోపిడీ
- కాంగ్రెస్ సర్కార్ రైతు వ్యతిరేక వైఖరి ఖండన
- ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనాలి

వనపర్తి రూరల్ మే 24 (జనంసాక్షి) ప్రభుత్వ నిర్లక్ష్యం, చిత్తశుద్ధి లేమి వల్లే రాష్ట్రంలో రైతులు తీవ్రమైన అగచాట్లు, హరిగోస పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై నిప్పులు చెరిగారు. నెలల తరబడి రైతులు ఐకేపీ కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులు అష్టకష్టాలు పడి పండించిన వరి, మొక్కజొన్న ధాన్యం అకాల వర్షాలకు నీటిపాలు అవుతుంటే, రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూ లైన్లలో వేచి చూసిన పరిస్థితిని గుర్తు చేశారు. "5 లక్షల 42 వేల హెక్టార్లలో ధాన్యం పండిస్తే, అందుకు సరిపోయే ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కోటి నలభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం, 45 లక్షల మొక్కజొన్న మార్కెట్‌కు వస్తుందని తెలిసి కూడా రైతులను గాలికి వదిలేసిన చరిత్ర రేవంత్ రెడ్డిది" అని దుయ్యబట్టారు. సీఎం మొత్తం ధాన్యం కొనుగోలు చేశామని బాధ్యతారహితంగా ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

గత కేసీఆర్ హయాంలో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రతి గింజా కొనుగోలు చేశామని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొని రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. కానీ నేడు రైతులు పంటలు పండించి అమ్ముకోలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు కాంట్రాక్టులు ఇవ్వడం వల్లే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని ఆరోపించారు. లారీలు, ట్రక్కులు లేని వారికి కూడా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు ఇచ్చారని, టెండర్లలో భారీ లోపాలు జరిగాయని విమర్శించారు. పక్షపాత ధోరణితో కేసులు ఉన్న మిల్లర్లకు, మంత్రి, ఎమ్మెల్యేల అనుచరులకే ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు కట్టబెట్టారు. ఒక మిల్లర్ ఏకంగా మంత్రి కుమారునికి రేంజ్ రోవర్ కారు బహుమతిగా ఇచ్చారంటే ఇక్కడ ఏ స్థాయిలో దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. దీనిపై సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అర్హత లేని ఏజెన్సీలపై, పక్షపాత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల దగ్గర తరుగు, తాళ్ల పేరుతో దోపిడీ చేస్తే ఊరుకునేది లేదని, ముమ్మాటికీ ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలపై కేసులు పెట్టడం ప్రభుత్వానికి చేతనవుతుంది కానీ, శాంతిభద్రతలను కాపాడలేకపోతోందని దుయ్యబట్టారు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేళ్లు కావస్తు న్నా, నేటికీ హంతకులను పట్టుకోకపోవడం ప్రభుత్వ చేతగాని తనానికి, ముఖ్యమంత్రి వైఫల్యానికి నిదర్శనమన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రశ్నించే గొంతుకలను ఆపలేరని, వెంటనే హంతకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పత్రికా సమావేశం అనంతరం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వనపర్తి మార్కెట్ యార్డును నేరుగా సందర్శించారు. అక్కడ అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం కుప్పలను పరిశీలించి, తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కన్నీరు పెట్టుకున్న రైతులను ఓదార్చి పరామర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నోటికాడికి వచ్చిన ధాన్యం నీటిపాలైందని, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో తరుగు, తాళ్లు తీసివేయడంపై ముమ్మాటికి ప్రశ్నిస్తామని హెచ్చరించారు. మిల్లర్లతో ప్రైవేటు సంభాషణలు చేయడంలో మంత్రి, ఎమ్మెల్యేల ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మార్కెట్ మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, పలుస రమేష్ గౌడ్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు మాణిక్యం, వనం రాములు, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, సయ్యద్ జెమిల్, బాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



**టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ నియామకం జరిగి నెలలు గడుస్తున్నా, పార్టీ కేడర్‌తో ఆయనకు 'కనెక్ట్' లేదనే విమర్శలు గాంధీభవన్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికార పార్టీలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అంశం హాట్ టాపిక్ గా మారింది. ఆయన రూటే సపరేటు అనే ప్రచారం పార్టీలో జోరుగా సాగుతుంది. 'గాంధీభవన్‌కు కూడా సరిగా రావడం లేదు, జిల్లాల నేతలకు అందుబాటులో ఉండటం లేదు' అంటూ కొందరు సొంత పార్టీ నేతలే గుర్రుగా ఉన్నారనే చర్చ జరుగు తోంది. ఈ పరిస్థితుల్లోనే 'అసలు నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారు?' అనే ప్రశ్న మళ్లీ తెరపైకి వస్తోంది.**

# హాట్ టాపిక్‌గా టీపీసీసీ చీఫ్!?

## గాంధీభవన్‌కు, క్యాడర్‌కు దూరం

- సమన్వయ లోపం.. తెరవెనుక రెడ్డి 'మార్క్'?
- పీసీసీ చీఫ్‌పై పార్టీలోనే అసంతృప్తి సెగలు

**నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి)**

పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత క్షేత్రస్థాయి కేడర్‌ను కలవడం, జిల్లాల పర్యటనలు, గాంధీభవన్‌లో అందుబాటులో ఉండటం ద్వారా పార్టీని నడిపించాల్సి ఉంటుంది. కానీ మహేష్ కుమార్ గౌడ్ 'ఎమ్మెల్సీ హోదాలో కౌన్సిల్‌కే పరిమితమవుతున్నారు, గాంధీభవన్ వైపు కన్నెత్తి చూడటం లేదు' అనే అసంతృప్తి సీనియర్ల నుంచి జూనియర్ల దాకా వ్యక్తమవుతోంది. 'అందరినీ కలుపుకొని పని చేయాలి' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించినా, క్షేత్రస్థాయిలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని పలువురు నేతలు వాపోతున్నారు. అంతేకాకుండా మహేష్ కుమార్ గౌడ్ సొంత జిల్లాలోనే సీనియర్‌లు, ముఖ్య నేతలు మహేష్ కుమార్ గౌడ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జిల్లాలో ఇప్పటికి బలమైన క్యాడర్ ను కూడా పెట్టుకోలేకపోవడం ఆయన పరిపాలన తీరుకు అద్దం పడుతుంది.

**'సమన్వయం' బదులు 'సంప్రదింపులు'**

మంత్రివర్గ విస్తరణ, కార్యవర్గం కూర్పు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి కీలక అంశాల్లో పీసీసీ చీఫ్ నిర్ణయం కంటే సీఎం రేవంత్ రెడ్డి వర్గం, ఇతర సీనియర్ రెడ్డి నేతల 'సంప్రదింపులే' ఫైనల్ అవుతున్నాయనే టాక్ బలంగా వినిపిస్తోంది. 'వివిధ సమీకరణాల వల్ల విస్తరణ ఆలస్యం' అని మహేష్ కుమార్ గౌడ్ చెప్పడం, 'ముఖ్యమంత్రి మార్పు అంటూ విష ప్రచారం' అని ప్రభుత్వాన్ని వెనకేసుకు రావడం చూస్తుంటే, పీసీసీ అధ్యక్షుడు 'పార్టీ గొంతుక'లా కాకుండా 'ప్రభుత్వ ప్రతినిధి'లా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**సొంత పార్టీలోనే 'గుర్రు'**

'టికెట్ ఇప్పించలేదు, పదవులు రాలేదు, కనీసం సమస్య చెప్పుకుందామంటే అధ్యక్షుడు దొరకడం లేదు' అని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 2018లో నిజామాబాద్ టికెట్ త్యాగం చేసినా, పార్టీ కోసం పనిచేశానని చెప్పుకునే మహేష్ కుమార్ గౌడ్, ఇప్పుడు అదే కేడర్‌కు అందుబాటులో లేకపోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. 'పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం జరుగుతుంది' అని ఆయన చెప్పిన మాటలు కార్యకర్తల చెవుల్లో మారుమోగుతున్నా, ఆచరణలో కనిపించడం లేదనే అసహనం ఉంది.

**రెడ్డి 'పెత్తనం' నీడన పీసీసీ?**

రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత పార్టీ, ప్రభుత్వం రెండింటిపైనా ఆయన ముద్ర స్పష్టంగా ఉంది. పీసీసీ చీఫ్‌గా బీసీ నేతను నియమించినా, జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, కీలక నామినేటెడ్ పదవుల్లో రెడ్డి సామాజికవర్గం ఆధిపత్యం కొనసాగుతోందని లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నారా? లేక 'సమన్వయం' పేరుతో సీఎం వర్గం నిర్ణయాలకు ఆమోదముద్ర వేస్తున్నారా? అనే అనుమానాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి.

**నిజంగానే వెనుకబడ్డారా?**

పార్టీ అధ్యక్షుడికి ఉండాల్సిన మూడు ప్రధాన లక్షణాలు - కేడర్‌కు అందుబాటులో ఉండటం, అన్ని వర్గాలను కలుపుకుపోవడం, ప్రభుత్వానికి-పార్టీకి మధ్య వారధిగా ఉండటం. ప్రస్తుతం ఈ మూడింటిలోనూ మహేష్ కుమార్ గౌడ్ వెనుకబడ్డారనే అభిప్రాయం గాంధీభవన్‌లో వ్యక్తమవుతోంది. 'గాంధీభవన్‌కు రాని అధ్యక్షుడు, అందరికీ దొరకని నాయకుడు' అనే ముద్ర పడితే, అది పార్టీ సంస్థాగత బలానికి నష్టం చేస్తుందని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. బీసీ సామాజికవర్గానికి పీసీసీ పగ్గాలు ఇచ్చిన తర్వాత ఆ వర్గం ఆశలు పెంచుకుంది. కానీ 'ఉత్సవ విగ్రహం'లా కాకుండా, 'నిర్ణయాలు తీసుకునే అధ్యక్షుడు'గా మహేష్ కుమార్ గౌడ్ ఎప్పుడు కనిపిస్తారనేది ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్. లేకపోతే 'రెడ్డి పెత్తనం, బీసీ పీఠం' అనే విమర్శలు మరింత బలపడే ప్రమాదం ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
25 మే 2026

## ఘనంగా 2026-పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభ్యాన్

- జగిత్యాల్ జిల్లా స్థాయి శిక్షణ శిబిరం ముగింపు
- దేశాభివృద్ధి, సమాజ సేవలో కార్యకర్తల పాత్ర కీలకం
- ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలి
- గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



**జగిత్యాల్, మే 24 (జనంసాక్షి):** జగిత్యాల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభ్యాన్–2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రశిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంఘటన మహామంత్రి శ్రీ చంద్రశేఖర్ జీ హాజరయ్యారు. జగిత్యాల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బోగా శ్రావణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ సంఘటన మహామంత్రి శ్రీ చంద్రశేఖర్ జీ మాట్లాడుతూ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని సూచించారు. దేశాభివృద్ధి, సమాజ సేవలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.
కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి ఇవి దోహదపడతాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకత్వాన్ని కార్యకర్తలు అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యదర్శి భారత్, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్, అభియాన్ ఇన్‌చార్జ్ రంజిత్ మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుపు రావు, పుదరి అరుణ, రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ మరియు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## "సూపర్ ఫైటర్ కప్" 10 జిల్లాల స్థాయి కరాటే పోటీలను ప్రారంభించిన మేయర్

**కరీంనగర్ నగర నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్.**

కరీంనగర్ అర్బన్, మే 24 (జనంసాక్షి) : కరీంనగర్ నగరంలో నిర్వహించిన 10 జిల్లాల స్థాయి "సూపర్ ఫైటర్ కప్" కరాటే పోటీలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు ఆత్మరక్షణతో పాటు మానసిక ధైర్యాన్ని అందిస్తాయని తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాష్ట్ర , జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. పోటీలలో పాల్గొన్న చిన్నారులు, యువ క్రీడాకారులను మేయర్ అభినందించి విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి కరీంనగర్ నగరానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సురభి వేణుగోపాల్, సురభి అన్వేష్ , కార్పొరేటర్ చంద్ర, క్రీడాకారులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## రైతులు వరి కొయ్యలు కాలబెట్టడం మానుకోవాలి.

**ఉమ్మడి మేడిపల్లి,మే 24 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మరియు భీమారం మండలాల రైతులనుద్దేశించి మేడిపల్లి పోలీస్ మాట్లాడుతూ,వరి కొయ్యలు కాల్చడం వల్ల జరిగే నష్టాల గూర్చి, వర్షాకాలం ముందు పంటలు సాగు చేసే క్రమంలో చాలామంది రైతులు వరి కొయ్యలు కాలబెట్టడం చేస్తున్నారు. దీనివలన ఆ మంటలు వ్యాపించి ఈత వనాలు, తాడిచెట్లు, మామిడి తోటలు, పామాయిల్ చెట్లు, కరెంటు మోటార్లు పూర్తిగా కాలిపోయి మిగతా వారికి తీవ్ర నష్టాన్ని,శోకాన్ని మిగుల్చుతున్నాయి. కొన్ని గ్రామాల శివార్లో ఉన్న ఇండ్లకు, పెట్రోల్ బంకులకు, రైస్ మిల్లులకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఇలా చేయడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా, భూమిలో సహజ సిద్ధంగా ఉండే సాగుకు ఉపయోగకరమైన క్రిమి కీటకాలు చనిపోవడం జరుగుతుంది. కాబట్టి దయచేసి మనం చేసే చిన్న పొరపాటు పెద్ద ఉపద్రవాన్ని తెచ్చిపెట్టే విధంగా ఉండకూడదని రైతులందరినీ కోరుతున్నామని మేడిపల్లి పోలీస్ మీడియా సమావేశంలో తెలియజేశారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళా రైతు మృతి

**కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమన్న ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్**



**చిగురుమామిడి మే24 (జనంసాక్షి):** వ్యవసాయ బావి చుట్టూ ఉన్న చెత్తను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మహిళా రైతు మృతి చెందిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చిగురుమామిడి ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముల్కనూర్ గ్రామానికి చెందిన గోనెల నాగవ్వ(63) అనే మహిళా రైతు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి బావి చుట్టూ ఉన్న చెత్తను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడినట్లు తెలిపారు.ప్రమాదం జరిగిన సందర్భంలో అక్కడ ఎవరు లేకపోవడంతో బావిలో పడ్డ నాగవ్వను ఎవరు కాపాడలేకపోయారని,బావి పక్కన చెప్పులు,అద్దాలు కనిపించడంతో బావిలో పడ్డట్లు గుర్తించి మృతదేహాన్ని బయటకి తీసినట్లు చెప్పారు.ప్రతిరోజు ఉపాధి హామీ పనులకు వెళ్లి వచ్చే నాగవ్వ ఆదివారం సెలవు కావడంతో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ప్రమాదవశత్తు బావిలో పడి మృతి చెందడం బాధాకరమని తోటి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు.మృతురాలి కుమారుడు గోనెల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.మృతురాలికి భర్త రాజయ్య ఉన్నారు.

## నేటి నుంచి మహిళా వారోత్సవాలు

- మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే24(జనంసాక్షి):** నేటి నుంచి ఈ నెల 30 తేదీ వరకు మహిళా వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.మహిళా సంఘాల ఆర్థిక సాధికారిత, అంగన్వాడీ సేవలు బలోపేతం, మహిళల భద్రత,ఉపాధి అవకాశాలు,మహిళా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.బాల్య వివాహ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహం బతుకు ఆగం నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.బాల్య వివాహాలపై ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్లు 181,1098 ప్రచారం చేయాలన్నారు. జిల్లా అధికారులు,ఎంపీడీవోలు సంబంధిత శాఖల సిబ్బంది కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు.




## చార్ ధామ్ యాత్రలో వేములవాడ వాసి మృతి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** చార్ ధామ్ యాత్రకు వెళ్లిన వేములవాడకు చెందిన ఆకుల నరేష్ (56) మృతి చెందారు. పట్టణంలోని చెక్కపల్లి రోడ్డుకు చెందిన ఆకుల నరేష్ కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ ముషీరాబాద్ లో నివసిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఆయన భార్య ఇటీవల స్వదేశం రాగా, కుటుంబంతో కలిసి నాలుగు రోజుల క్రితం చార్ ధామ్ యాత్రకు వెళ్లారు. ఆదివారం ఉదయం కేదార్నాథ్ సమీపంలో శ్వాస సంబంధించిన సమస్య తీవ్రం కావడంతో ఆకుల నరేష్ మృతి చెందినట్లు బంధువుల ద్వారా తెలిసింది.

# పట్టపగలే మట్టి దందా..





- బొబ్బిలి చెరువు నుంచి టన్నుల కొద్దీ మట్టి తరలింపు
- రైతుల పొలాలకు మాత్రమే అనుమతి.. ఇటుక బట్టీలకు జోరుగా దందా
- అక్రమార్కులకు అండగా అధికార యంత్రాంగం?

**ఫరూఖ్‌నగర్, మే 24 (జనంసాక్షి):** షాద్‌నగర్ పట్టణ శివారులోని బొబ్బిలి చెరువు నుంచి టన్నుల కొద్దీ మట్టిని లారీలు, టిప్పర్లలో రాత్రి పగలు తేడా లేకుండా ఇటుక బట్టీలకు తరలిస్తున్న దందా జోరుగా కొనసాగుతోంది. రైతుల పంట పొలాలకు మాత్రమే అనుమతి ఇచ్చిన అధికారులు ఈ అక్రమ తరలింపును చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని బొబ్బిలి చెరువు నుంచి పెద్ద గోల్కొండ, రావిర్యాల, ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు మట్టి తరలింపు జాతీయ రహదారిపై రోజూ జరుగుతోంది. రైతుల పంట పొలాల అభివృద్ధి కోసం అనుమతులు తీసుకొని, యథేచ్ఛగా మట్టిని ఇటుక బట్టీలకు మళ్లిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టన్నుల కొద్దీ మట్టి తరలుతున్నా ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.
ఈ మట్టి దందా షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతోందని, తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకుండా అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. రైతుల పొలాలకు మాత్రమే మట్టి తరలించాలని అనుమతులు ఇచ్చినట్లు ఇరిగేషన్ ఈఈ కరుణశ్రీ తెలిపారు. ఇటుక బట్టీలకు మట్టి తరలించడం నిబంధనలకు విరుద్ధమని, ఇంతకుముందు కూడా ఇలాంటి చర్యలు జరిగితే నిలిపివేశామని, ప్రస్తుతం విషయం తెలుసుకొని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లక్షలాది రూపాయలు పోసి పొలాలు కొనుగోలు చేసిన రైతులు, సామాన్యులు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల నుంచి మట్టి అక్రమంగా తరలించడం వల్ల పర్యావరణం, వ్యవసాయం దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కొందుర్గు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

- ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- దుర్గం చెరువు గ్రామస్తులు డిమాండ్



**మోమిన్ పేట మే 24 (జనం సాక్షి) :** మోమిన్ పేట మండల పరిధిలోని దుర్గం చెరువు గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ప్రభుత్వ ఉన్నత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని దుర్గం చెరువు గ్రామస్తులు పత్రికా ముఖంగా ఉన్నత అధికారులకు డిమాండ్ చేశారు గ్రామంలో 149 సర్వే నెంబర్ లో గల భూమిలో అక్రమ నిర్మాణాలు ఏర్పడుతున్న పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే 149 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో మండల పరిషత్ కార్యాలయం రెవెన్యూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు



## అందుబాటులోకి ఆహ్లాదకరమైన పార్కు

- రాజీవ్‌నగర్ ప్రాంతానికి కొత్త సొబగులు
- బోడుప్పల్‌వాసులకు ఇకనుంచి స్వచ్ఛ వాతావరణం
- రూ.3 కోట్లతో 3 వేల గజాల్లో ఆధునిక పార్కు
- మొదటి దశలో ప్రహరీ గోడ నిర్మాణం

**బోడుప్పల్, మే 22 (జనంసాక్షి):** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రాంత ప్రజలకు త్వరలోనే ఒక ఆహ్లాదకరమైన పార్కు అందుబాటులోకి రానుంది. మార్కెట్ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఆధునిక పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ తెలిపారు.
సుమారు మూడు వేల గజాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ పార్కు ద్వారా స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం, ఉదయం–సాయంత్రం వాకింగ్‌కు అనువైన స్థలం, చిన్నారులకు వినోదం, వృద్ధులకు విశ్రాంతి కల్పించేలా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న నగరీకరణ మధ్య ప్రజలకు పచ్చదనం అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.
ప్రస్తుతం పార్కు కోసం ఎంపిక చేసిన ప్రదేశంలో బండరాళ్లు, మట్టి గుట్టలు, కొన్ని ఆక్రమణలు ఉన్నాయని, వాటిని పూర్తిగా తొలగించి స్థలాన్ని చదును చేసే పనులను త్వరలో ప్రారంభిస్తామని డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. పార్కు అభివృద్ధిలో తొలి దశగా మొత్తం స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేదా డాక్యుమెంట్లు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుని వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు.
ప్రజల కోసం ఉపయోగపడే పార్కు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోనివ్వమని అధికారులు పేర్కొన్నారు. ఈ పార్కు అభివృద్ధి పూర్తయితే రాజీవ్‌నగర్ ప్రాంతానికి కొత్త అందం చేకూరడమే కాకుండా, స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కరీంనగర్‌లో "ఆర్థ్రోస్కోపీ వైద్య సదస్సు" విజయవంతం





- తెలుగు రాష్ట్రాల సీనియర్, జూనియర్ వైద్యులు, విద్యార్థులు హాజరు
- ఆర్గనైజింగ్ చైర్మన్, రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బంగారి స్వామి

**కరీంనగర్ బ్యూరో, మే 24 (జనంసాక్షి) :** ఆధునిక యుగం – వైద్యరంగంలో అత్యంత సంక్లిష్టమైన, అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించే ఆర్థోపెడిక్ ఆర్థోస్కోపిక్ కీ హోల్ సర్జరీ ప్రదర్శనకు కరీంనగర్ పట్టణం వేదికగా మారింది. ఇండియన్ ఆర్థోస్కోపిక్ సొసైటీ జాయింట్ ప్రెజర్వేషన్ ప్రోగ్రాంలో భాగంగా తెలంగాణ ఆర్థోస్కోపిక్ సొసైటీ, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, కరీంనగర్ ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్ సంయుక్త అధ్వర్యంలో కరీంనగర్ పట్టణ కేంద్రంగా వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్య సంస్థ అయిన "రేనే గ్రూప్ అఫ్ హాస్పిటల్స్" ఈ సదస్సులో నిర్వహించే శస్త్ర చికిత్సలకు వేదికైంది. శస్త్ర చికిత్సలు నిర్వహించడంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆర్థోపెడిక్ ఆర్థోస్కోపిక్ శస్త్ర చికిత్స నిపుణులు పాలుపంచుకోగా శస్త్ర చికిత్సలను లైవ్ టెలికాస్ట్ ద్వారా హోటల్ త్రిధ కరీంనగర్‌లో నిర్వహించిన సీఎంఇ ప్రోగ్రాం ద్వారా ప్రదర్శించడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్, ఆర్థోపెడిక్ సర్జన్స్, ఆర్థోపెడిక్ పీజీ వైద్య విద్యార్థులు సుమారు 300 మంది పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రదర్శనకు ఎంపిక చేయబడ్డ ప్రత్యక్ష శస్త్ర చికిత్సలు డాక్టర్ సాయి వీర్ల, డాక్టర్ నితిన్ కుమార్ బెజ్జంకి, డాక్టర్ పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ రమాకాంత్ రాజగోపాల్ కృష్ణన్, డాక్టర్ సుఖేష్ రావు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బంగారు స్వామి మాట్లాడుతూ.. తాము వైద్య విద్య అభ్యసించే రోజుల్లో ఇలాంటి సమావేశాలు కేవలం డిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి ప్రముఖ పట్టణాల్లో మాత్రమే జరిగేవని, కానీ నేటి వైద్య విద్యార్థులకు కరీంనగర్ లాంటి జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి అంతర్జాతీయ స్థాయి వైద్య సదస్సులు జరగడం ద్వారా మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ లైవ్ సర్జరీ కార్యక్రమానికి సహకరించిన మత్తు వైద్య నిపుణులు డా. మునీష్, డా.కృష్ణా రెడ్డి, ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ ఆర్ర్టోస్కోపిక్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జై ప్రసాద్ పెద్ది, ఇండియన్ ఆర్ర్టోస్కోపిక్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ శ్రీధర్ గంగవరపు లకు ధన్యవాదాలు తెలుపుతూ ఇలాంటి కార్యక్రమాలకు వారి నుంచి అందుతున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## యువతకు ఆదర్శం.. రాష్ట్ర అభివృద్ధికి కృషి

- రైతు బిడ్డ నుంచి టీపీసీసీ అధ్యక్షుడి వరకు మహేష్ గౌడ్ ప్రస్థానం ఆదర్శం
- ప్రతిపక్షాల అభాండాల వెనుక భయం కనిపిస్తోంది
- మహేష్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బలోపేతం



**కరీంనగర్ బ్యూరో, మే 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ రథసారధి, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆదివారం కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు పలువురు నేతలు హాజరై పుట్టినరోజు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ, మాజీ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులుగా, ఒక బలహీన వర్గాలకు చెందిన రైతు బిడ్డగా, టీపీసీసీ అధ్యక్షుని స్థాయి వరకు ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ పై కొంతమంది కుట్రలు చేయాలని చూస్తున్నప్పటికీ, ప్రతిపక్షాలు గత రెండు రోజులుగా మహేష్ కుమార్ గౌడ్‌పై అభాండాలు వేయాలని చూడడం వారిలో ఉన్న భయాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వారికి అండగా నిలబడడం జరిగిందన్నారు. వారి నాయకత్వంలో రాబోయే శాసనసభ ఎన్నికల్లో మరొక్కసారి ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి మేమంతా ఆఫీస్ చేస్తామని తెలియజేస్తూ, టీపీసీసీ అధ్యక్షులుగా బి. మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సౌమ్యుడిగా, అందరినీ కలుపుకుపోయే నాయకుడిగా ఆయనకు పేరుందని, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామ్ రెడ్డి రామ్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అహమ్మద్ అలీ, వరాల నర్సింగం, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, మూల రవీందర్ రెడ్డి, మూల జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు

**హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపల్ అధ్యాపక బృందం**



**గంభీరావుపేట మే 24 (జనం సాక్షి);**
గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాలయం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పర్యావరణ పరిరక్షణ హరిత కార్యక్రమములో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళాశాలకు "ప్లాటినం సస్టైనబుల్ క్యాంపస్ పార్ట్నర్ " జాతీయస్థాయి గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. వి. విజయలక్ష్మి తెలిపారు.ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్, ఎన్విరాన్ మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రాం – జాతీయ సుస్థిర క్యాంపస్ మిషన్ 2026 లో భాగంగా ఈ అవార్డును ప్రకటించారని ప్రిన్సిపాల్ తెలిపారు. గత నెల 22 నుండి 29 వరకు నిర్వహించిన ధైత్రి వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాలలో చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలకు గాను ఈ గుర్తింపు దక్కిందన్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుగుణంగా కళాశాల క్యాంపస్‌లో మొక్కలు నాటడం, నీటి పొదుపు, పరిశుభ్రత నిర్వహణ, విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై విజయవంతంగా నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించిందన్నారు. జూన్ 1న గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరగబోయే సస్టైనబుల్ క్యాంపస్ ఇంప్లాక్ట్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2026 సదస్సుకు హాజరు కావాలంటూ ఇప్పటికే ఆహ్వానం అందిందన్నారు.
జాతీయస్థాయి గుర్తింపు లభించడంలో కీలక పాత్ర పోషించిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు సూచరణ్ ను ప్రిన్సిపాల్ అభినందించారు. అదేవిధంగా ఈ గుర్తింపు రావడానికి సహాయ సహకారాలు అందించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్. ప్రభాకర్, కోఆర్డినేటర్ వై. ఆంజనేయులు, టస్క్ కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, ఎన్ఎస్ఎస్. పి. ఓ.పాక ధర్మపురి, స్కాలర్షిప్ కోఆర్డినేటర్ ఆదివిష్ణు, వాణి,. కేవీ బిక్షమయ్య, మనోహర్,శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, మహేష్, దీపికా, భార్గవి, శంకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
25 మే 2026

# మహబూబ్‌నగర్‌లో వర్షభీభత్సం

- ఈదురు గాలులతో ... అపార నష్టం
- చేతికందిన బొప్పాయి తోట పూర్తిగా నాశనం ..
- భోరున విలపిస్తున్న రైతన్న

**మహబూబ్ నగర్ ప్రతినిధి మే 24(జనం సాక్షి ):** అకాల వాతావరణ మార్పులతో ఒక్కసారిగా వీచిన బలమైన గాలులకు బొప్పాయి తోట భారీ నష్టాన్ని చవిచూశాయి. బలమైన ఈదురు గాలుల ప్రభావంతో ఎన్నో చెట్లు నేలకొరిగిపోయాయి. ఇంకా కోతకు సిద్ధంగా ఉన్న వేలాది బొప్పాయి కాయలు చెట్ల నుంచి రాలిపోవడంతో రైతు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలోనే ప్రకృతి విరుచుకుపడటంతో రైతుల కష్టాలు వృథా అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పూర్తిగా దెబ్బతినడంతో పెట్టిన ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన తమకు ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రకృతి విపత్తులతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పాలమూరు జిల్లాలో ఈదురుగాలులు , గాలివానతో అపారనష్టం కలిగింది. శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా



భారీ ఈదురుగాలి వానతో రైతన్న తీవ్రంగా నష్టపోయారు. ఈ గాలివాన బీభత్సము తో పాలమూరు జిల్లా కేంద్రం లోని అప్పన్నపల్లి లో బాలకృష్ణ అనే రైతు బొప్పాయి తోట పూర్తిగా నాశనమైపోయింది . పంట చేతికంది వచ్చే సమయానికి ఇలా జరగడంతో రైతన్న లబోదిబోమని భోరున విలపించాడు . సుమారుగా 10 లక్షల పెట్టుబడి పెట్టి మరికొన్ని రోజుల్లో అమ్మకానీజీ సిద్దమైన తరుణంలో అకాల వర్షం గాలివాన రైతన్న నోట్లో మట్టికొట్టింది .



బొప్పాయితోట పూర్తిగా నష్టపోయిన రైతు బాలకృష్ణ మాట్లాడుతూ మా పంట పూర్తిగా నష్టపోయింది, సుమారుగా 20 లక్షల వరకు నష్టం జరిగిందని, ఈ పండ్లు పూర్తిగా రాలిపోయి దిక్కుదోచని స్థితిలో ఉన్నాను . రాష్ట్ర ప్రభుత్వం దయ ఉంచి మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాని తెలిపారు . భారీగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు .

## పిడుగుపడి వ్యక్తి మృతి

### పిడుగు పడి గడ్డివాములు దగ్ధం

**చిన్నంబావి, మే 24 (జనంసాక్షి) :** చిన్నంబావి మండలం లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు కాసేపు ఉపశమనం కలిగించిన రైతులకు మాత్రం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం భారీ వర్షం కారణంగా తడిసి ముద్దయింది. పలుచోట్ల ధాన్యం కుప్పల పైన కప్పిన టార్పాలిన్ కవ్వర్లు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. చిన్నంబావి కొల్లాపూర్ ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకొరిగి రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. మండలంలోని పలు గ్రామాలలో కరెంటు స్తంభాలు విరిగిపోయాయి. దగడపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మండల కేంద్రంలోని చెల్లపాడు, వెంకటాంపల్లి



గ్రామానికి చెందిన బెల్లరి నాగార్జున (32) శనివారం రాత్రి గొర్రెల మంద దగ్గర ఉన్నాడు. ఆ సమయంలో ఒక్కసారిగా భారీగా ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో గ్రామ శివారు లో రాళ్ల నట్టు దగ్గర పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

## అకాల వర్షానికి అస్తవ్యస్తంగా మారిన రహదారులు

- తడిసిన వరి ధాన్యం

**మిడ్జిల్, మే 24 (జనం సాక్షి) :** మిడ్జిల్ మండల పరిధిలోని అకాల వర్షానికి అస్తవ్యస్తంగా మారిన రహదారులతో పాటు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను వరుణదేవుడు కనికరం లేకుండా కురిసిన వర్షానికి రైతన్నలు ఇబ్బందులకు గురి కావడం జరిగింది వర్షానికి దర్శనం ధాన్యాన్ని ప్రభుత్వమే షరతుగా కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా వచ్చిన గాలివానకు దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు. కురుస్తున్న వర్షానికి వరి ధాన్యం తడిచి రోడ్లపై ధాన్యం కొట్టుకపోతుంటే రైతులు ఆవేదన పడుతున్నారు. దర్శన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని రహదారుల వెంబడి భారీగా చెట్లు విరిగి వాన దారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



గ్రామంలోని విద్యుత్ స్తంభాలతో పాటు ఇండ్ల పైకప్పు గాలికి ఎగిరిపోయాయి. వాడ్యాల గ్రామంలో గత వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న వేపచెట్టు కుప్పకూలిపోయింది. అదేవిధంగా రహదారుల వెంట చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. విరిగిన చెట్లను ఆయా గ్రామాల సర్పంచులు జెసిబిల సహాయంతో శుభ్రం చేశారు.

## జడ్చర్లలో గాలివాన బీభత్సం

- అతలాకుతలమైన పట్టణం
- తడిసిన అన్నదాతల కష్టం, రైతాంగం ఆవేదన

జడ్చర్ల, మే 24 (జనంసాక్షి): జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ముంచెత్తింది. అప్పటివరకు సాధారణంగా ఉన్న వాతావరణం క్షణాల్లోనే చీకటిగా మారి, వానతో పాటు వీచిన బలమైన గాలులు పట్టణాన్ని అతలాకుతలం చేశాయి. ఈ హఠాత్ పరిణామానికి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలివాన తీవ్రతకు పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై, కాలనీలలో పాత చెట్లు, పెద్ద పెద్ద కొమ్మలు విరిగిపడ్డాయి.చెట్టు కొమ్మలు విరిగి పార్క్ చేసి ఉన్న కార్లపై పడ్డాయి. కొన్ని చోట్ల హోర్డింగులు, ఫ్లెక్సీలు గాల్లోకి లేచిపోయాయి. బలమైన గాలుల కారణంగా విద్యుత్ తీగలు తెగిపడటం, స్తంభాలు వంగిపోవడంతో జడ్చర్ల పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రోడ్లపై చెట్లు విరిగిపడటంతో



వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ అకాల గాలివాన స్థానిక రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. ఎంతో కష్టపడి సాగు చేసి, చేతి కొచ్చిన పంటలు, మార్కెట్ యార్డులు, కల్లాలలో ఆరబోసిన ధాన్యం కురిసిన వర్షానికి తడిసిముద్దవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పండించిన పంట కళ్లముందే నీటి పాలవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అలాగే పలుచోట్ల ఇళ్లపై రేకులు కొట్టుకుపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు నాయకులు తెలియజేశారు.




## ఆరోగ్యవంతమైన సమాజమే శక్తివంతమైన దేశానికి పునాది

- ఆరోగ్యరంగ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** ఆరోగ్యవంతమైన సమాజమే శక్తివంతమైన దేశ నిర్మాణానికి పునాది అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. దేశంలో ఆరోగ్యరంగ బలోపేతానికి పీఎం నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందనీ గవర్నర్ పేర్కొన్నారు. శనివారం జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్' కార్యక్రమంకు రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులను జ్ఞాపిక తో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ "వైద్యో నారాయణో హరి" అనే భారతీయ సంస్కృతి విలువలను ప్రస్తావించిన ఆయన, వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది కేవలం రోగాలను నయం చేయడమే కాకుండా ప్రజల్లో ఆశ, నమ్మకం కల్పిస్తున్నారని అన్నారు. భారతదేశం వైద్య సేవలు, వైద్య పరిశోధనలు, ఆరోగ్య రంగ ఆవిష్కరణల్లో విశేష పురోగతి సాధిస్తోందని పేర్కొన్న గవర్నర్, తెలంగాణ ముఖ్యంగా హైదరాబాద్ ప్రపంచ స్థాయి ఆసుపత్రులు, అత్యాధునిక వైద్య సాంకేతికత, ఔషధ పరిశ్రమలకు కేంద్రంగా ఎదిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్, కొత్త ఎయిమ్స్ సంస్థలు, మెడికల్ కళాశాలలు, డిజిటల్ హెల్త్ మిషన్ వంటి కార్యక్రమాలు దేశ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ కు ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని గవర్నర్ కోరారు. కోవిడ్ మహమ్మారి సమయంలో హైదరాబాద్ దేశానికి ఆశాకిరణంగా నిలిచిందని, కోవాక్సిన్ అభివృద్ధి భారత శాస్త్రీయ సామర్థ్యానికి నిదర్శనమని గవర్నర్ అన్నారు. యువ వైద్యులు విజ్ఞానంతో పాటు సేవాభావం, నైతికత, మానవత్వాన్ని తమ వృత్తి ధర్మంగా స్వీకరించాలని ఆయన సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో మీడియా పాత్ర కీలకమని, జీ తెలుగు న్యూస్ సామాజిక బాధ్యతతో హెల్త్ కేర్ లో విశేష సేవలు అందించిన వైద్యులకు ఎక్సలెన్స్ అవార్డులు అందిస్తూ ప్రోత్సహిస్తోందని ప్రశంసించారు. అవార్డు గ్రహీతలు, వైద్య సంస్థలు, నిర్వాహకులకు గవర్నర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ్యులు డా. ఎం. సంజయ్ కుమార్, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్-ఛైర్మన్ డా. సి.హెచ్. ప్రీతి రెడ్డి, జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

## గౌడ సోదరులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, నిప్పు రవ్వల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వరుస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఈత, తాటి వనాలు దగ్ధమవుతున్న నేపథ్యంలో గౌడ సోదరులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈత, తాటి చెట్లు గీతా కార్మికుల జీవనాధారమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామం, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొలనూరు ప్రాంతాల్లో ఈత వనాలు పూర్తిగా దగ్ధమై గౌడ కుటుంబాలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఈత, తాటి చెట్ల కింద ఎండిపోయిన ఆకులు, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. గ్రామ స్థాయిలో గీతా కార్మికులు కలిసి చెట్ల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, చెట్లకు నీరు పట్టడం, ఎండు చెత్త తొలగించడం వంటి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అలాగే ఈత, తాటి వనాల సమీపంలో బీడీలు, సిగరెట్లు కాల్చకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎవరూ నిర్లక్ష్యంగా నిప్పు వేయకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గీతా కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించినట్లు మంత్రి తెలిపారు. ఈత, తాటి వనాలను కాపాడుకోవడం ద్వారా గౌడ కుటుంబాల జీవనోపాధిని రక్షించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## మహిళా సాధికారతకు కొత్తదిశ

- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ఆదాయ వనరులు కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం
- మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వేత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 24 (జనంసాక్షి) :** తెలంగాణలో మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం కొత్త అర్థం చెబుతోంది. ఒకప్పుడు కేవలం పొదుపు సంఘాలుగా ఉన్న మహిళా స్వయం సహాయక బృందాలు... ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామ్య శక్తులుగా ఎదుగుతున్నాయి. ఆడబిడ్డలను సంక్షేమ లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం, పోషణ, పారిశ్రామిక ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మహిళా వారోత్సవాల సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలు, సెర్ప్, మెప్మాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు, యువతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సాధికారత కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వెత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క మార్గదర్శకత్వంలో మహిళా సంఘాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. మహిళా సంఘాలకు ఈ ఐదేళ్లలో బ్యాంక్ లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయల రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల రుణాలు అందించారు. వీటి ద్వారా వేల లక్షల సంఖ్యలో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1397 కోట్ల వడ్డీ రాయితీ మహిళా సంఘాలకు ప్రభుత్వం చెల్లించగా..మహిళా వారోత్సవాల్లో మరో రూ.650 కోట్లను చెల్లించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమం ద్వారా మహిళలను స్వయం ఉపాధి రంగంలో బలోపేతం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 222 మహిళా సంఘాల క్యాంటీన్లు ఏర్పాటు కాగా... ఒక్కో యూనిట్ నెలకు సగటున రూ.72 వేల వరకు లాభాలు ఆర్జిస్తోంది. మహిళల నిర్వహణలో పెట్రోల్ బంకులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెండు యూనిట్లు ప్రారంభం కాగా... మరో 30 పెట్రోల్ బంకుల నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి.

మహిళా సమాఖ్యలు రూ.199 కోట్ల పెట్టుబడితో 553 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన టీజీఎస్ఆర్టీసీకి అందించాయి. ఒక్కో బస్సు ద్వారా నెలకు సుమారు రూ.70 వేల వరకు ఆదాయం లభిస్తోంది. అలాగే వరి కొనుగోలు కేంద్రాలు, పాల విక్రయ కేంద్రాలు, మైక్రో వ్యాపారాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థల ద్వారా మహిళలు ఆదాయం పెంచుకుంటున్నారు. గ్రామీణ మహిళలను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సెర్ప్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రైతులు పండించిన పంటలను మధ్య దళారులు లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమవుతున్నాయి. మామిడి, మిర్చి, పసుపు, కంది వంటి పంటలను రిటైల్ చైన్‌లు, ఈ-కామర్స్ వేదికలు, ఎగుమతి మార్కెట్లకు సరఫరా చేసే వ్యవస్థను అభివృద్ధి చేశారు. మహిళా రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ, గ్రేడింగ్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్, రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇక్రిసాట్ సంస్థతో కలిసి ఫుడ్ ప్రాసెసింగ్ యునిట్లలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. వేయి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాలకు కేటాయించగా... మహిళా వారోత్సవాల సందర్భంగా 6 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ప్రారంభించనున్నారు. అలాగే రూ.110 కోట్ల వ్యయంతో 22 జిల్లాల్లో నిర్మిస్తున్న "ఇందిరా మహిళా శక్తి భవనాలు" మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలవనున్నాయి.

మే 25న ఇందిరా మహిళా శక్తి భవనాల శంకుస్థాపనలకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రామ, మండల స్థాయిలో మహిళా సంఘాలకు మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో కొత్త ఐఎంఎస్ భవనాలకు శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో 8 వేల ఐఎంఎస్ భవనాలకు ఒకేసారి శంకుస్థాపనలు జరగనున్నాయి. మహిళా సంఘాల కోసం ప్రత్యేక చీరలను కూడా రాష్ట్ర స్థాయిలో ఆవిష్కరించనున్నారు. గ్రామ, మండల స్థాయిలో వీవో/ఎంఎస్ భవనాలు, న్యూట్రిషన్ హెల్త్ సెంటర్లు, వర్క్ షెడ్లు, గోదాముల నిర్మాణాలకు భూమిపూజలు చేపట్టనున్నారు. మే 26న 553 ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం చేయనున్నారు. మహిళా సమాఖ్యలకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో కొనుగోలు చేసిన 553 ఆర్టీసీ బస్సులను రాష్ట్ర స్థాయిలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. **మే** 27న సోలార్ ప్లాంట్ల ప్రారంభం, ప్రత్యేక సాధారణ సమావేశాలు నిర్వహించనున్నారు. వికారాబాద్, మధిర ప్రాంతాల్లో మహిళా సమాఖ్యలకు మంజూరైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రారంభించనున్నారు. మండల సమాఖ్యలు, ఏరియా లెవల్ ఫెడరేషన్లలో ప్రత్యేక సాధారణ సమావేశాలు నిర్వహించి 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమాల పురోగతిని సమీక్షించనున్నారు. నాయకత్వ మార్పిడి, నిధుల విడుదల, ఉత్తమ మండల సమాఖ్యలకు సన్మానాలు, 2026-27 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేపట్టనున్నారు. మే 29న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక వనరులు, ఉపాధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో లోన్ మేళాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, వ్యవసాయేతర రంగాల్లో కొత్త జీవనోపాధి యూనిట్లను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ భవన్‌లో ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. బ్యాక్‌యార్డ్ కోళ్ల యూనిట్లు, కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ ఫండ్, అగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు, షెడ్ నెట్లు, గోదాముల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నరాఢ. మహిళా దివ్యాంగులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే మహిళా సంఘాల వెలుపల ఉన్న మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బాలికలను గుర్తించి కొత్త ఎస్‌హెచ్‌జీలుగా ఏర్పాటు చేయనున్నారు.

మే 30న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 'అమ్మకు అక్షరమాల' ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను జిల్లా, మండల స్థాయిలో సన్మానించనున్నారు. అదే రోజు స్నేహ బాలికల కోసం జిల్లా కేంద్రాల్లో మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు నిర్వహించి నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించనున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370